www.prajapaksham.in
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★★★
# ప్రజాపక్షం
సంపుటి 09, సంచిక: 50 | ఆదివారం | 18-01-2026 | ఖమ్మం
పేజీలు: 12+8 వెల రూ. 5.00
Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**




50 శాతం కార్పొరేషన్లు
## మహిళలకే

- 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ఖరారు
- ప్రభుత్వం జిఒ జారీచేసిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు మునిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి శనివారం ఖరాయిన రిజర్వేషన్‌ల జాబితాను తరువాయి 2లో



బహిరంగ సభకు ముందు ఖమ్మం నగరమంతా కలియతిరిగేలా ఎర్ర సైన్యం మూడు ప్రాంతాల నుంచి ప్రదర్శనగా రానున్నాయి. పెవిలియన్ స్టేడియం, నయా బజార్ కాలనీ రోడ్, వైరా క్రాస్ రోడ్ 'శ్రీ శ్రీ విగ్రహం' నుంచి ఈ ప్రదర్శనలు సరిగ్గా మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయి.

# కదలివస్తోంది అరుణదండు

సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు ఖమ్మం ముస్తాబు
నేడు లక్షలాది మందితో భారీ ప్రదర్శన
ఖమ్మం నగరం మూడు ప్రాంతాల నుంచి కదలిరానున్న ఎర్రసైన్యం

బొమ్మగాని కిరణ్‌కుమార్

ఖమ్మం : వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ)కి అరుణవందనం చేసేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం నగరం సిద్ధమైంది. శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం జరిగే జాతీయ స్థాయి భారీ బహిరంగ సభకు నగరం సర్వ సన్నద్ధమైంది. నగరమంతా ఎటు చూసినా అరుణ పతాకాలు, హోర్డింగ్‌లు, తోరణాలతో ఎర్ర శోభను సంతరించుకుంది. సభ జరిగే ఎన్ఆర్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో శనివారం సాయంత్రానికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీ స్థాయిలో ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మూడు ప్రాంతాల నుంచి ప్రదర్శనలు ప్రారంభమవుతాయి. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే బహిరంగ సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. శనివారం సాయంత్రం ఎన్ఆర్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాట్లను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, నేతలు తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, కలవేన శంకర్‌లు పర్యవేక్షించారు. 1925లో సిపిఐ ఆవిర్భవించిన కాన్పూర్‌లోనే 2024 డిసెంబర్ 26న సభలో జాతీయ స్థాయి సిపిఐ శతాబ్ది ఉత్సవాలను డి.రాజా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఏడాది కాలంలో దేశ వ్యాప్తంగా అన్ని తరువాయి 12లో

బహిరంగ సభ ప్రదర్శకులకు సూచనలు 03

### బహిరంగ సభ సాగుతుందిలా..

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగే శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభలో తొలుత ఆహ్వానం సంఘ ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు అతిథులకు స్వాగతం పలుకుతారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో డి.రాజా శతాబ్ది ముగింపు ఉత్సవాల సందర్భంగా వందేళ్ల చరిత్రను అవలోకనం, భవిష్యత్తు దిశా నిర్దేశం చేస్తూ సందేశమివ్వనున్నారు. తరువాత ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సాహార్థ సందేశం ఇస్తారు. ఇంకా సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ, వెటరన్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు ప్రసంగిస్తారు.కమ్యూనిస్టు ప్రభుత్వాలు అధికారంలో ఉన్న క్యూబా, చైనా, పాలస్తీనా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా తదితర దేశాల పార్టీ ప్రతినిధులు సందేశాలు ఇస్తారు. సభకు సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేశ్ వందన సమర్పణ చేస్తారు.


12
ఢిల్లీలోని డిపిఆర్ కొరియా ఎంబసి ప్రతినిధులకు హైదరాబాద్‌లో స్వాగత దృశ్యం

## నేడు మేడారంలో కేబినేట్ భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆదివారం సాయంత్రం 5 గంటలకు మేడారంలోని హరిత హోటల్‌లో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మేడారం జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, నిధుల విడుదల వంటి అంశాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వివిధ శాఖల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, త్వరలో జరగనున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల తేదీల ఖరారు, మున్సిపల్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణ, రైతులకు అందాల్సిన రైతు భరోసా నిధుల విడుదల, హ్యామ్ రోడ్ల నిర్మాణం వంటి సదుపాయాల కల్పనకు సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉంది. కాగా తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా మంత్రివర్గం సమావేశం ములుగు జిల్లా ధర్మారం మండలంలోని ఒక మారుమూల గ్రామం మేడారంలో జరగనుండడం గమనార్హం.



## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే...

- ఇండోర్‌లో కలుషిత నీటి వల్ల సంభవించిన మరణాలపై రాహుల్‌గాంధీ మండిపాటు
- పరిశుభ్రమైన నగరంగా పేరొందిన ఇండోర్‌పై పలు ప్రశ్నలు లేవనెత్తిన ప్రతిపక్షనేత
- బాధిత కుటుంబాలకు పరామర్శ: ఘటనపై ప్రభుత్వంలో ఒకరిని బాధ్యులను చేయాలని డిమాండ్

**ఇండోర్ :** దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరమైన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషితమైన తాగునీటి వల్ల సంభవించిన మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పట్టణ నమూనాపై పలు రకాల ప్రశ్నలు లేవనెత్తారు. రాహుల్‌గాంధీ శనివారం ఇండోర్‌లోని భాగీరథపురలో నీటి కాలుష్యం కారణంగా వాంతులు, విరేచనాల బారిన పడిన రోగులను, వారి కుటుంబాలను కలిశారు. పరిశుభ్ర నీరు ప్రజల హక్కు అని రాహుల్ తరువాయి 2లో

పాలమూరును కెసిఆర్
## ఎడారిగా మార్చారు

- 90 శాతం పనులు జరిగినా ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలే
- రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి కట్టిన కాళేశ్వరంలో కమీషన్లు తీసుకున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపాటు

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్

రాష్ట్రాన్ని పదేళ్లుగా పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రాజెక్టు పూర్తి చేయకుండా పాలమూరు జిల్లాను ఎడారిగా మార్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 90 శాతం పనులు పూర్తి అయిన భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి కోయిల్‌సాగర్ పాలమూరు–రంగారెడ్డి వంటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని మాజీ సిఎం కెసిఆర్‌ను నిలదీశారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని అప్పర్ల వద్ద ఐఐఐటి క్యాంపస్‌కు, రూ.1463.94 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మహబూబ్‌నగర్‌లోని ఎంవిఎస్ కళాశాల ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఆనాటి కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపి విఠల్‌రావు అప్పటి మంత్రి డికె అరుణ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి 2013 లో మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రూ.25 వేల కోట్ల అంచనాలతో ప్రారంభం అయిన ప్రాజెక్టు పనులు బిల్లులు ఎత్తూరు తప్ప రైతులకు భూసేకరణ పరిహారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మాణం పేరుతో కమీషన్లు తీసుకున్నారు. కాని సంగం బండకు కనీసం రూ. 10 కోట్లు ఇచ్చి లక్షల ఎకరాలకు సాగునీరు అందించలేక పోయారని ఆయన తరువాయి 2లో



రోహిత్ వేముల
## చట్టం తీసుకొస్తాం

జస్టిస్ ఫర్ రోహిత్ వేముల క్యాంపెయిన్ కమిటీతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో వీలైనంత తొందరగా రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మల్లు చెప్పారు. ప్రజాభవన్‌లో శనివారం జస్టిస్ ఫర్ రోహిత్ వేముల క్యాంపెయిన్ కమిటీ సభ్యులతో డిప్యూటీ సిఎం సమావేశం అయ్యారు. రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టం తీసుకురావాలని దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారని ఆయన గుర్తు తరువాయి 2లో

ఇయుతో వాణిజ్య ఒప్పందం
## శుభ సంకేతం

బ్రెజిల్ అధ్యక్షుడు లులా డి సిల్వ




**రియో డి జనీరో:** యూరోపియన్ యూనియన్ (ఇయు)–మెర్కోసూర్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఓ శుభ సాంకేతమని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డి సిల్వ వ్యాఖ్యానించారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ శుక్రవారం ఈ చారిత్రక ఒప్పందాన్ని స్వాగతించారు. అయితే పరాగ్వే రాజధాని అసున్సియోన్‌లో జరిగే సంతక కార్యక్రమానికి లులా హాజరుకావడం లేదు. ఆయన తరఫున విదేశాంగ మంత్రి మౌరో వియెయిరా పాల్గొననున్నారు. బ్రెజిల్, అర్జెంటీనా, పరాగ్వే, ఉరుగ్వేలను కలిగిన మెర్కోసూర్‌కు ఇది తొలి ప్రధాన వాణిజ్య ఒప్పందం. 25 ఏళ్లుగా సాగిన చర్చల అనంతరం కుదురుతున్న ఈ ఒప్పందంతో సుమారు 720 మిలియన్ జనాభా, 22 ట్రిలియన్ డాలర్లకు పైగా జిడిపి ఉన్న ప్రపంచంలోని అతిపెద్ద స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతాల్లో ఒకటి ఏర్పడనుంది. తాజా తరువాయి 12లో

సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభకు
విచ్చేయుచున్న వారికి
స్వాగతం - సుస్వాగతం
వందేళ్ల ప్రస్థానం.. మడిమ తిప్పని పోరాటాలు..
అపూర్వ పోరాట విజయాలు..
నిత్యం జనపక్షం - ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
ప్రజా పోరాటాలకు పున:రంకితమవుతూ రెండవ శతాబ్దంలోకి
అడుగిడిన సందర్భంగా జరుగుతున్న బహిరంగ సభకు విచ్చేయుచున్న
సిపిఐ నాయకులు, కార్యకర్తలు, కమ్యూనిస్టు పార్టీ అభిమానులందరికీ
స్వాగతం.. సుస్వాగతం
CENTENARY OF STRUGGLES & SACRIFICES
ఆహ్వాన సంఘం :
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)

# గ్రీన్‌ల్యాండ్‌పై మద్దతు ఇవ్వని దేశాలపై సుంకాలు పెంపు

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

**కోపెన్‌హేగన్:** గ్రీన్‌ల్యాండ్‌పై అమెరికా నియంత్రణకు మద్దతు ఇవ్వని దేశాలపై సుంకాలు (టారిఫ్‌లు) విధించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. నాటో మిత్రదేశమైన డెన్మార్క్‌కు చెందిన ఆర్థిక స్వయంప్రతిపత్తి ప్రాంతమైన గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా నియంత్రించాలంటూ ట్రంప్ నెలలుగా కోరుతున్న విషయం తెలిసిందే. వైట్ హౌస్‌లో గ్రామీణ ఆరోగ్య సంరక్షణపై జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, యూరోపియన్ మిత్రదేశాల ఔషధాలపై టారిఫ్‌లు విధిస్తామని తాను గతంలో హెచ్చరించిన విషయాన్ని ట్రంప్ గుర్తు చేశారు. 'గ్రీన్‌ల్యాండ్ విషయంలో కూడా అలాగే చేయవచ్చు. గ్రీన్‌ల్యాండ్‌కు మద్దతు ఇవ్వని దేశాలపై టారిఫ్‌లు విధించవచ్చు, ఎందుకంటే అది మా జాతీయ భద్రతకు అవసరం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. గ్రీన్‌ల్యాండ్ అంశంలో టారిఫ్ అస్త్రాన్ని ప్రయోగించాలన్న ఆలోచనను ట్రంప్ తొలిసారిగా ప్రస్తావించడం గమనార్హం. ఈ వారం ప్రారంభంలో డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ విదేశాంగ మంత్రులు వాషింగ్టన్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియోలను కలిశారు. ఈ సమావేశం విభేదాలను పరిష్కరించకపోయినప్పటికీ, ఒక వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయడానికి అంగీకారం కుదిరింది. అయితే ఆ గ్రూప్ ఉద్దేశంపై డెన్మార్క్, వైట్ హౌస్ భిన్న వ్యాఖ్యానాలు చేశాయి. యూరోపియన్ నేతలు ఇందుకు సంబంధించిన నిర్ణయాలు డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ తీసుకోవాల్సినవేనని స్పష్టం చేశారు. ఇదే సమయంలో, మిత్రదేశాల సహకారంతో గ్రీన్‌ల్యాండ్‌లో సైనిక ఉనికిని పెంచుతున్నట్లు డెన్మార్క్ ప్రకటించింది. కోపెన్‌హేగన్‌లో శుక్రవారం అమెరికా సెనేటర్లు, హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ సభ్యులు డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ శాసనసభ్యులు, అలాగే డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడరిక్‌సన్‌తో సమావేశమయ్యారు. ప్రతినిధి బృందం నేత సెనేటర్ క్రిస్ కూన్స్, డెన్మార్క్‌ను 225 ఏళ్ల విశ్వసనీయ మిత్రదేశంగా ప్రశంసించారు. గ్రీన్‌ల్యాండ్‌ను ఆస్తిగా కాదు, మిత్రదేశంగా చూడాలని అలాస్కా రిపబ్లికన్ సెనేటర్ లీసా మర్కోవ్‌స్కీ, లి అన్నారు. ట్రంప్ మాత్రం చైనా, రష్యాలు గ్రీన్‌ల్యాండ్‌పై ఆసక్తి చూపుతున్నాయని చెబుతూ, అమెరికా నియంత్రణకు న్యాయబద్ధత కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. గ్రీన్‌ల్యాండ్‌లో కీలక ఖనిజ వనరులు ఉన్నాయని పేర్కొంటూ, బలవంతంగా స్వాధీనం చేసుకునే అవకాశాన్ని కూడా వైట్ హౌస్ ఖండించకపోవడాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.

# గాజా 'శాంతి బోర్డు'లో అజయ్ బంగాకు చోటు

**న్యూయార్క్/వాషింగ్టన్:** గాజా పునర్నిర్మాణం, సంఘర్షణ ముగింపు కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన సమగ్ర ప్రణాళిక కింద ఏర్పాటు చేసిన 'బోర్డ్ ఆఫ్ పీస్'లో వరల్డ్ బ్యాంక్ గ్రూప్ అధ్యక్షుడు అజయ్ బంగా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోలకు స్థానం లభించింది. వైట్ హౌస్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో, దౌత్యం, అభివృద్ధి,



మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యూహాల్లో అనుభవం ఉన్న నాయకులతో కూడిన నిర్వహణ కమిటీ ఏర్పడింది. ఈ మండలిలో అమెరికా మధ్య ప్రాచ్య ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, మాజీ బ్రిటన్ ప్రధాని టోనీ బ్లేర్, అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ సీఈఓ మార్క్ రోవన్, అమెరికా ఉప జాతీయ భద్రతా సలహాదారు రాబర్ట్ గాబ్రియేల్ కూడా ఉన్నారు. గాజాలో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనడంతోపాటు, దీర్ఘకాలిక అభివృద్ధికి అవసరమైన పాలన నిర్మాణం, పునర్నిర్మాణం, పెట్టుబడుల ఆకర్షణ, భారీ నిధుల సమీకరణ వంటి విభాగాలను ఒక్కో సభ్యుడు పర్యవేక్షిస్తారని వైట్ హౌస్ తెలిపింది. రాబోయే వారాల్లో మరిన్ని నియామకాలు చేయనున్నట్లు వెల్లడించింది. భద్రత కోసం అమెరికా స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ సెంట్రల్ కమాండర్ మేజర్ జనరల్ జాస్పర్ జెఫర్స్‌ను అంతర్జాతీయ స్థిరీకరణ దళం (ఐఎస్ఎఫ్) కమాండర్‌గా నియమించారు. ఆయ న భద్రతా చర్యలు, ఆయుధాల నిర్వీర్యీకరణ, మానవతా సహాయం, పునర్నిర్మాణ సామగ్రి సురక్షిత సరఫరాకు నాయకత్వం కూడా వహిస్తారు. ఈ ప్రణాళికలో భాగంగా గాజా పరిపాలన కోసం నేషనల్ కమిటీ (ఎన్‌సిఎజి) ఏర్పాటును కీలక దశగా పేర్కొంటున్నారు. ఇరు పక్షాలు అంగీకరిస్తే యుద్ధం తక్షణమే ముగుస్తుందని, ఇజ్రాయెల్ దళాలు వెనక్కు తగ్గి బందీల విడుదలకు మార్గం సుగమం అవుతుందని ప్రణాళిక స్పష్టం చేసింది.

# యుఎస్ ట్రెజరీ బాండ్లలో పెట్టుబడులు తగ్గించిన చైనా

**బీజింగ్:** అమెరికాతో సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో, చైనా తన విదేశీ మారక నిల్వలను బంగారం, విదేశీ ఈక్విటీ పెట్టుబడుల వైపు విభిన్నీకరిస్తూ అమెరికా ట్రెజరీ బాండ్లలో పెట్టుబడులను 17 ఏళ్ల కనిష్ఠానికి తగ్గించింది.




అమెరికా ట్రెజరీ విభాగం గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, నవంబర్‌లో చైనా వద్ద ఉన్న అమెరికా ట్రెజరీ హోల్డింగ్స్ 682.6 బిలియర్ డాలర్లకు తగ్గాయి. ఇది అక్టోబర్‌లోని 688.7 బిలియన్ డాలర్లతో పోలిస్తే, స్వల్ప తగ్గుదల. అయితే, 2008 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. చైనా తన వాటాను తగ్గించినప్పటికీ, అమెరికా రుణంపై విదేశీ పెట్టుబడులు రికార్డు స్థాయికి చేరాయి. జపాన్ తన హోల్డింగ్స్‌ను2.6 బిలియన్ డాలర్లు పెంచి 1.2 ట్రిలియన్ డాలర్లకు చేర్చగా, బ్రిటన్ వాటా 10.6 బిలియన్ డాలర్లు పెరిగి, ఇప్పుడు 888.5 బిలియన్ డాలర్లకు చేరింది. అధికారిక మీడియా కథనాల ప్రకారం, డిసెంబర్ 2025 చివరి నాటికి చైనా విదేశీ మారక నిల్వలు 3.3579 ట్రిలియన్ డాలర్లు. కాగా, చైనా తన బంగారు నిల్వలను పెంచుకుంటోంది. పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా తాజా గణాంకాల ప్రకారం, డిసెంబర్ 2025 చివరికి బంగారు నిల్వలు 74.15 మిలియన్ ఔన్సులకు చేరాయి. ఇది గత నెలతో పోలిస్తే 30,000 ఔన్సుల పెరుగుదల కాగా, వరుసగా 14వ నెల బంగారం పెంపుగా నమోదైంది. భవిష్యత్తులో కూడా చైనా తన బంగారు నిల్వలను పెంచుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇది నిల్వల స్థిరత్వాన్ని పెంచడమే కాక, అంతర్జాతీయ మార్కెట్లలో ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతుందని అభిప్రాయపడుతున్నారు.

# భారత్–పాకిస్తాన్ ఘర్షణను ఆపింది నేనే

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నోట అదే మాట



**వాషింగ్టన్:** భారత్–పాకిస్తాన్ ఘర్షణను నివారించింది, రాబోయే యుద్ధాన్ని ఆపింది తానేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. ఈ రెండు దేశాల మధ్య పోరును తానే ఆపి లక్షలాది ప్రాణాలను కాపాడానని, అది తనకు ఎంతో గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఫ్లోరిడాలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ఒక సంవత్సరంలోపు అమెరికా అనేక శాంతి ఒప్పందాలకు మధ్యవర్తిత్వం వహించిందని చెప్పారు. భారత్–పాకిస్తాన్ సంఘర్షణను ఆపడం ద్వారా కనీసం కోటి ప్రాణాలను కాపాడినట్లు పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తనను ప్రశంసించారని ఆయన అన్నారు. 'గత ఏడాది మేము ఎనిమిది శాంతి ఒప్పందాలు కుదిర్చాము, గాజా యుద్ధాన్ని ముగించాము. మధ్యప్రాచ్యంలో ఇప్పుడు శాంతి ఉంది. అది సాధ్యమవుతుందని ఎవ్వరూ ఊహించలేదు' అని ట్రంప్ చెప్పారు. అణ్వాయుధాలు కలిగిన పొరుగు దేశాలైన భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో వాషింగ్టన్ కీలక పాత్ర పోషించిందని కూడా ఆయన తెలిపారు. గత సంవత్సరం మే 10 తర్వాత, వాషింగ్టన్ మధ్యవర్తిత్వంతో పూర్తి, తక్షణ కాల్పుల విరమణకు రెండు దేశాలు అంగీకరించాయని ఆయన సోషల్ మీడియాలో ప్రకటించినప్పటి నుంచి ఈ వ్యాఖ్యను సుమారు 80 సార్లు పునరుద్ఘాటించారు. అయితే, పాకిస్తాన్‌తో తన వ్యవహారాల్లో ఇతరుల జోక్యాన్ని భారత్ ఎప్పటికీ అంగీకరించలేదని స్పష్టంగా చెబుతోంది.

# బంగ్లాదేశ్‌లో హిందూ వ్యక్తి మృతి

## వాహనం కింద పడి మరణించినట్టు అధికారుల ప్రకటన

**న్యూఢిల్లీ/ఢాకా:** బంగ్లాదేశ్‌లోని రాజ్‌బారి జిల్లాలో ఒక హిందూ వ్యక్తి మృతి చెందాడు. బంగ్లాదేశ్‌లో హిందువులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వరుస హింసాత్మక ఘటనల్లో తాజా సంఘటనగా కొంత మంది దీనిని పేర్కొంటున్నప్పటికీ, ఇంధనానికి డబ్బు చెల్లించకుండా వెళ్లిపోతున్న వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించిన అతను, వ్యక్తి వాహనం కింద నలిగిపోయి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. మృతుడిని 30 ఏళ్ల రిపోన్ సాహాగా గుర్తించారు. ఆయన గోఆలందా మోర్‌లోని కరీమ్ ఫిల్లింగ్ స్టేషన్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడని 'డైలీ స్టార్' పత్రిక పోలీసుల్ని ఉటంకిస్తూ తెలిపింది. ఇంధనానికి సుమారు టాకా 5,000 విలువైన పెట్రోల్ తీసుకున్న ఓ నల్ల రంగు ఎస్‌యూవీ డ్రైవర్ డబ్బు చెల్లించకుండా వెళ్లిపోవడంతో, సాహా వాహనం ముందు నిలబడ్డాడని పోలీసులు తెలిపారు. ఆ సమయంలో వాహనం అతడిని తొక్కుకుంటూ వేగంగా అక్కడి నుంచి పారిపోయిందని చెప్పారు. కాగా, పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, దాని యజమాని అబుల్ హాషీమ్ అలియాస్ సుజన్ (55), డ్రైవర్ కమాల్ హొస్సైన్ (43)లను అరెస్టు చేశారు. హాషీమ్, రాజ్‌బారి జిల్లా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) మాజీ ఖజాంచీగా, జిల్లా జుబో దళ్ మాజీ అధ్యక్షుడిగా పనిచేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

# బలూచిస్తాన్‌లో 12 మంది ఉగ్రవాదులు హతం

**కరాచీ:** నిత్యం ఘర్షణలతో అట్టుడుకుతున్న దక్షిణ పడమర బాలూచిస్తాన్ ప్రావిన్స్‌లో 12 మంది ఉగ్రవాదులను హతమార్చినట్టు పాకిస్తాన్ సైన్యం ప్రకటించింది. సైన్యానికి చెందిన ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) ప్రకటన ప్రకారం, రెండు బ్యాం కులు, ఒక పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన ఉగ్రవాదులకు, సన్యానికి ఎదురుకాల్పులు జరిగాయి. ఖరాన్ పట్టణంలో సుమారు 15–20 మంది ఉగ్రవాదులు రెండు బ్యాంకులు, ఒక పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి, కొంతమంది సిబ్బందిని బందీలుగా తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన క్లీనప్ ఆపరేషన్‌లో బందీలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. కాగా, ఖరాన్‌పై దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు ప్రావిన్స్‌లో జరిగిన ఇతర ఉగ్రదాడుల్లోనూ పాలుపంచుకున్నారని ఐఎస్‌పిఆర్ పేర్కొంది. ఈ ప్రాంతాల్లో కూంబింగ్ జరుతున్నదని, ఉగ్రవాదులను ఏరివేస్తామని సైన్యాన్ని ఉటంకిస్తూ తెలిపింది.

# ఉగాండా అధ్యక్షుడిగా ముసేవెనీ ఏడోసారి ఎన్నిక

**కాంపాలా (ఉగాండా):** ఉగాండా అధ్యక్షుడు యోవేరి ముసేవెనీ ఏడోసారి ఎన్నికల్లో గెలిచి, తన పదవిని కాపాడుకున్నారు. తాజా ఎన్నికల్లో ఆయనకు 71.65 శాతం ఓట్లు లభించాయి. నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రభుత్వాన్ని మార్చాలని కోరుతూ ప్రచారం చేసిన యువ ప్రత్యర్థిని ఆయన సులభంగానే ఓడించారు. రాజకీయ నాయకుడిగా సంగీతకారుడు క్యాగులానీ స్సెంటాము అలియాస్ బోబీ వైన్‌కు 24.72 శాతం ఓట్లు దక్కినట్టు సాధించినట్లు తుది ఫలితాలు వెల్లడించాయి. కాగా ఈ ఫలితాలను వైన్ అధికారిక ఫలితాలను తిరస్కరించే అవకాశముందని భావిస్తున్నారు. ఇంటర్నెట్ నిలిపివేత, సైనిక దళాల మోహరింపు, తన పోలింగ్ ఏజెంట్ల అపహరణల ఆరోపణలతో కూడిన అన్యా య ప్రక్రియగా ఆయన ఈ ఎన్నికలను అభివర్ణించారు. ఓటింగ్ సమయంలో బయోమెట్రిక్ ఓటరు గుర్తింపు యంత్రాలు విఫలమవడంపై ఎన్నికల అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# రిపబ్లిక్ డేకు ఉగ్ర ముప్పు

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది గణతంత్ర వేడుకలు లక్ష్యంగా ఢిల్లీలో దాడులకు ఉగ్ర సంస్థలు ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఖాలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్రసంస్థలు రిపబ్లిక్ డే రోజున ఢిల్లీ సహా దేశంలోని ప్రముఖ నగరాల్లో దాడులకు ప్రయత్నించవచ్చని తెలిపాయి. దేశ అంతర్గత భద్రతను దెబ్బతీసేందుకు ఖాలిస్థానీ, ఇతర రాడికల్ హ్యాండ్లర్లు స్థానిక గ్యాంగ్‌స్టర్లను ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నాయి. హర్యానా, పంజాబ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో ఉగ్రనెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు సమాచారం అందినట్లు తెలిపాయి. గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు జరిగిన నేపథ్యంలో నిఘా వర్గాల హెచ్చరికలపై అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ సహా ఇతర ప్రముఖ నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు.

## మహిళలకే

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేశారు. వీటిలో 50 శాతం కార్పొరేషన్లను మహిళలకు రిజర్వేషన్ చేసినట్లు వెల్లడించారు. మొదట ఎస్‌టి, ఎస్‌సి రిజర్వేషన్లు ఖరారు చేశామని , లాటరీ ద్వారా 50 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. రాష్ట్రంలోని 10 కార్పొరేషన్‌ల రిజర్వేషన్లు ఖరారు ఈ విధంగా ఉన్నాయి. ఎస్‌సి, ఎస్‌టి ఒకటి చొప్పున, బిసి మూడు, బిసి మహిళ ఒకటి మేయర్ పోస్టులకు రిజర్వేషన్ కల్పించామన్నారు. మరో 5 జనరల్‌కు కేటాయించామని చెప్పారు. కొత్తగూడెం కార్పొరేషన్ ( ఎస్‌టి జనరల్), రామగుండం కార్పొరేషన్ ( ఎస్‌సి జనరల్ ), మహబూబ్ నగర్ కార్పొరేషన్ (బిసి మహిళ ), మంచిర్యాల, కరీంనగర్ కార్పొరేషన్ ( బిసి జనరల్) వరంగల్ కార్పొరేషన్ ( జనరల్ ), ఖమ్మం, నిజామాబాద్, గ్రేటర్ హైదరాబాద్ ( మహిళా జనరల్ )కు కేటాయించామని తెలిపారు.

వరంగల్ కార్పొరేషన్‌ను అన్ రిజర్వుడ్‌గా ఉంచారు. రాష్ట్రంలోని 121 మున్సిపాలిటీలల్లో చైర్మన్లుగా ఎస్‌టిలకు 5, ఎస్‌సిలకు 17, బిసిలకు 38 (వాటిలో 19 మహిళలకు), జనరల్ కేటగిరికి 61 స్థానాలకు రిజర్వేషన్లు ఖరాయయ్యని చెప్పారు. ఎస్‌టి, ఎస్‌సి, బిసి మహిళలకు పెద్ద సంఖ్యలో మున్సిపాలిటీలను కేటాయించడం ద్వారా మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం జి.ఓ జారీ చేసిన వెంటనే ఒకటి లేదా రెండు రోజుల్లో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని అధికారుల ద్వారా తెలిసింది. దీనితో రాష్ట్రంలో ఎన్నికల సందడి అధికారికంగా ప్రారంభం కానుంది.

## చట్టం తీసుకొస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు, సిఎం రేవంత్ రెడ్డితో చర్చించి రోహిత్ చట్టాన్ని తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని కమిటీకి తెలియజేశారు. కర్ణాటక రాష్ట్రంలో రోహిత్ వేముల చట్టం కోసం క్యాంపెయిన్ కమిటీ రూపొందించిన ముసాయిదాను కమిటీ సభ్యులు డిప్యూటీ సిఎంకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కొన్ని విజ్ఞప్తులు చేశారు. రోహిత్ వేముల కేసును పారదర్శకంగా విచారణ జరిపించాలని, న్యాయం చేయాలని కోరారు. రోహిత్ వేముల మరణం తర్వాత యూనివర్సిటీలో 50 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లపై నాన్ బెయిలెబుల్ కేసులు నమోదయ్యాయని, వీటి నుంచి వారికి విముక్తి కల్పించాలని కోరారు.

కర్ణాటక రాష్ట్రం తరహాలోనే తెలంగాణలోనూ రోహిత్ వేముల చట్టాన్ని తీసుకురావాలని సూచించారు. సమావేశంలో కర్ణాటక ప్రతినిధుల తరపున ఆ రాష్ట్ర సీనియర్ అంబేద్కరివాది నాయకుడు హులికుంటే మూర్తి, బెంగళూరు నేషనల్ లా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆశ్నా సింగ్, న్యాయవాది వి. మృదుల, బెంగళూరు జికెవికె ఎఎస్ఎ రాహుల్, హైదరాబాద్ 'జస్టిస్ ఫర్ రోహిత్ వేముల' ఉద్యమం తరఫున రాధికా వేముల, రాజా వేముల, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ భాంగ్య భుక్య, ప్రొఫెసర్ సౌమ్యా దేచమ్మ, ప్రొఫెసర్ తిరుమల్, ప్రొఫెసర్ రత్నం, తెలంగాణ హైకోర్టు నియమిత సీనియర్ న్యాయవాది వి.రఘునాథ్, డాక్టర్ దొంత ప్రశాంత్, ఎఎస్ఎ తిరుపతి, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల అభివృద్ధిలో విశిష్ట గుర్తింపు

# ఎన్‌విఎస్ రెడ్డికి 'అచీవర్స్ అవార్డు' ప్రదానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆల్‌ఇండియా రిటైర్డ్ రైల్వే ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవా ణా) ఎన్‌విఎస్ రెడ్డికి ప్రతిష్ఠాత్మకమైన 'అచీవర్స్ అవార్డు'ను ప్రదానం చేసింది. ఈ కార్యక్రమం శనివారం సికింద్రాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి దక్షిణ మధ్య రైల్వే రిటైర్డ్ అదనపు జనరల్ మేనేజర్ వి.ఎస్. శాస్త్రి అధ్యక్షత వహించ గా అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన ఎన్‌విఎస్ రెడ్డికి అచీవర్స్ అవార్డును అందజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎన్‌విఎస్ రెడ్డి, ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానంలో ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రో రైలు ప్రాజెక్టులలో ఒకటైన హైదరాబాద్ మెట్రో రైలు వ్యవస్థను విజయవంతంగా అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారని అసోసియేషన్ ప్రశంసించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా రవాణా రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేసినట్లు తెలిపింది. ఎన్‌విఎస్ రెడ్డిని తమ 'అచీవర్స్ క్లబ్'లో చేర్చుతున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన రైల్వే అధికారులు, ప్రస్తుతం సేవలందిస్తున్న రైల్వే అధికారులను ఉద్దేశించి ఎన్‌విఎస్ రెడ్డి ప్రసంగించారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు అమలులో ఎదురైన అనేక సవాళ్లు, వాటిని ఎలా అధిగమించారో వివరించారు. ఈ ప్రాజెక్టు ఒక బృహత్తర యజ్ఞంలా సాగింద ని, ఈ ప్రయాణంలో ఎన్నో ప్రేరణాత్మక విజయగాథ లు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని చెప్పా రు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మెట్రోలో అమలులో ఉన్న ప్రపంచ స్థాయి సాంకేతికతలు, ఇంజనీరింగ్, ఆర్థిక ఆవిష్కరణలను వివరించారు. ప్రాజెక్టు సమయంలో ఎదురైన సున్నితమైన సమస్యలు, ఆందోళనల ను నైపుణ్యంతో ఎలా ఎదుర్కొన్నారో వివరించారు. ఈ అనుభవాలు తరువాత ఐఎస్‌బి, స్టాన్‌ఫర్డ్ హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో కేస్ స్టడీలుగా మారాయని చెప్పారు. ప్రస్తుతం దేశంలోని 25కు పైగా నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు అమలు లో ఉన్నాయని, ఈ రంగంలో రిటైర్డ్ రైల్వే అధికారుల అనుభవం, పరిజ్ఞానం ఎంతో విలువైనదని ఎన్‌విఎస్ రెడ్డి అన్నారు. వేగంగా విస్తరిస్తున్న మెట్రో రైలు రంగానికి తమ అనుభవాన్ని, నైపుణ్యాన్ని అందించడం ద్వారా జాతీయ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎన్‌విఎస్ రెడ్డి చూపిన చొరవ, నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకమని అసోసియేషన్ అభినందించింది.




# రైల్వే ప్రయాణీకులకు గుడ్ న్యూస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే గుడ్ న్యూస్ తెలిపింది. డెల్టా ఎక్స్‌ప్రెస్ రైల్లో చేసిన కోచ్‌ల మార్పులు స్లీపర్ కోచ్ ప్రయాణికులకు మంచి లాభంగా మారాయి. కాచిగూడ–రేపల్లె మార్గంలో నడిచే ఈ రైలులో ఇప్పటివరకు ఐసీఎఫ్ కోచ్‌లు ఉండగా, తాజాగా దక్షిణ మధ్య రైల్వే వాటిని ఆధునిక ఎల్హెచ్‌బీ కోచ్‌లుగా మార్చింది. ఐసీఎఫ్ కోచ్‌లతో పోలిస్తే ఎల్హెచ్‌బీ రైళ్లలో స్లీపర్ బోగీలు తక్కువగా ఉండటంతో, ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్న రెండు స్లీపర్ కోచ్ల ప్రయాణీకులకు సమస్య ఎదురైంది.

ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రైల్వే అధికారులు ఆ ప్రయాణికులను ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా థర్డ్ ఏసీ బోగీలకు ఉచితంగా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో స్లీపర్ టికెట్ ధరకే వారు శుక్రవారం థర్డ్ ఏసీ కోచ్లలో సౌకర్యంగా ప్రయాణించారు. డెల్టా ఎక్స్‌ప్రెస్‌కు టికెట్లు 60 రోజుల ముందే రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉండటంతో, కొన్ని వారాల క్రితమే బుకింగ్ చేసిన ప్రయాణికులకు ఈ మార్పు వరంగా మారింది. ఈ చర్యపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ రైల్వే అధికారుల నిర్ణయాన్ని అభినందించారు.

## ఎడారిగా మార్చారు

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. విద్య, వైద్యం అందించకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు వెనుకబాటుకు గురయ్యారని ఆయన అన్నారు. దేశ విదేశాలలో భారీ ప్రాజెక్టులు నిర్మాణం చేయడంలో పాలమూరు లేబర్ కీలకంగా పనిచేశారని ఇక్కడి ప్రాజెక్టులు మాత్రం నాయకులు పూర్తి చేయకుండా వివక్ష చూపుతున్నారని ఆయన అన్నారు. ఇక్కడి నుండి ఎంపీగా గెలిచి తెలంగాణ సాధించామని చెబుతున్న కేసీఆర్ ఈ ప్రాంత ప్రాజెక్టులను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. రాజకీయ బిక్ష పెట్టిన పాలమూరును ఏడాది చేసిన చరిత్ర నీదని ఆయన దుయ్యబట్టారు.

పాలమూరు నుండి ఎంపీగా గెలిచిన ఈ ప్రాంతం కోసం ఒక్క ప్రాజెక్టు అయినా మొదలు పెట్టారా అని నిలదీశారు. ఉదండాపూర్, ఆదిలాబాద్ రైతులకు మేము అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణ పరిహారం ఇచ్చినామని గుర్తు చేశారు. కేఎల్వ చివరి ఆయకట్టుకు నీరందేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజ్ఞప్తి మేరకు నిధులు ఇచ్చి కాల్వలు పూర్తి చేయడానికి నిధులు ఇచ్చి కాల్వలు పూర్తి చేయడానికి సహకరించమన్నారు. కొడంగల్ , నారాయణపేట ఎత్తిపోతలకు 7.50 టీఎంసీల సామర్థ్యంతో 1500 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టును నిర్మిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జూరాల డ్యాంకు సమాంతరంగా మరో డ్యాంను నిర్మాణం కోసం రూ. 123 కోట్లతో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేస్తామన్నారు. పాలమూరు నుండి బూర్గుల రామకృష్ణ రావు తర్వాత మనకు అవకాశం వచ్చిందని వచ్చిన అవకాశాంను ఉపయోగించుకుని జిల్లా అభివృద్ధి కోసం ప్రతి ఒకరు సహకరించాలని కోరారు. శాసనసభలో చర్చకు రాని నాయకులు మనకు ఎందుకు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 1000 బస్సులకు యజమానులను చేయడం, పెట్రోల్ బంకుల నిర్వహణకు ఆర్థిక సహాయంతో పాటు మహిళలను కోటేశ్వరులను చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రధాన కూడళ్ల వద్ద క్యాంటీన్ల నిర్వహణ, సన్నబియ్యం తో పాటు అనేక సంక్షేమ పథకాలు అందిస్తు రెండేళ్ల పాలన పూర్తి చేశామని ఈ క్రమంలో వచ్చిన జూబ్లీహిల్స్ , కంటోన్మెంట్ సర్పంచు ఎన్నికలో కాంగ్రెస్ కు అండగా నిలిచారని ఆయన అన్నారు.

ఎప్పటిలాగే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే సభకు అధ్యక్షత వహించల కార్యక్రమంలో ఇంచార్జి దామోదర రాజనర్సింహ, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, హజారుద్దీన్, ఎంపీలు డీకే అరుణ, మల్లురవి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, మేఘారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, ఈర్లపల్లి కంకర్ ఎపి జితేందర్ రెడ్డి, సంపత్‌కుమార్, ప్రణాళికా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి, గద్వాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఓబేదుల్లా కొత్వాల్, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, శివకుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాంకృష్ణారావు, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే...

(మొదటి పేజీ తరువాయి)

ఉద్ఘాటించారు. శుభ్రమైన తాగునీరు కూడా లేని ఇండోర్ ఒక కొత్త మోడల్ స్మార్ట్ సిటీ అని చెబుతున్న కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతూ పట్వారీ, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు ఉమాంగ్ సింఘార్‌తో కలిసి రాహుల్‌గాంధీ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నలుగురు రోగులను కలిసి, వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన గత నెలలో ఈ వ్యాధి ప్రబలిన భాగీరథపుర ప్రాంతాన్ని సందర్శించి మృతుల కుటుంబాలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'ప్రజలకు శుభ్రమైన నీటిని అందించడం, కాలుష్యాన్ని తగ్గించడం ప్రభుత్వ బాధ్యత. కానీ ప్రభుత్వం ఈ బాధ్యతలను నెరవేర్చడం లేదు' అని అన్నారు. పట్టణ నమూనాపై ప్రశ్నలు లేవనెత్తుతూ ఇండోర్‌లో ప్రజలకు శుభ్రమైన నీరు అందకపోవడంతో కలుషితమైన నీటిని తాగి చనిపోతున్నారని ఆయన అన్నారు. కేవలం ఇండోర్‌లోనే కాదు, దేశవ్యాప్తంగా నగరాల్లో ఇదే జరుగుతోంది అని ఆయన అన్నారు. ఇండోర్‌లో తాగునీటి విపత్తుకు ప్రభుత్వంలో ఉన్న ఎవరో ఒకరిని బాధ్యులను చేయాలని, ప్రభుత్వాన్ని జవాబుదారీగా చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. 'ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇండోర్‌లో ప్రజలు కలుషితమైన నీటిని తాగి చనిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం బాధితులకు పూర్తి మద్దతు, తగిన పరిహారం అందించాలి' అని అన్నాకు. శుభ్రమైన నీరు ప్రజల హక్కు అని, కానీ దురదృష్టవశాత్తు బిజెపి ప్రభుత్వం దానిని ప్రజలకు అందించలేకపోతోందని మండిపడ్డారు. ప్రజలు తీవ్ర వేదనతో చనిపోతుంటే, కుటుంబాలు విచ్ఛిన్నమవుతుంటే, బిజెపి నాయకులు కేవలం బాధ్యత నుండి తప్పించుకోవడానికే ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వ వైఖరి అత్యంత సున్నితత్వం లేనిదిగా ఉందని, దానిని సహించబోమన్నారు. తాము భాగీరథపుర ప్రజలకు అండగా నిలబడతామన్నారు. నేరస్థులను శిక్షించి, బాధితులకు న్యాయం జరిగేలా పోరాడుతూనే ఉంటామని చెప్పారు. తన ముందున్న పెద్ద ప్రభుత్వ నీటి ట్యాంకును చూపిస్తూ... 'ఈ ట్యాంకులో ఈ రోజుకీ శుభ్రమైన నీరు లేదు. నగరం మీడియా నిఘాలో ఉన్నందున, (గాయానికి) ఒక కట్టు కట్టారు, ఇది కేవలం కొన్ని రోజుల పాటు మాత్రమే ఉంటుంది. మీడియా దృష్టి మళ్లిన వెంటనే, పరిస్థితి మళ్లీ పాత స్థితికి చేరుకుంటుంది. భగీరథపురలో జరిగిన ఈ దుర్ఘటన బాధితులు, ప్రభుత్వం తన బాధ్యతను నెరవేర్చి, శుభ్రమైన తాగునీటి సరఫరా కోసం ఒక శాశ్వత వ్యవస్థను అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నారు' అని అన్నారు. ఇండోర్‌లో తన పర్యటన రాజకీయ ప్రేరేపితమని అధికార బిజెపి చేసిన ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. 'నేను ప్రతిపక్ష నాయకుడిని. ఇక్కడ కలుషితమైన తాగునీటి వల్ల ప్రజలు చనిపోయారు. వారికి శుభ్రమైన నీరు లభించడం లేదు. వారి సమస్యను లేవనెత్తడానికి, వారికి సహాయం చేయడానికి వచ్చాను. ఇందులో తప్పు ఏమీ లేదు. బాధితులకు సహాయం చేయడం నా బాధ్యత... దీనిని రాజకీయం అనండి లేదా మీకు నచ్చినట్లుగా పిలవండి; అది నాకు పట్టింపు లేదు' చురకలంటించారు. ఈ ప్రాంతంలో అతిసార వ్యాప్తి సమయంలో మరణించిన గీతా ధ్రువకర్ (64), జీవన్ లాల్ బరేడే (80) ఇళ్లను గాంధీ సందర్శించి, వారి దుఃఖిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఆ తర్వాత, ఆయన ఒకే చోట బాధితుల కుటుంబాలను కలిశారు. గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ 16 మంది బాధితుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 1 లక్ష ఆర్థిక సహాయం అందించగా, సింఘార్ ఒక్కొక్కరికి రూ. 50,000 సహాయం అందించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గత నెలలో ఈ ప్రాంతంలో వ్యాపించిన వాంతులు, విరేచనాల వ్యాప్తి కారణంగా ఇప్పటివరకు 24 మంది మరణించారని భగీరథపుర నివాసులు పేర్కొన్నారు.

# అవకాశాలు అందిపుచ్చుకుంటేనే అభివృద్ధిలోకి

### కళాశాల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్/జడ్చర్ల :** జీవితంలో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటునే అభివృద్ధి వరకు వస్తామని సీఎం రేవంత్ రెడ్డి సంభోదించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టిబోయిన్‌పల్లిలో ట్రిబుల్‌ఐటి, ఐఐఐటీ శంకుస్థాపన కార్యక్రమానికి పాల్గొని శిలాఫలాకాన్ని ఆవిష్కరించిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్య మన నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న పరిష్కారాన్ని చూపుతుందని జీవితంలో కష్టపడి పైకి రావాలంటే పట్టుదలతో చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు 75 ఏళ్ల తర్వాత ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చిందని ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. మంత్రి కాకపోయినా నేరుగా ముఖ్యమంత్రి అయ్యే అవకాశం పాలమూరు జిల్లా ప్రజలు నాకు కల్పించారని ఆయన అన్నారు. ప్రజలకు మేలు చేయాలని అన్న ఆలోచనతోనే రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ఆయన అన్నారు. గతంలో భూమి లేని నిరుపేదలకు, ఆదివాసులకు భూములు పంచారని ఇప్పుడు గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి కూడా భూమి దొరకని పరిస్థితి దాపురించిందని అన్నారు. అందుకే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించారనే లక్ష్యంగా విద్యార్థులు చదవాలని ఆయన కోరారు. ప్రజాప్రభుత్వం విద్యకే మొదటి ప్రాధాన్యత ఇస్తూ వస్తుందని రెండు వందల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్నారు. చదువు వల్లనే ఎదిగేందుకు అవకాశాలు వస్తాయని భవిష్యత్తు కూడా చదువు మీద ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు అన్ని విద్యాసంస్థలు తీసుకోస్తున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నిబద్ధత లేని చదువు జీవితానికి ఉపయోగపడదని చదువు ద్వారానే సమాజంలో గౌరవం పెరుగుతుందని అన్నారు. సివిల్ సర్వీసెస్‌కి హాజరయ్యే వారికి కూడా ఆర్థిక సాయం అందజేస్తున్నామని ఏడాది లోగా ట్రిబుల్ ఐటి భవనం సిద్ధం చేస్తామని ఆయన తెలిపారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను విద్యార్థులు గౌరవించుకోవాలని తద్వారా సమాజంలో విలువలకు నాంది పలకినవారమవుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యులు డి.కె.అరుణ, మల్లు రవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జె.అనిరుధ్‌రెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి, తూడి మేఘా రెడ్డి, కూచుకుళ్ల రాజేష్, వీర్ల శంకర్, టి.రామ్మోహన్ రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి తదితరులు పాల్గొన్నారు.

## టెట్‌పై చట్టసవరణ చేయాలి: ఎస్‌టియు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యాహక్కు చట్టం అమలు తేదీకి ముందు నియామకమైన ఉపాధ్యాయులు రెండేళ్లలో టెట్ పాస్ కావాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వచ్చే నెల జరిగే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో టెట్‌పై చట్ట సవరణ చేయాలని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎ.వి సుధాకర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుట్టపాక ప్రవీణ్ కుమార్, సత్తు పాండు రంగారెడ్డి డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఫిబ్రవరి 5న ఆల్ ఇండియా జాక్టో అధ్వర్యంలో తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. జాతీయ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ నిర్లక్ష్యంతో ఇలాంటి తీర్పు వచ్చిందని, తీర్పు వచ్చి నాలుగు నెలలు అయినా, దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఉద్యోగులకు 51శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు జారీ చేసి, సక్రమంగా అమలు చేయడంతో పాటు సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉద్యోగులకు 90 శాతం డిఎ ఏరియర్స్ 30 వాయిదాలలో చెల్లించే విధానం సరికాదని పేర్కొంటూ ఉపాధ్యాయ సర్వీసు రూల్స్ రూపొందించి, అన్ని రకాల పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం నెలకు రూ.1,500 కోట్లు కేటాయించాలన్నారు.

## కార్మికులకు శుభవార్త ప్రకటించాలి

### ఆర్‌టిసి జెఎసి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడారంలో ఆదివారం నిర్వహించనున్న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఆర్‌టిసి కార్మికులకు శుభవార్త ప్రకటించాలని ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎం.డి.మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలు డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టో పొందపర్చిన విధంగా మేడారం వన దేవతల సన్నిధిలో నిర్వహించనున్న మంత్రివర్గ సమావేశంలో మంత్రివర్గం సానుకూలంగా స్పందించాలని జెఎసి నేతలు కోరారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, 2021 పేస్కేల్ అమలు, పైసా ఖర్చులేని యూనియన్లను పునరుద్ధరణ తదితర డిమాండ్లను పరిష్కరించడం ద్వారా కార్మికులల్లో గత 7ఏళ్లగా నెలకొన్న అసంతృప్తిని తొలగించాలని, కార్మిక వర్గమంతా మేడారం జాతరలో సంతోషంగా తమ విధులు నిర్వహించే విధంగా ప్రభుత్వం తీపి కబురు చెప్పాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

## రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ : అసదుద్దీన్ ఒవైసీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం టికెట్ల కోసం ఆశావహులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఇప్పటికే పార్టీ నాయకులకు సూచనలు చేశామని, ఇందుకు సంబంధించిన కసరత్తు సైతం మొదలైందని వెల్లడించారు. మహారాష్ట్రలో శుక్రవారం వెలువడిన మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం 125 స్థానాలను గెలుపొందిందని, ఈ విజయాన్ని అందించిన ఆ రాష్ట్ర ప్రజలకు అసదుద్దీన్ ఒవైసీ కృతజ్ఞతలు తెలిపారు.

## పాత రకాల విత్తనాలకు సైతం సబ్సిడీ అందజేయాలి

### కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌ఎంఇఒఎస్, ఎన్‌ఈఎస్‌ఎన్‌ఎం పథకాల కింద 2 2 2 రకాల విత్తనాలకు సైతం సబ్సిడీ కల్పించాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి అన్వేష్ రెడ్డి లేఖ రాశారు. ఈ రెండు పథకాల కింద నాణ్యమైన విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించడం అభినందనీయమని, అయితే ఈ పథకాల లక్ష్యాలు పూర్తిగా నెరవేరాలంటే ఇప్పటికే రైతులు వాడుతున్న పాత విత్తన రకాలనూ కూడా సబ్సిం పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్వేష్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికీ పలువురు మంది రైతులు అనేక సంవత్సరాల క్రితం విడుదలైనప్పటికీ స్థిరమైన దిగుబడి, మెరుగైన మార్కెట్ డిమాండ్ కలిగిన విత్తన రకాలనే ఎక్కువగా సాగు చేస్తున్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు. వేరుశెనగ పంటలో రైతులు కదిరి1812 కంటే, పాతదైనప్పటి విశ్వసనీయమైన కదిరి 6 రకానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అదేవిధంగా శనగ పంటలో ఎన్‌బిఇజి49, న్‌బిఇజి47 వంటి కొత్త రకాల కంటే జెజి11, జెఎఐ 9218 వంటి పాత రకాలపై రైతులకు ఎక్కువ నమ్మకం ఉందం తెలిపారు.ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, కొత్తగా విడుదలైన విత్తన రకాలతో పాటు రైతులు విశ్వసించే పాత విత్తన రకాలకూ ఎన్‌ఎంఇఒఎస్, ఎన్‌ఈఎస్‌ఎన్‌ఎం పథకాల కింద సబ్సిడీపై సరఫరా చేసేలా మార్గదర్శకాల్లో సవరణ చేయాలని కోరారు.రైతుల అవసరాలు, స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకుంటేనే ఈ పథకాల ప్రధాన లక్ష్యాలు సఫలమవుతాయని లేఖలో స్పష్టం చేశారు.

## బిఆర్‌ఎస్ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

### ఉద్రిక్తత.. నేతల అరెస్ట్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ చారిత్రక వారసత్వాన్ని కాపాడాలని, ఈ ప్రాంతాన్ని ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ భారత్ రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) తలపెట్టిన 'శాంతి ర్యాలీ' ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు ఈ ర్యాలీకి అనుమతి నిరాకరించడంతో పాటు, పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ అడ్డుకుని అరెస్టులు చేయడంతో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సికింద్రాబాద్ అస్తిత్వం, ఆత్మగౌరవం నినాదంతో బీఆర్‌ఎస్ శనివారం భారీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై క్లాక్ టవర్, ప్యాట్నీ, ప్యారడైజ్ సర్కిల్ మీదుగా ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగాల్సి ఉంది. అయితే, శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి ఇవ్వనట్లు తెలుస్తోంది. రైల్వేస్టేషన్, ప్యాట్నీ సెంటర్ల వద్ద శనివారం తెల్లవారుజాము నుంచే భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. ర్యాలీలో పాల్గొనేందుకు నల్ల బ్యాడ్జీలతో తరలివచ్చిన బీఆర్‌ఎస్ కార్యకర్తలను, నాయకులను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలోని ఆల్ఫా హోటల్లోకి వెళ్లిన పోలీసులు, అక్కడ ఉన్న పార్టీ శ్రేణులను పోలీస్ వ్యాన్లలో తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని బీఆర్‌ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాలీ నేపథ్యంలో పోలీసులు సికింద్రాబాద్ వైపు వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను విచారించి పంపుతున్నారు. అరెస్టయిన వారిని నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు సమాచారం.

**అరెస్టులపై కెటిఆర్ ఆగ్రహం**

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల అస్తిత్వాన్ని దెబ్బతీస్తే ఉపేక్షించేది లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. 'సేవ్ సికింద్రాబాద్' ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారని మండిపడ్డారు. నగర అస్తిత్వాన్ని దెబ్బతీస్తుంటే ప్రజలకు నిరసన తెలిపే హక్కు లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తుగ్లక్ పనులు చేస్తోందని విమర్శించారు. సికింద్రాబాద్, హైదరాబాద్ నగరాలకు శతాబ్దాల చరిత్ర ఉందని అన్నారు. ఈ రెండు నగరాలు రెండు కళ్లు వంటివని, అలాంటిది వాటి ఐడెంటిటీని తొలగించాలని ముఖ్యమంత్రి చూస్తున్నారని ఆరోపించారు. అరెస్టులు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. కోర్టుకు వెళ్లి న్యాయం కోసం పోరాడతామని అన్నారు.

## 20 మంది ఐపిఎస్‌ల బదిలీ

### సైబరాబాద్, హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లలో కీలక మార్పులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఐపిఎస్ అధికారుల బదిలీలు, నియామకాలపై ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 20 మంది ఐపిఎస్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పులు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు ఇంటెలిజెన్స్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో చోటుచేసుకున్నాయి. ఈ బదిలీలు పోలీస్ పరిపాలనలో సమర్థత పెంపు, ట్రాఫిక్ నిర్వహణ బలోపేతం, విజిలెన్స్ వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయడమే లక్ష్యంగా చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బదిలీ వివరాలు ఇలా ఉన్నాయి.

డా.గజరావు భూపాల్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ పదవి నుంచి ఐజి – ప్రొవిజనింగ్, లాజిస్టిక్స్‌గా నియమించారు.

అభిషేక్ మోహంతీ టిఎన్‌ఎబి డిఐజి నుంచి విజిలెన్స్ డిఐజిగా పదోన్నతి బాధ్యతలు ఇచ్చారు.

ఆర్.భాస్కరన్‌ను ఇంటెలిజెన్స్ సిఐ సెల్ ఎస్‌పి నుంచి డిఐజి –సీఐ సెల్, ఇంటెలిజెన్స్ నియమించారు.

జి.చందన దీప్తిను రైల్వే ఎస్‌పి నుంచి ఫ్యూచర్ సిటీ అదనపు సిపి (అడ్మిన్ డిఐజి)నియమించారు.

టి.అన్నపూర్ణ విజిలెన్స్ ఎస్‌పిగా ఉన్న ఆమెను సైబరాబాద్ అడ్మిన్ డిసిపిగా బదిలీ చేశారు.

హైదరాబాద్ నగర ట్రాఫిక్ విభాగంలో కీలక మార్పులు చేపట్టారు.

బి.కే. రాహుల్ హెగ్డేకు డిసిపి ట్రాఫిక్III,

అవినాష్ కుమార్‌కు డిసిపి ట్రాఫిక్I,

కాజల్‌కు డిసిపి ట్రాఫిక్IIగా నియామకాలు జరిగాయి.

కె.అపూర్వరావు ఎస్‌బి డిసిపి నుంచి ఇంటెలిజెన్స్ ఎస్‌పిగా నియమించారు.

బాల స్వామిని హైదరాబాద్ ఈస్ట్ జోన్ డిసిపి నుంచి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పిగా నియమించారు.

ఆర్.వెంకటేశ్వర్లును సిఐడి ఎస్‌పిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లలో ట్రాఫిక్ విభాగాలను పునర్వ్యవస్థీకరిస్తూ పలువురు 2021 బ్యాచ్ కు చెందిన శేషాద్రినిరెడ్డి, కంకనాల రాహుల్‌రెడ్డి, శివంపపాధ్యాయ ఐపిఎస్ అధికారులకు డిసిపి స్థాయి బాధ్యతలు అప్పగించారు.

ఏ.బాలకోటి, అదనపు ఎస్‌పి (విజిలెన్స్)ను డిజిపి కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

కె.శ్యామ్‌సుందర్ మల్కాజ్‌గిరి సిఎఆర్ డిసిపి నుంచి హైదరాబాద్ సిఎఆర్ డిసిపిగా

జె.రంజన్ రతన్‌కుమార్ మేడ్చల్ డిసిపి ట్రాఫిక్ నుంచి ఈ ఛలాన్ రోడ్‌సేఫ్టీ వింగ్ డిసిపిగా

వి.శ్రీనివాసులు ఎల్‌బినగర్ ట్రాఫిక్ డిసిపి నుంచి ఉప్పల్ జోన్ ట్రాఫిక డిసిపిగా

ఎస్.చైతన్యకుమార్ సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి నుంచి హైదరాబాద్ క్రైమ్స్ డిసిపిగా బదిలీ చేశారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**

టెండర్ నోటీసు నెం. P-06/25-26 of DE/OP/SURYAPET

సూర్యాపేట ఆపరేషన్ డివిజన్‌లో వివిధ ఎలక్ట్రికల్ పనుల కోసం అర్హత కలిగిన విక్రేతల నుండి టెండర్లను ఆహ్వానించడమైనది. వివరాలు www.tgsouthernpower.com నుండు అందుబాటులో ఉండును. ఫోన్ నెం. 8712473066. ఆఖరి తేది: 27.01.2026.

సం/- డివిజనల్ ఇంజనీర్,
ఆపరేషన్, సూర్యాపేట.

DIPR R.O. No. : 13810-PP/CL/ADVT/1/2025-26, Date: 17-01-2026

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**

hmda Growing Global

కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయం, డివిజన్–VI
5వ అంతస్తు, వెస్ట్ వింగ్, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

NIT. No.: HMDA/DEV/EE/Div-VI/04/2025-26 — తేదీ: 17.01.2026

కింది పనుల కోసం చెల్లుబాటు అయ్యే రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి.

| క్ర.సం. | పని పేరు | బిడ్ సమర్పించడానికి చివరి తేదీ |
|---|---|---|
| 1 | సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటలో ప్రహరీ గోడ నిర్మాణం, మరుగుదొడ్లతో కూడిన వాచ్మెన్ గది, వీధి దీపాలు, కరబ్స్ మరియు పచ్చదనం అభివృద్ధి మరియు ఇతర సుందరీకరణ పనులు. | 27.01.2026 |

బిడ్ సమర్పించడానికి చివరి తేదీ పైన పేర్కొన్న విధంగా మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఉంటుంది. మరిన్ని వివరాల కోసం www.eprocurement.gov.in ను సందర్శించండి.

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్,
డివిజన్-VI, హెచ్‌ఎండిఎ.

DIPR R.O. No. : 13863-PP/CL/ADVT/1/2025-26, Date: 17-01-2026

## లీగ్ పాలకమండలిపై బిసిసిఐకి టిసిఎ ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతిపాదిత తెలంగాణ లీగ్–20 ప్రీమియర్ లీగ్ నిర్వహణ కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) ప్రకటించిన పాలక మండలి రాజ్యాంగ విరుద్ధమని ఆరోపిస్తూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బిసిసిఐ)కి అధికారికంగా శనివారం ఫిర్యాదు చేసింది. అర్హతలేని సభ్యులతో అక్రమంగా పాలక మండలి ఏర్పాటు చేశారని పేర్కొంటూ, దాన్ని తక్షణమే రద్దు చేయాలని టిసిఎ డిమాండ్ చేసింది. హెచ్‌సిఎ తీసుకున్న నిర్ణయం ప్రారంభం నుంచే చెల్లదని టిసిఎ స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ఆమోదించిన బిసిసిఐ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ఎజిఎం ఆమోదం లేకుండా ఈ పాలక మండలిని ప్రకటించారని తెలిపింది. అంతేకాదు, బాంబే హైకోర్టులో తెలంగాణ హైకోర్టులో 5 కేసులు పెండింగ్‌లో ఉండగానే ఈ ప్రకటన చేయడం చట్టస్ఫూర్తికి విరుద్ధమని టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి ఆరోపించారు.

అలాగే అక్రమంగా నామినేట్ అయిన శ్రీపార్థ సత్వలేకర్, తన కుమారుడు హెచ్‌సీఏ అండర్–19 జట్టుకు ఆడుతున్న సమయంలో పదవిలో ఉండటం రాజ్యాంగ విరుద్ధమని ఆయన ఆరోపించారు. ఇంటరిమ్ సిఇఒ వ్యవహరిస్తున్న ఇమ్తియాజ్ ఖాన్ అర్హత లేకుండా, ఎజిఎం ఆమోదం లేకుండా నియమితులయ్యారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో బిసిసిఐ తక్షణమే హెచ్‌సిఏ ప్రకటించిన పాలక మండలిని రద్దు చేయాలని, కోర్టు తీర్పులు వచ్చే వరకు హైదరాబాద్ నగరానికి బయట తెలంగాణ క్రికెట్ వ్యవహారాల్లో హెచ్‌సీఏ జోక్యాన్ని నిలిపివేయాలని, నిరంతర రాజ్యాంగ ఉల్లంఘనలపై హెచ్‌సీఏపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసింది.

---

ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా – ఎదురుబెదురూ లేక..

# చలో ఖమ్మం
# నేడే మహా ప్రదర్శన

CENTENARY OF STRUGGLES & SACRIFICES

## ప్రజా ఉద్యమాలే ఊపిరిగా సాగుతాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ప్రజాపక్షం/ఖమ్మం :** కమ్యూనిజం అజరామరమని సమాజంలో ఆర్థిక అంతరాలు కొనసాగినంత కాలం ప్రజా పోరాటాలు కొనసాగుతాయని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ప్రజలను చైతన్యం పర్చడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఖమ్మంలో ఆదివారం జరగనున్న నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాలు ఖమ్మంలో జరుపుకోవడం ద్వారా ప్రజా ఉద్యమం మరింత బలపడుతుందన్నారు. ఇది ఒక చారిత్రిక ఘటనగా నిలిచిపోతుందన్నారు. యువతకు వందేళ్ల పోరాట ఘట్టాలను తెలియజేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు సంసిద్ధులను చేసేందుకు ఈ చారిత్రిక సభ దోహదపడుతుందని కూనంనేని ఆశాభావం వ్యక్తం చేశారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒక మంచి కదలిక వచ్చిందని కమ్యూనిజం పురోగమనానికి ఈ శతాబ్ది ఉత్సవాలు దోహదపడతాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు భావజాలం పెరుగుతుందని పెట్టుబడి దారి దేశాల్లో సైతం ఎర్ర జెండాలు రెపరెపలాడుతున్నాయన్నారు. ప్రజలంతా సమాన హక్కులు అనుభవించాలని పోరాడుతున్న కమ్యూనిస్టులను ప్రజలు ఆదరిస్తారన్నారు. ఎన్నికల తీరు మారిపోయిందని అందుకే ఓట్లు, సీట్ల విషయంలో వెనకబడిపోయామని కూనంనేని తెలిపారు. ఎన్నికలు కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ ప్రస్తానంలో ఒక చిన్న ఘట్టం మాత్రమేనని పొత్తులు కూడా కేవలం రాజకీయ ఎత్తుగడలు తప్ప శాశ్వతం కాదన్నారు. ప్రజా ఉద్యమ నిర్మాణం పార్టీ విస్తృతి లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కేంద్రంలో బిజెపి తీరు చూస్తుంటే దొంగే దొంగ అని అరిచిన చందంగా ఉందని దేశానికి ద్రోహం చేస్తూ దేశ భక్తులుగా చెలామణి అవుతున్నారని ఆయన ఆరోపించారు. దేశ భక్తి మాటున బిజెపి ఈ దేశ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్లకు దోచిపెడుతుందన్నారు. రాష్ట్రంలో ఒక పక్క మిత్రపక్షంగా ఉంటూనే మరో పక్క ప్రజా సమస్యలపై పోరాడుతున్నామని ప్రజల పక్షానే నిరంతరం పనిచేస్తామని ఆయన తెలిపారు. పెరుగుతున్న నిరుద్యోగం, వ్యవసాయ రంగ సంక్షోభం, హరించబడుతున్న కార్మిక హక్కులు, పెరుగుతున్న ఆర్థిక అంతరాలు వీటి నేపథ్యంలో కమ్యూనిస్టులు మరింత బలపడనున్నారని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం వేదికగా జరిగే సభ భవిష్యత్తులో కమ్యూనిస్టు పార్టీ పునర్ నిర్మాణం, పురోగమనానికి పునాదిగా నిలుస్తుందని కూనంనేని తెలిపారు.

## ఖమ్మం బహిరంగ సభ, ప్రదర్శకులకు సూచనలు

CENTENARY OF STRUGGLES & SACRIFICES

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో ఆదివారం జరిగే బహిరంగ సభకు వస్తున్న ప్రదర్శకులకు సూచనలు.

1. ప్రదర్శన కచ్చితంగా మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుంది.
2. బహిరంగ సభ మధ్యాహ్నం 3 గంటలకు కళాశాల మైదానంలో ప్రారంభమవుతుంది.
3. అంతకు ముందే కళా రూపాల ప్రదర్శన ప్రారంభమవుతుంది.
4. జనసేవాదళ్ (ఖాకీ ప్యాంట్, రెడ్ షర్ట్, రెడ్ టోపీ, షూస్) వాలంటీర్ల కవాతు పెవిలి యన్ మైదానం నుంచి ప్రారంభ మవుతుంది.
5. పాలేరు, ఎఫ్‌సిఐ బైపాస్ ద్వారా వచ్చే వాహనాల ద్వారా దిగిన వారు నయాబజార్ కళాశాల వద్ద నుండి ప్రదర్శనగా బహిరంగ సభాస్థలికి చేరుకోవాలి.
6. రెండవ ప్రదర్శన వైరా రోడ్డులోని శ్రీశ్రీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమవుతుంది. వైరా రోడ్డు ద్వారా వచ్చే వాహనాల వారు ఈ ప్రదర్శన ద్వారా సభాస్థలికి చేరుకోవాలి.
7. తెలంగాణ జిల్లాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జనసేవాదళ్ వాలంటీర్లు ఆదివారం ఉదయం 11 గంటలకు పెవిలియన్ మైదానంకు చేరుకోవాలి.
8. రైళ్ల ద్వారా వచ్చేవారందరూ నయాబజార్ కళాశాల నుండి ప్రారంభమయ్యే ప్రదర్శనలో పాల్గొనాలి. ఉమ్మడి నల్గొండ, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాలు, ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నుంచి వాహనాల్లో వచ్చిన ప్రజలు నయాబజార్ కళాశాల మైదానంకు చేరుకుని అక్కడి ప్రదర్శనలో పాల్గొనాలి.
9. మొదటి ప్రదర్శనకు సిపిఐ ఏపి రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నర్సింహ్మ, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేతృత్వం వహిస్తారు.
10. శ్రీశ్రీ విగ్రహం నుండి ప్రారంభమయ్యే ప్రదర్శనకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలు, ఆంధ్రప్రదేశ్ నుండి వాహనాల్లో వచ్చే వారందరూ శ్రీశ్రీ విగ్రహం వద్దకు చేరుకోవాలి.
11. ఈ ప్రదర్శనకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డిలు నేతృత్వం వహిస్తారు. ఈ ప్రదర్శనలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర సమితి సభ్యులతోపాటు భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొనాలి.
12. వాహనాలు కార్యకర్తలను దింపిన తర్వాత మొదటి ప్రదర్శనకు సంబంధించిన వాహనాలు పెద్ద తండా వద్ద, వైరా వైపు నుంచి వచ్చే వాహనాలు ఎస్ ఆర్ గార్డెన్స్ వద్ద, ఖాళీ స్థలాల్లో పార్కింగ్ చేయాలి.
13. తెలంగాణ జిల్లాల నుంచి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చే కళాకారులు, డప్పు దళా లు, కోలాటం, ఇతర కళాకారులు ఆదివారం మధ్యాహ్నం పెవిలియన్ మైదానంకు చేరుకోవాలి. జనసేవాదళ్ ప్రదర్శన తర్వాత కళాకారుల ప్రదర్శన ఉంటుంది.

## వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ...


ఫిల్మ్ డైరెక్టర్ **బాబ్జీ**

**పల్లవి :**
ఒకటి కాదు రెండు కాదు వంద మైలురాళ్ళు
కత్తుల వంతెనలు దాటి నడిసొచ్చిన పార్టీ
తుపాకుల కొనల మీద తుమ్మెదల్లె వాలి
తూటాల చప్పుళ్లకు తొడ చరిచిన పార్టీ
చెరసాలల గోడలపై నెత్తుటి పాటల్ని రాసి
పోరాడే వీరులకు కరవాలం అయిన పార్టీ
నాగేటి చాళ్లలోన సుత్తీ కొడవళ్ళు నాటి
మట్టిమనిషి గుండెల్లో మందారం అయిన పార్టీ
శత వసంత ప్రస్థానం నీదోయమ్మా......
భారత కమ్యూనిస్టు పార్టీ వందనమమ్మా......
జయ జయహే జయ జయహే జయజయ జయహే
జయ జయహే జయ జయహే జయజయ జయహే
॥ఒకటి కాదు॥

**చరణం : 1**
పెదవులన్ని చిరునవ్వును మరచిపోయినప్పుడు
కంటిరెప్ప భయంతోటి వణికి పోయినప్పుడు
బీద బిక్కి గుడిసెలన్ని పొగిలి ఏడ్చినప్పుడు
రైతన్నల పాదాలు నెత్తురోడినప్పుడు
తూరుపు కనుమలు చీల్చుకు ఉదయించిన పార్టీరా
దోపిడి దొరగడీ కూల్చగ తొడ చరిచిన పార్టీరా
॥జయ జయహే ॥
॥ఒకటి కాదు॥

**చరణం : 2**
కడుపు కోతతో తల్లులు తల్లడిల్లినప్పుడు
పసిపాపల కనులలోన భయం దొర్లినప్పుడు
సస్యశ్యామల దేశం పేగు మాడినప్పుడు
జనగణమన గీతమే జడిసి చూసినప్పుడు
దేశపు చౌరస్తాలో తప్పెట కొట్టిన పార్టీ
జంగ్‌సైరన్ ఊదుకుంటూ గర్జించినదీపార్టీ
॥జయ జయహే॥
॥ఒకటి కాదు॥

**చరణం : 3**
పాలకులే పాములయ్యి బుసలు కొట్టినప్పుడు
పిరికి మందు తాగి ఊరు నిద్దరోయినప్పుడు
కటకటాల వెనుక కలం బందీ అయినప్పుడు
అక్షరాలు ఉరికొయ్యకు ఊయలూగినప్పుడు
విప్లవాన్ని గుండెలకు హత్తుకున్న పార్టీరా
మట్టిని తన చిరునామాగా మార్చుకున్న పార్టీరా
॥జయ జయహే॥
॥ఒకటి కాదు॥

**చరణం : 4**
లోకానికి ఒక స్వప్నం రాసిచ్చిన పార్టీరా
మరో ప్రపంచం వైపు నడుపుతున్న పార్టీరా
బహిష్కృత పాదాలను బందూకులుగా మార్చి
దోపిడోళ్ళ పాలనపై పోరుతున్న పార్టీరా
పారే సెలయేటిలోంచి విరబూసినదీపార్టీ
ఎర్రెర్రని వసంతాలు ఎగజిమ్మినదీపార్టీ
॥జయ జయహే॥
॥ఒకటి కాదు॥



## ప్రజా సమస్యల పరిష్కార వారధి 'ప్రజాపక్షం'

### క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపక్షం దినపత్రిక పని చేస్తుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో ప్రజాపక్షం తెలుగు జాతీయ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఎల్‌ఏ బాలునాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, డిఎస్పి ఎంవి. శ్రీనివాస్‌రావు, సిఐ వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి అరుణసురేష్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం డిండి మండల అధ్యక్షులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్‌గౌడ్, వెంకటే శ్వర్లు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంకటయ్య, రామస్వామి, ఆంజనేయులు, ప్రజాపక్షం నియోజకవర్గ ఇంచార్జీ దర్శనం విష్ణు, చందంపేట రిపోర్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

## నిజాన్ని నిర్భయంగా రాసే జర్నలిజమే ప్రజాస్వామ్యానికి ప్రాణం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ప్రజాస్వామ్య విలువలు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ప్రజాపక్షం పత్రిక 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను ఆర్డీవో శేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గొంతుకగా నిలిచి పత్రికల పాత్ర సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజాపక్షం లాంటి పత్రికలు ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి నిజాన్ని నిర్భయంగా రాసే జర్నలిజమే ప్రజాస్వామ్యానికి ప్రాణమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, ప్రజాపక్షం విలేకరి కలకొండ సంజీవ, సీపీఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, టంగుటూరి రాములు, కొండూరు విప్లవ్, రొండి నరసింహ పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి వారధి ప్రజాపక్షం



**ప్రజాపక్షం/చింతలపాలెం :** నిర్భయంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ప్రజాపక్షం దినపత్రిక కృషి చేస్తుందని తహశీల్దార్ సోమపంగు సూరయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రజాపక్షం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆయన చేతుల మీదగా ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ అవినీతి, అక్రమాలను వెలికితీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం మండల రిపోర్టర్ షేక్ అబ్దుల్ రహీం, సీనియర్ అసిస్టెంట్ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ రాజేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఐ ఖమ్మం సభకు తరలిరండి

### మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పిలుపు



**ప్రజాపక్షం/చింతపల్లి :** ఖమ్మంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభను జయప్రదం చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో యాదగిరిరావు పాల్గొని మాట్లాడారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ సభ నేడు ఖమ్మంలో జరుగుతుందని, ఈ సభకు వేలాదిగా ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. భారతదేశంలో సిపిఐకి ఉజ్వల చరిత్ర ఉన్నదని, దేశం గర్వించదగ్గ స్వాతంత్ర సమరయోధులని సిపిఐ సృష్టించిందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సిపిఐ నాయకత్వం వహించి భూములను పేదలకు పంచి, వందలాది మందిని సిపిఐ బలిదానం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, పల్లపు లక్ష్మయ్య, శేఖరాచారి, బుచ్చయ్య, శ్రీశైలం, వెంకటయ్య, వీరయ్య, ఇద్ది రాములు, పాప శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సురక్షితంగా చేరుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** రోడ్డు ప్రమాదాలు నివారించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం మహా ఉద్యమంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి డిపోలో ఆర్‌టిసి డ్రైవర్లు, లారీ అసోసియేషన్ వారికి, టాక్సీ డ్రైవర్లకు, అంజనాపురి జంక్షన్, అంబేద్కర్ కాలనీ జంక్షన్ వినియోగదారులకు రోడ్డు భద్రత, అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితం చాలా విలువైనదని, ప్రతి మనిషి మరణానికి సార్థకత ఉండాలన్నారు. భారతదేశంలో దేశ రక్షణలో మరణించే వారి కంటే రోడ్డు ప్రమాదాలలో మరణించే వారి సంఖ్య అధికంగా ఉందన్నారు. అర్థంతరంగా మరణిస్తే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, తల్లిదండ్రులకు తోబుట్టువులకు దుఃఖాన్ని మిగులుస్తున్నారని అన్నారు. అర్వపల్లి వద్ద జరిగిన కారు ప్రమాదాన్ని గుర్తుచేశారు. విధుల నిర్వహణలో పోలీసు సోదరులు రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోయిన సందర్భాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్నకుమార్, ఆర్‌టిసి డిపో మేనేజర్ సునీత, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్థోపెడిక్ డాక్టర్ కార్తీక్, ఎస్‌ఐలు సాయిరాం, ఏడుకొండలు, మహేందర్ పాల్గొన్నారు.

# సూపర్ స్మార్ట్ సిటీగా నల్లగొండ

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

### కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ మున్సిపాలిటీ నగరపాలక సంస్థగా మారినందున నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.శనివారం ఆయన మున్సిపల్ కార్పొరేషన్‌లో సుమారు 18.7 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.అనంతరం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మంత్రి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ఇప్పటివరకే సుమారు రెండువేల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అమృత్2 కింద 216 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నూతన ఎస్ టి పి నిర్మాణ పనులు జరుగుతున్నాయని ,అలాగే 56 కోట్ల 75 లక్షలతో మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు కొత్తగా 12 ట్యాంకులు, తాగునీటి పైప్లైన్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు.రూ.53 కోట్ల టియుఎఫ్ఐడిసి నిధులతో అంతర్గత రోడ్లు,డ్రైనేజీ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని,109 కోట్ల రూపాయలతో ఎస్ డిఎఫ్ నిధులతో వరద కాలువల నిర్మాణం, స్మశాన వాటికల అభివృద్ధి పనులు, నల్లగొండ నుండి మునుగోడు రోడ్డు, ధర్వేశిపురం రోడ్డు,ముశ్రం పల్లి రోడ్డు డబుల్ రోడ్ 100 కోట్ల రూపాయలతో పనులు 70 శాతం పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని 48 డివిజన్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారుఈ సందర్భం గా మంత్రి పట్టణంలోని వీటి కాలనీ, చింతల్ పార్క్, దేవరకొండ రోడ్డు, సావర్కర్ నగర్, పాలిటెక్నిక్, తదితర ప్రాంతాలలో 18 కోట్ల 70 లక్షలతో చేపట్టనున్న పార్కులు, రహదారులు,బిటి రోడ్లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్లు, తాగునీటి సరఫరా తదితర పనులకు శంకుస్థాపనలు చేశారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మొదటిసారిగా కార్పొరేషన్ అయిన నల్గొండ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, ప్రజారోగ్య సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హఫీజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్లు బుర్రి శ్రీనివాస్ రెడ్డి,బొడ్డుపల్లి లక్ష్మి శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ఖరారు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ఖరారు చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ ఖరారు ప్రక్రియని పారదర్శకంగా కలెక్టర్ నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా లోని భువనగిరి మున్సిపాలిటీలో 35 వార్డులు, ఆలేరు మున్సిపాలిటీలో 12 వార్డులు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ లో 12 వార్డులు, చౌటుప్పల్ మున్సిపాలిటీలో 20 వార్డులు, పోచంపల్లి మున్సిపాలిటీలో 13 వార్డులు, మోత్కూరు మున్సిపాలిటీలో 12 వార్డులకు రిజర్వేషన్ ఖరారు చేశారు. మున్సిపాలిటీలకు సంబంధించి వార్డుల నిబంధనల రిజర్వేషన్ ప్రక్రియ ప్రకారం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ ద్వారా కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా రిజర్వేషన్ కేటాయింపులు చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంత రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, ఆర్డీవోలు, కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ పారదర్శకం

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మున్సిపాలిటి వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటిల పరిధిలోని 141 వార్డులకు రిజర్వేషన్ ప్రక్రియను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిల్లో ప్రభుత్వం జారీ చేసిన జిఓ ప్రకారం మహిళలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు వార్డుల వారీగా రిజర్వేషన్లు కేటాయించామని తెలిపారు. గత ఎన్నికల రిజర్వేషన్, ఎస్‌టి, ఎస్‌టి, బిసి జనాభా లెక్కలు, రొటేషన్ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్లను ప్రకటించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, మున్సిపల్ కమీషనర్లు హన్మంతరెడ్డి, రమాదేవి, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, మున్వర్ అలీ, రాజకీయ పార్టీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## మార్గదర్శకాలను అనుసరిస్తూ మహిళా రిజర్వేషన్‌లు ఖరారు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని నల్లగొండ నగర పాలక సంస్థతో పాటు,ఇతర మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ మహిళా రిజర్వేషన్‌లు ఖరారు చేయడం జరిగిందని నల్లగొండ జిల్లా కలెక్టర్,ఎన్నికల అధికారి,బి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లాలోని 6 మున్సిపాలిటీలు,నల్లగొండ నగరపాలక సంస్థ మహిళా రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి ఓ ప్రకారం, అలాగే 2011 జనాభా ప్రాతిపదికన,బీసీ డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా రిజర్వేషన్ కేటాయింపులు చేశామని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. ఖరారైన రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదించడం జరుగుతుందని తెలిపారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కలుపుకొని తక్కిన ఆరు మున్సిపాలిటీలలో 162 మున్సిపల్ వార్డులకు గాను నిబంధనల ప్రకారం 50 శాతం వార్డులను మహిళలకు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి ,చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి ,దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి కన్నారావు,బిఆర్ఎస్ బక్క పిచ్చయ్య, సిపిఐ నుంచి కర్రె సైది రెడ్డి,బిజెపి లింగస్వామి పాల్గొన్నారు.

## చిరుతపులి అడుగులు గుర్తింపు



**ప్రజాపక్షం /యాదాద్రి :** రాజాపేట మండలం బేగంపేట గ్రామ పరిసర ప్రాంతంలో చిరుత పులి అడుగులు శనివారం గ్రామస్తులు, బావుల కాడి రైతులు గుర్తించారు. దీంతో ఆందోళన చెంది రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా బేగంపేట సున్నం పర్రే సమీపంలో చిరుత పులి అడుగు మాదిరి ముద్రలు ఉన్నట్టు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలానికి తహశీల్దార్ ప్రదీప్, జిల్లా ఫారెస్ట్ అధికారులు చేరుకొని అడుగులను పరిశీలించారు. ఎక్కడ పులి సంచారం జరుగుతోందనే విషయంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. అంతకు ముందు రోజు పక్కనేగల సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్ల, మునిగడప, వెంకటాపురం పరిసర ప్రాంతంలో పులి సంచరించిన అడుగులు రైతులు గ్రామస్తుల ద్వారా ఫారెస్ట్ అధికారులు కనుగొన్నారు. పులి బేగంపేట వైపు వచ్చినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ సంచరించొద్దని, ఒంటరిగా రైతులు కూలీలు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్ళవద్దని సూచించారు. పులి అడుగులతో బేగంపేట గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

## బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న కౌండిన్య భవనం బ్రిడ్జి నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 38వ వార్డు వినోభానగర్‌లో నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించి మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణంతో కిలోమీటరు దూరం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.


## నల్లగొండ జిల్లాలో మున్సిపాలిటీల వార్డులు, చైర్మన్‌ల రిజర్వేషన్లు

**ప్రజాపక్షం/నల్లగొండ :** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని నల్లగొండ నగర పాలక సంస్థతో పాటు,ఇతర మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ మహిళా రిజర్వేషన్ లు ఖరారు చేశారు.జిల్లాలోని 6 మున్సిపాలిటీలు, నల్లగొండ నగరపాలక సంస్థ మహిళా రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను శనివారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓ ప్రకారం, అలాగే 2011 జనాభా ప్రాతిపదికన, బీసీ డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా రిజర్వేషన్ కేటాయింపులు చేశారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కలుపుకొని తక్కిన ఆరు మున్సిపాలిటీలలో 162 మున్సిపల్ వార్డులకు గాను నిబంధనల ప్రకారం 50 శాతం వార్డులను మహిళలకు కేటాయించారు.నల్లగొండ కార్పొరేషన్ జనరల్ మహిళ,నందికొండఎస్ సి జనరల్, దేవరకొండ బీసీ మహిళ రిజర్వ్,చండూరు,నకిరేకల్,హాలియా ఓపెన్ జనరల్,మిర్యాలగూడ,చిట్యాల మున్సిపల్ చైర్మన్ పదవికి జనరల్ మహిళకు రిజర్వ్ ఖరారు చేశారు.

## ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రభుత్వ ఉపాధ్యాయులు...

### ఇద్దరు మృతి... ముగ్గురికి గాయాలు...

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్‌పి కె. నరసింహ





**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఉపాధ్యాయులంతా కలిసి కారులో వెళ్తుండగా దుర్ఘటన చోటుచేసుకుంది. సంక్రాంతి సెలవులు ముగియడంతో తిరిగి తమ పాఠశాల విధులు నిర్వహించడానికి రోజువారిగా పాఠశాలకు కలిసి వెళ్తుండేవారు. సంక్రాంతి సెలువులు ముగియడంతో శనివారం ఉదయం పాఠశాలకు వెళ్తున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు అర్వపల్లి మండల కేంద్రంలో ఫల్టీలు కొట్టి రోడ్డు పక్కకు పడిపోవడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మరొకరు మార్గమధ్యంలో చనిపోయారు. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే తుంగతుర్తి మండల కేంద్రంలో కెజిబివి పాఠశాలలో ఎస్‌ఓగా విధులు నిర్వహిస్తున్న కల్పన, రావులపల్లి జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న పోరెడ్డి గీతరెడ్డి, అన్నారం జడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు అల్వాల సునీతరాణి, తుంగతుర్తి జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్వాల ప్రవీణ్‌లు ఒకే మండలంలో పనిచేసే వీరంతా కలిసి నల్లగొండ నుండి వస్తుండగా అర్వపల్లి వద్ద కారు అదుపు తప్పి ఫల్టీలు కొట్టడంతో మామిడాల కల్పన అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సైదులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108లో ఏరియా ఆసుప్రతికి తరలించారు. నాగారం సిఐ నాగేశ్వర రావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గీతారెడ్డి పరిస్థితి విషమించడంతో హైదారాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. అక్క తమ్ముళ్లు అయిన అల్వాల ప్రవీణ్, అల్వాల సునీతారాణి, డ్రైవర్ చికిత్స పొందుతున్నారని ఎస్ఐ వివరించారు. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్‌పి కె నరసింహ పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును, ప్రమాద బాధితుల వివరాలను తెలుసుకున్నారు.

# ఉత్కంఠకు 'తెర'...

**ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన మున్సి పల్ ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియకు తెరప డింది. మున్సిపల్ ఎన్నికలకు అధికారులు శనివారం రిజర్వేషన్లు ఖరారు చేశారు. జిల్లా లోని ఐదు మున్సిపల్ చైర్మన్ స్థానాలను తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టరేట్ (సిడిఎంఏ) హైద్రాబాద్ వారు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ వెల్లడించగా వార్డుల రిజర్వేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షములో ప్రకటించారు. సూర్యాపేట, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ స్థానాలు జనరల్ కాగా, కోదాడ మహిళా జనరల్, హుజూర్‌నగర్ బిసి జనరల్‌గా ఖరారు అయ్యాయి.**

### మున్సిపల్ పోరుకు రిజర్వేషన్ల ఖరారు

### ఐదు మున్సిపాలిటీల పరిధిలో 141 వార్డులకు

### సూర్యాపేట, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ స్థానాలు జనరల్

### కోదాడ మహిళా జనరల్, హుజూర్‌నగర్ బిసి జనరల్




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో మొత్తం ఐదు మున్సిపాలిటిలు ఉన్నాయి. ఇందులో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్లలు ఉండగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టరేట్ (సిడిఎంఏ) హైద్రాబాద్ వారు రిజర్వేషన్లను ఖరారు చేసి రిజర్వేషన్లను ప్రకటించారు. సూర్యాపేట, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ స్థానాలు జనరల్ కాగా, కోదాడ మహిళా జనరల్, హుజూర్‌నగర్ బిసి జనరల్ అయ్యాయి. వీటి పరిధిలో మొత్తం 141 వార్డులు ఉండగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షములో రిజర్వేషన్ల ప్రక్రియను ఖరారు చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జిఓ ప్రకారం మహిళ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి లకు వార్డుల వారీగా రిజర్వేషన్లను కేటాయించారు. గత ఎన్నికల రిజర్వేషన్లు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి జనాభా లెక్కల రోటేషన్ విధానం వంటి అంశాలు సమగ్రంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా డ్రా ద్వారా తీసి ప్రకటించారు. సూర్యాపేట మున్సిపాలిటిలో మొత్తం 48 వార్డులు ఉండగా 1, 32 వార్డులు ఎస్‌టి జనరల్, 5 ఎస్‌టి మహిళ, 3, 7, 19, 28 వార్డులు ఎస్‌సి జనరల్, 8, 21, 30 వార్డులు ఎస్‌సి మహిళ, 2, 12, 14, 34, 41, 47, 48 వార్డులు బిసి జనరల్, 11, 15, 17, 36, 39, 43 బిసి మహిళ, 4, 9, 20, 22, 23, 25, 26, 27, 29, 35, 44, 45, 46 జనరల్ మహిళ, 6, 10, 16, 18, 31, 33, 37, 38, 40, 42 జనరల్ స్థానాలుగా రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. కోదాడ మున్సిపాలిటిలో మొత్తం 35 వార్డులు ఉండగా 1వ వార్డు జనరల్ ఉమెన్, 2 ఎస్‌టి జనరల్, 3 ఎస్‌సి జనరల్, 4 ఎస్‌టి ఉమెన్, 5 జనరల్, 6 ఎస్‌సి ఉమెన్, 7 జనరల్, 8 బిసి ఉమెన్, 9 ఎస్‌సి జనరల్, 10 జనరల్, 11, 12 జనరల్ ఉమెన్, 13 బిసి ఉమెన్, 14, 15, 16, 17 బిసి జనరల్, 18, 19, 20 జనరల్, 21 బిసి ఉమెన్, 22 జనరల్, 23 జనరల్ ఉమెన్, 24 జనరల్, 25, 26 జనరల్ ఉమెన్, 27 జనరల్, 28 జనరల్ ఉమెన్, 29 ఎస్‌సి ఉమెన్, 30 బిసి ఉమెన్, 31 జనరల్ ఉమెన్, 32 బిసి జనరల్, 33 ఎస్‌సి జనరల్, 34 జనరల్ ఉమెన్, 35 బిసి ఉమెన్ గా ఖరారు చేశారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో మొత్తం 28 స్థానాలు ఉండగా 1, 2 వ వార్డులు జనరల్ ఉమెన్, 3 బిసి ఉమెన్, 4 జనరల్ ఉమెన్, 5 బిసి ఉమెన్, 6 జనరల్ ఉమెన్, 7 బిసి జనరల్, 8 జనరల్ ఉమెన్, 9 జనరల్, 10 బిసి జనరల్, 11 జనరల్, 12 ఎస్‌సి జనరల్, 13, 14 ఎస్‌సి ఉమెన్, 15 ఎస్‌టి జనరల్, 16, 17 జనరల్ ఉమెన్, 18 జనరల్, 19, 20, 21 బిసి జనరల్, 22 బిసి ఉమెన్, 23 జనరల్ ఉమెన్, 24, 25 జనరల్, 26 బిసి ఉమెన్, 27 జనరల్, 28 ఎస్‌సి జనరల్ గా కేటాయించారు. తిరుమలగిరి మున్సిపాలిటి పరిధిలో 15 వార్డులు ఉండగా 1వ వార్డు జనరల్ ఉమెన్, 2 బిసి జనరల్, 3 ఎస్‌సి జనరల్, 4 బిసి ఉమెన్, 5 జనరల్, 6 జనరల్ ఉమెన్, 7 బిసి జనరల్, 8 జనరల్ ఉమెన్, 9 జనరల్, 10 ఎస్‌టి జనరల్, 11 జనరల్ ఉమెన్, 12 ఎస్‌సి ఉమెన్, 13 జనరల్ ఉమెన్, 14 జనరల్, 15 ఎస్‌సి జనరల్‌గా ఖరారు అయ్యాయి. నేరేడుచర్ల మున్సిపాలిటి పరిధిలో 15 వార్డులు ఉండగా 1వ వార్డు ఎస్‌టి జనరల్, 2 జనరల్ ఉమెన్, 3 జనరల్, 4 జనరల్ ఉమెన్, 5 ఎస్‌సి జనరల్, 6 జనరల్, 7, 8 జనరల్ ఉమెన్, 9 ఎస్‌సి జనరల్, 10 ఎస్‌సి ఉమెన్, 11 బిసి ఉమెన్, 12, 13 బిసి జనరల్, 14 జనరల్ ఉమెన్, 15 జనరల్‌గా ప్రకటించారు. ఇక రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే మిగిలింది.

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్

### సీనియర్ మావోయిస్టులు సహా ఇద్దరు మృతి

**బీజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో ఒకవైపు మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగుతుండగా, మరోవైపు భద్రతా బలగాలు, నక్సల్స్ మధ్య ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. బీజాపూర్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సీనియర్ క్యాడర్ దిలీప్ బెడ్జాతో సహా ఇద్దరు నక్సలైట్లను భద్రతా బలగాలు కాల్చిచంపాయని పోలీసులు తెలిపారు. జిల్లాలోని వాయువ్య ప్రాంతంలోని అటవీ కొండల్లో ఉదయం ఈ కాల్పుల ఘటన జరిగిందని, అక్కడ భద్రతా బలగాల సంయుక్త బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో ఉందని ఒక సీనియర్ అధికారి తెలిపారు. డివిజనల్ కమిటీ సభ్యుడైన బెడ్జా ఆ ప్రాంతంలో ఉన్నాడనే సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ ప్రారంభించబడిందని, ఇందులో ఛత్తీస్‌గఢ్ పోలీసులకు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ అలాగే సిఆర్‌పిఎఫ్‌కు చెందిన ఉన్నత విభాగమైన కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్) సిబ్బంది పాల్గొన్నారని ఆయన చెప్పారు. కాల్పుల్లో మరణించిన మరో క్యాడర్ గుర్తింపు ఇంకా తెలియాల్సి ఉందని ఆ అధికారి తెలిపారు. 'ఇప్పటివరకు, సంఘటనా స్థలం నుండి ఇద్దరు నక్సలైట్ల మృతదేహాలు, ఎకె47 రైఫిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. బెడ్జా మావోయిస్టుల జాతీయ పార్క్ ఏరియా కమిటీలో చురుకుగా ఉన్నాడని, అనేక దాడులలో పాల్గొన్నాడని ఆ అధికారి చెప్పారు. జనవరి 3న బీజాపూర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ ప్రాంతంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 14 మంది నక్సలైట్లు కాల్చివేయబడ్డారు. గతేడాది ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 285 మంది నక్సల్స్ మరణించారు.

## అంతటా యుద్ధ వాతావరణం

### ఇరాన్ పరిస్థితులు వివరించిన భారతీయులు

**న్యూఢిల్లీ:** ఇరాన్‌లో పరిస్థితులు క్షీణించడంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను విదేశాంగ శాఖ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. తొలివిడతలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి తర్వాత పలువురు భారతీయులు ఢిల్లీ చేరుకున్నారు. అనంతరం వారు ఇరాన్‌లో పరిస్థితుల గురించి మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌లో ఎక్కడ చూసినా ఆందోళనకారులే ఉన్నారని, ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితులే లేవన్నారు. వీధుల్లో నిరసనకారుల మతదేహాలు, ప్రజల హాహాకారాలతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. ఇంటర్నెట్ సదుపాయం నిలిపివేయడంతో తమ పరిస్థితిని కుటుంబసభ్యులకు వివరించే అవకాశం లేక తీవ్ర భయాందోళనకు గురయ్యామన్నారు. విదేశాంగ శాఖ అధికారులను సంప్రదించడానికి కూడా



వీలు కాలేదన్నారు. ఈ రెండు వారాలపాటు క్షణమొక యుగంలా గడిచిందన్నారు. తిరిగి భారత్‌కు వస్తామనుకోలేదని, ఇటువంటి క్లిష్ట సమయంలో తమను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కతజ్ఞతలు తెలిపారు. తమ వారి కోసం విమానాశ్రయానికి చేరుకున్న కుటుంబసభ్యులు మాట్లాడుతూ చాలా రోజులుగా తమ వారితో ఎటువంటి సంప్రదింపులు లేవన్నారు. ఇరాన్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో వారి పరిస్థితిపై తాము ఆందోళన చెందామని, కానీ మోదీ ప్రభుత్వం చొరవతో తమ కుటుంబసభ్యులు తిరిగి వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇరాన్‌లో ప్రస్తుతం 10 వేల మందికి పైగా భారతీయులు (విద్యార్థులు సహా) నివసిస్తున్నట్లు అంచనా. వివిధ ప్రాంతాల్లో ఉన్న వీరిని సంప్రదించేందుకు తెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయ సిబ్బంది ప్రయత్నాలు చేస్తోంది. అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో అడపాదడపా పనిచేస్తుండడం ఇందుకు ఇబ్బందికరంగా మారినట్లు తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారిని చేరుకునేందుకు ఎంబసి సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అందుబాటులో ఉన్న మార్గాల్లో దేశాన్ని వీడాలని విదేశాంగ శాఖ వారికి సూచించింది. స్వదేశానికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నవారిని సురక్షితంగా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోంది.

## పురుషులకూ ఉచిత ప్రయాణం : మహిళలకు రూ.2 వేల పెన్షన్

### అన్నా డిఎంకె మేనిఫెస్టో హామీ

**చెన్నై:** తమిళనాడులో ఎన్నికల వేడి మొదలైంది. ఇతర పార్టీలు ఎన్నికల కోసం కమిటీలు ఏర్పాటు చేస్తుంటే... ప్రతిపక్ష అన్నా డిఎంకె మాత్రం మొదటి దశ మేనిఫెస్టోను శనివారం ప్రకటించింది. ఎంజీఆర్ జయంతి సందర్భంగా చేసిన ఈ ప్రకటనలో... తాము అధికారంలోకి వస్తే ఏయే హామీలు నెరవేరుస్తామో వివరించింది. ఇందులో పురుషులకు ఉచిత బస్సు ప్రయాణం సహా ఐదు కీలక హామీలు ఉన్నాయి. అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి ఇక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో తొలి దశ మేనిఫెస్టో ప్రకటించారు. రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు ఆర్థిక సాయం, మగవాళ్లకు ఉచిత బస్సు ప్రయాణం, అమ్మ టూ వీలర్ పథకం తదితరాలు ఉన్నాయి. వీటి ప్రకారం... మహిళల సంక్షేమం కోసం కులవిలక్కు పథకం అమలు చేస్తామని పళనిస్వామి చెప్పారు. ఈ పథకం ప్రకారం రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు రూ.2 వేల సాయం అందిస్తారు. ఇవి నేరుగా ఆ ఇంటి మహిళల ఖాతాలో జమ చేస్తారు. నగరాల్లోని బస్సుల్లో ప్రస్తుతం మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణం అమలవుతోంది. అధికారంలోకి వస్తే దానిని కొనసాగిస్తూ... పురుషులకూ వర్తింపజేస్తామని తెలిపింది. అమ్మా ఇల్లమ్ పథకం... గ్రామీణ ప్రాంతాల్లో సొంత ఇల్లు లేని వారికి ప్రభుత్వమే జాగా కొని... కాంక్రీట్ ఇల్లు కట్టి ఇస్తుంది. అదే పట్టణ ప్రాంతాల్లో అయితే అపార్ట్‌మెంట్‌లు నిర్మించి ఉచిత నివాసం అందిస్తుంది. ఇందులోనే దీనామణి ఉప పథకం కింద... ఎస్సి కులంలో పిల్లలు పెళ్లిళ్లు చేసుకుని వేరుగా నివసించాలనుకుంటే... ప్రభుత్వమే ఆ ఇళ్లను నిర్మించి ఇస్తుంది. ఉపాధి పథకం కింద కేంద్రం 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచగా...దీనిని 150 రోజులకు పొడిగిస్తామని అన్నాడిఎంకె ప్రకటించింది. అమ్మా... టూ వీలర్ పథకం కింద మహిళలకు రూ.5 లక్షల రుణం అందిస్తారు. ఇందులో ప్రభుత్వ సబ్సిడీ రూ.25 వేలు ఉంటుంది. ఎంజీఆర్ 109వ జయంతి సందర్భంగా ఈ ప్రకటన చేస్తున్నట్లు పళనిస్వామి తెలిపారు. అంతకుముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ డిఎంకె పాలనలో మహిళలకు భద్రత కరువైందని, ప్రజలు స్టాలిన్ సర్కార్‌పై ఆగ్రహంతో ఉన్నారని, రాబోయేది ఎన్డీయే సర్కారేనని ధీమా వ్యక్తం చేశారు.

## దేశంలో కులమే ఇప్పటికీ అతిపెద్ద ప్రవేశ పత్రం

### వివక్ష వ్యతిరేక చట్టం అవసరం : రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ:** విశ్వవిద్యాలయాల్లో దళిత యువత వాస్తవ పరిస్థితులు మారలేదని, వివక్ష వ్యతిరేక చట్టం అవసరాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నొక్కిచెప్పారు. శనివారం దళిత విద్యార్థి రోహిత్ వేముల 10వ వర్ధంతి సందర్భంగా రాహుల్ ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో 26 ఏళ్ల దళిత విద్యార్థి వేముల, వేధింపుల కారణంగా జనవరి 17, 2016న ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'ఈ రోజు రోహిత్ వేముల మరణించి 10 సంవత్సరాలు పూర్తయింది. కానీ రోహిత్ ప్రశ్న ఇప్పటికీ మన హృదయాల్లో ప్రతిధ్వనిస్తోంది: ఈ దేశంలో కలలు కనే హక్కు అందరికీ సమానంగా ఉందా?' అని ప్రశ్నించారు. 'రోహిత్ చదువుకోవాలనుకున్నాడు, రాయాలనుకున్నాడు. ఈ దేశాన్ని మెరుగైన ప్రదేశంగా మార్చడానికి అతను సైన్స్, సమాజం, మానవత్వాన్ని అర్థం చేసుకోవాలనుకున్నాడు. కానీ ఈ వ్యవస్థ ఒక దళితుడి పురోగతిని సహించలేకపోయింది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. సంస్థాగత కుల వివక్ష, సామాజిక బహిష్కరణ, రోజువారీ అవమానాలు, అతని స్థానాన్ని గుర్తుచేసే భాష, అమానవీయ ప్రవర్తన 'ఇదే ఒక ఆశాజనకమైన యువకుడిని అతని ఆత్మగౌరవం హరించుకుపోయి, ఒంటరిగా మిగిలిపోయే స్థాయికి నెట్టివేసిన విషం' అని రాహుల్ గాంధీ అన్నారు. 'మరి ఈ రోజు దళిత యువత వాస్తవ పరిస్థితి మారిందా? క్యాంపస్‌లో అదే చిన్నచూపు, హాస్టళ్లలో అదే ఒంటరితనం, తరగతి గదుల్లో అదే ఆత్మన్యూనతా భావం, అదే హింస, కొన్నిసార్లు, అదే మరణం. ఎందుకంటే ఈ దేశంలో కులమే ఇప్పటికీ అతిపెద్ద ప్రవేశ పత్రం'




అని ప్రశ్నిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రోహిత్ వేముల చట్టం కేవలం ఒక నినాదం కాదు, అది ఒక అవసరం అని కాంగ్రెస్ నాయకుడు నొక్కి చెప్పారు.'తద్వారా విద్యా సంస్థలలో కుల ఆధారిత వివక్ష నేరంగా మారుతుంది, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటారు, ఏ విద్యార్థినైనా వారి కులం ఆధారంగా విచ్ఛిన్నం చేయడానికి, మౌనంగా ఉంచడానికి, బహిష్కరించడానికి ఉన్న స్వేచ్ఛకు ముగింపు పలకబడుతుంది' అని ఆయన అన్నారు. ఈ పోరాటం కేవలం పార్లమెంటులో మాత్రమే కాదు, ఇది క్యాంపస్‌లలోని యువత పోరాటంస 'ఇది మన పోరాటం' అని గాంధీ అన్నారు. 'దళిత యువత మీ గొంతులను వినిపించండి, మిమ్మల్ని మీరు సంఘటితం చేసుకోండి, ఒకరికొకరు అండగా నిలబడండి. డిమాండ్ చేయండి: రోహిత్ వేముల చట్టాన్ని ఇప్పుడే అమలు చేయండి. మనకు ఇప్పుడు వివక్ష వ్యతిరేక చట్టం అవసరం' అని ఆయన పిలుపునిచ్చారు. కర్ణాటక, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేసే ప్రక్రియలో ఉన్నాయని ఆయన అన్నారు. 'మాకు న్యాయమైన, మానవత్వంతో కూడిన, సమానత్వంగల భారతదేశం కావాలి అక్కడ ఏ దళిత విద్యార్థి కూడా తమ కలల కోసం తమ ప్రాణాలను బలివ్వాల్సిన అవసరం ఉండకూడదు. రోహిత్, నీ పోరాటం మా బాధ్యత' అని గాంధీ అన్నారు.

## పోరాటం అప్పుడే ముగియలేదు

### మరాఠీలకు అండగా ఉంటాం: ఠాక్రే సోదరులు

**ముంబయి:** మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై శివసేన (ఠాక్రే) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే స్పందించారు. పదవిలో లేకపోయినా మరాఠా ప్రజలకు శివసేన నిత్యం అండగా ఉంటుందని తెలిపారు. దివంగత నేత బాలాసాహెబ్ ఠాక్రే స్థాపించిన శివసేన పార్టీ ఒకప్పుడు మహారాష్ట్ర రాజకీయాలను



శాసించింది. మరాఠా సంస్కృతి, భాష, స్థానికతే ప్రధాన ఎజెండాగా ఆ పార్టీ రాజకీయాలు చేసింది. అయితే ఎన్నోసార్లు కూటమి ప్రభుత్వంలో ప్రముఖ పాత్ర వహించిన శివసేన ముంబై మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం తిరుగులేని అధిపత్యం కనబరిచేది. గత 25 ఏళ్లుగా ముంబై మేయర్ పీఠం శివసేన(ఠాక్రే) వర్గానిదే. ముంబై మున్సిపల్ ఎన్నికల్లో మహాయుతి కూటమి స్పష్టమైన అధిపత్యం కనబరిచి ముంబై పీఠం కైవసం చేసుకుంది. ఓటమి తర్వాత ఠాక్రే సోదరులు స్పందించారు. బాలాసాహెబ్ ఠాక్రేతో ఫోటోతో కూడిన లేఖను ఉద్ధవ్ ఠాక్రే పోస్టు చేశారు. 'మా పోరాటం ముగియలేదు. మరాఠీలకు వారు కోరుకున్న విధంగా గౌరవం లభించేంత వరకూ ఇది ముగియదు' అని అన్నారు. ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ ఠాక్రే స్పందిస్తూ 'ప్రస్తుతం అధికారంలో ఉన్న శక్తులు మరాఠా ప్రజలను వేదించడానికి లభించే ఒక్క అవకాశాన్ని కూడా వదలరు. కనుక మనమంతా అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికలు వచ్చిపోతుంటాయి. కానీ మనం మరాఠా ప్రజల కోసం ఉన్న సంగతి మర్చిపోకూడదు. మరాఠా ప్రజలకు వ్యతిరేకంగా ఏదైనా జరిగితే తమ పార్టీ కార్పొరేటర్లు వారిని మోకాళ్ల మీద నిలబడేలా చేస్తారు' అని లేఖ విడుదల చేశారు.

## ఆత్మవిమర్శ చేసుకుంటాం

### పూణె, పింప్రి చించ్వాడ్‌లో ఓటమిపై అజిత్ పవార్

పూణె: ఎన్‌సిపి, ఎన్‌సిపి (ఎస్‌పి) చేయి కలిపి నప్పటికీ పూణె, పింప్రి చించ్వాడ్‌ను దక్కించుకోలేకపోయాయి. ఆ స్థానాల్లో బిజెపి గెలుపొందింది. దీంతో బిజెపికి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్‌సిపి అధినేత అజిత్ పవార్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో తమ ఓట మికి కారణాలను అన్వేషిస్తామని, ఆత్మ విమర్శ చేసుకుంటామని చెప్పారు. 2017 నుంచి 20 22 వరకు రెండు మున్సిపాలిటీల్లో అధికారంలో ఉన్న బిజెపి అక్రమాలకు పాల్పడిందని, అభి వృద్ధిని పట్టాలు తప్పించిందని పవార్ విమ ర్శించడంతో బిజెపి మండిపడింది. తమపై విమ ర్శలకు ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని తేల్చిచెప్పింది. అజిత్ పవార్ శనివారం విలే కరులతో మాట్లాడుతూ బిజెపి బలీయమైన పార్టీ గా ఆవిర్భవించిందన్నారు ఇవిఎంలపై ప్రతిప క్షా ల ఆరోపణలపై స్పందించేందుకు నిరాకరించారు. ఓడిపోతే ప్రశ్నించడం సహజమే నన్నారు. 'ఓటర్లు కీలకం. ప్రతి పార్టీ తమ ప్ర యత్నాలు



కొనసాగించాలి. బిజెపి మంచి ప్రదర్శన ఇచ్చింది. ఓడిపోయామని నిరాశపడటం కాదు మరింత మంచి ఫలితం సాధించే దిశ గా కసరత్తు కొనసాగించాలి' అని అజిత్ పవార్ అన్నారు. ఓటమిపై చర్చిస్తామని మరో ప్రశ్నకు బదులిచ్చారు. తమకు అనుకూలంగా. మీడియా అంచనా కూడా తారుమారు అయినట్లు తెలి పారు. పూనేలో బిజెపి 119 స్థానాలు గెలు ఉకోగా ఎన్‌సిపి 27, ఎన్‌సిపి (ఎస్‌పి) మూడు స్థానాలకు పరిమితమయ్యాయి. కాంగ్రెస్ 15 స్థానాలు గెలుచుకున్నది. పింప్రి చించ్వాడ్‌లో 128కుగాను 84 స్థానాలను బిజెపి కైవసం చేసుకుంది.

ఎన్‌సిపిఎస్‌సిపి(ఎస్‌పి)విలీనంపై చర్చించలేదు : కుటుంబంలో చీలికలు లేవు

ఎన్‌సిపి, ఎన్‌సిపి (ఎస్‌పి) విలీనంపై చర్చలు వార్తలు అవాస్తవమని అజిత్ పవార్ అన్నారు. అలాంటి చర్చ జరగలేదని చెప్పారు. ఓ వ్యవసాయ ప్రదర్శన కోసం బారామతికి వచ్చిన సందర్భంగా శరద్ పవార్ ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. ఆయనతో కలిసి ప్రదర్శనకు హా జరైనట్లు వెల్లడించారు. పవార్ కుటుంబం ఒక్క టిగానే ఉందని, అవసరమైనప్పుడు కలిసి కార్యక్రమాలకు వెళుతుంటామని అజిత్ పవార్ తెలిపారు. అజిత్, శరద్ పవార్ కలిసి ఈ ప్రదర్శ నను ప్రారంభించారు. అనంతరం శరద్ పవార్ ఇంటి వద్ద జరిగిన సమావేశానికి అజిత్ పవార్, సుప్రియా సూలే (ఎంపి), రోహిత్ పవార్ (ఎమ్మెల్యే), శశికాంత్ శిందే, జయంత్ పాటిల్, దత్తాత్రేయ భర్నే సహా రెండు వర్గాల నాయకులు హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని ఎన్‌సిపి (ఎస్‌పి) రాష్ట్ర అ ధ్యక్షుడు శశికాంత్ శిందే ప్రకటించడం గురించి తనకు తెలియదని అజిత్ పవార్ తెలిపారు. పొ త్తులపై నిర్ణయం స్థానిక యంత్రాంగాలదేనని చెప్పారు. మహాయుతిలో భాగంగా ఉన్నట్లు చె ప్పారు. మహాయుతిలో బిజెపి, ఎన్‌సిపి శివసేన (శిందే) ఉన్నాయి.


## 1,425 స్థానాల్లో బిజెపి విజయం

### ముంబయి, పుణెతో సహా డజనుకు పైగా మున్సిపల్ కార్పొరేషన్లలో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరణ

**ముంబయి:** మహారాష్ట్రలోని జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికారి బిజెపి కూటమి అత్యధిక స్థానాలను గెలుచుకుంది. 2,869 స్థానాలకు గాను బిజెపి 1,425 స్థానాలను కైవసం చేసుకుంది. ముంబయి, పుణెతో సహా డజనుకు పైగా మున్సిపల్ కార్పొరేషన్లలో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. 227 మంది సభ్యులున్న బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి)లో కాషాయ పార్టీ 89 స్థానాలను గెలుచుకుంది. దాని మిత్రపక్షమైన శివసేన 29 స్థానాలను గెలుచుకోగా, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) 65 స్థానాలను, ఎంఎన్ఎస్ 6 స్థానాలను గెలుచుకున్నాయి. వంచిత్ బహుజన్ ఆఘాడి (విబిఎ)తో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన కాంగ్రెస్ 24 స్థానాలను, ఎఐఎంఐఎం 8, ఎన్‌సిపి 3, సమాజ్‌వాదీ పార్టీ 2 స్థానాలను గెలుచుకోగా, ఎన్‌సిపి (ఎస్‌పి) బిఎంసిలో కేవలం ఒక స్థానాన్ని మాత్రమే గెలుచుకుంది.తుది లెక్కల ప్రకారం, 29 మున్సిపల్ కార్పొరేషన్లలో మొత్తం 2,869 స్థానాల్లో బిజెపి 1,425, శివసేన 399, కాంగ్రెస్ 324, ఎన్‌సిపి 167, శివసేన (యుబిటి) 155, ఎన్‌సిపి (ఎస్‌పి) 36, ఎంఎన్ఎస్ 13, బిఎస్‌పి 6, ఎస్ఇసి వద్ద రిజిస్టర్ అయిన పార్టీలు 129, గుర్తింపు పొందన పార్టీలు 196, 19 మంది స్వతంత్రులు విజయం సాధించారు. ముంబయి, ఛత్రపతి శంభాజీనగర్, నవీ ముంబయి, వసాయివిరార్, కళ్యాణ్‌–డోంబివిలి, కొల్హాపూర్, నాగ్‌పూర్, షోలాపూర్, అమరావతి, అకోలా, నాసిక్, పింప్రి– చించ్‌వాడ్, పుణె, ఉల్హాస్‌నగర్, థానే, చంద్రపూర్, పర్భానీ, పన్వేల్, మిరా భివాండినిజాంపూర్, లాతూర్, మాలేగావ్, సాంగ్లీ–మిరాజ్–కుప్వాడష జల్గావ్, అహల్యానగర్, ధూలే, జాల్నా, ఇచల్‌కరంజిలో ఎన్నికలు జరిగాయి.

## రాజ్యసభలో ఇంకా పెండింగ్‌లోనే...

## 19 ప్రభుత్వ బిల్లులు



### వాటిలో అత్యంత పురాతనమైనది 1992 నాటి జనాభా నియంత్రణ బిల్లు

**న్యూఢిల్లీ:** రాజ్యసభలో గవర్నమెంట్ పెండింగ్ బిల్లులకు చాలాకాలంగా మోక్షం లభించడం లేదు. వాటిలో అత్యంత పురాతనమైనది 1992 సంవత్సరం నాటి జనాభా నియంత్రణ బిల్లు కూడా ఉండటం గమనార్హం. రాజ్యసభ అనేది శాశ్వత సభ. కాబట్టి ఇది ఎప్పటికీ రద్దు చేయబడదు.దాని సభ్యులలో మూడింట ఒకవంతు మంది ప్రతీ రెండు సంవత్సరాలకూ పదవీవిరమణ చేస్తారు. కానీ లోక్‌సభలో పెండింగ్‌లో ఉన్నటువంటి బిల్లులు సభ రద్దుచేయబడినప్పుడు రద్దు అవుతాయి. రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్న బిల్లు ఎప్పుడూ రద్దు కాదు. ఎగువ సభ బులెటిన్ ప్రకారం ప్రస్తుతం 19 పెండింగ్ బిల్లులు ఉన్నాయి. వీటిలో పురాతనమైనది రాజ్యాంగ (79 సవరణ) బిల్లు, 1992 నాటిది ఉన్నది. రాష్ట్ర విధానంలోని ఆదేశిక సూత్రాలను సవరించి జనాభా నియంత్రణ, చిన్న కుటుంబ నియమాన్ని రాష్ట్రం నియంత్రించాలని, ప్రాథమిక విధుల్లో చిన్న కుటుంబ నియమాన్ని ప్రోత్సహించడం, స్వీకరించడాన్ని చేర్చాలని బిల్లు ప్రతిపాదించింది. ఇద్దరు కంటే ఎక్కువమంది పిల్లలు ఉంటే ఎంపి లేదా ఎమ్మెల్యేను అనర్హులుగా ప్రకటించాలని కూడా ఇది ప్రతిపాదించింది.అంతేకాకుండా పెండింగ్ బిల్లులలో ఢిల్లీ అద్దె (సవరణ) బిల్లు 1997 కూడా ఉంది. ఇది అద్దె నియంత్రణ చట్టాలను ఆధునీకరించే లక్ష్యంతో 1995 ఢిల్లీ అద్దె చట్టాన్ని సవరించడానికి ఉద్దేశించబడింది. కానీ అద్దెదారులు లేదా భూస్వామి సమూహాల నుండి పెద్ద యెత్తున ప్రతిఘటన ఎదుర్కొంది. ప్రభుత్వం విత్తన (సిడ్) బిల్లు 2025ను తీసుకురావడానికి కృషి చేస్తుండగా పెండింగ్ బిల్లులలో ది సిడ్స్ బిల్లు 2024 కూడా ఉంది. ఇది అమ్మకం, దిగుమతి, ఎగుమతి కోసం విత్తనాల నాణ్యతను నియంత్రించడం, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సప్లయ్‌ను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టబడిన ఇంటర్ స్టేట్ మైగ్రెంట్ వర్క్‌మెన్ (ఉపాధి నియంత్రణ, సేవా పరిస్థితుల) అమెండ్‌మెంట్ బిల్లు 2013, ది ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజెస్ (కంపల్సరీ నోటిఫికేషన్స్ ఆఫ్ వెకెన్సీస్) అమెండ్‌మెంట్ బిల్లు 2013, పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ కాస్ట్స్, షెడ్యూల్డ్ ట్రైబ్స్ యొక్క రీ అడ్జస్ట్‌మెంట్ రిప్రజెంటేషన్ (3) బిల్లు, 2013 కూడా ఉన్నాయి.ఎన్‌డిఎ పాలనలో ప్రవేశపెట్టబడిన పెండింగ్ బిల్లులలో అసోం, మేఘాలయ, త్రిపు, మిజోరాంలలోని స్వయం ప్రతిపత్తి మండలుల ఆర్థిక, కార్యనిర్వాహక అధికారాలను పెంచడం, ఎన్నికైన గ్రామ, మున్సిపల్ కౌన్సిల్స్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ఈ శాన్య ప్రాంతంలో గిరిజన స్వయంప్రతిపత్తిని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్న రాజ్యాంగం (125వ అమెండ్‌మెంట్) బిల్లు 2019, ది రిజిస్ట్రేషన్ ఆఫ్ మ్యారేజ్ ఆఫ్ నాన్‌రెసిడెంట్ ఇండియన్ బిల్లు, 2019 ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్నటువంటి తాజా బిల్లు ది పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ బిల్లు 2020నాటిది కూడా ఉంది.

## ముర్షిదాబాద్‌లో మళ్లీ కల్లోలం

### వలసకార్మికుడిపై దాడిని వ్యతిరేకిస్తూ రైలు పట్టాలను దిగ్బంధించిన నిరసనకారులు

### ఆందోళనకారుల పోలీసుల లాఠీచార్జ్

**కోల్‌కతా:** ఇప్పటికే హింసాత్మక ఘటనలతో కల్లోలంగా మారిన పశ్చిమ బెంగాల్‌లో మరోసారి ఆందోళనలు చెరలేగాయి. వలస కార్మికుడి మరణంపై రాష్ట్ర ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య రోడ్డు, రైలు రాకపోకలను గంటల తరబడి నిలిపివేసిన మరుసరోజు ముర్షిదాబాద్ జిల్లాలో శనివారం మరోసారి నిరసనకారులు బెల్దంగా వద్ద జాతీయ రహదారి12, రైల్వే ట్రాక్‌లను దిగ్బంధించారని పోలీసులు తెలిపారు. బెల్దంగాలోని బారువా మోర్ వద్ద హైవేపై వందలాది మంది స్థానికులు గుమిగూడడంతో, ఎన్‌హెచ్12లో ట్రాఫిక్ నిలిచిపోయిందని, నిరసనకారులు రైల్వే గేటును ధ్వంసం చేసి రైలు సేవలకు అంతరాయం కలిగించడానికి ప్రయత్నించారని వారు తెలిపారు. అయితే జనాన్ని చెదరగొట్టడానికి కొన్ని చోట్ల ఆందోళనకారులపై పోలీసులు లాఠీచార్జి చేశారని స్థానికులు ఆరోపించారు. బిహార్‌లో మరో వలస కార్మికుడు అనిసూర్ షేక్ దారుణంగా దాడి చేయబడ్డాడనే ఆరోపణ తాజా వివాదంగా మారింది.శుక్రవారం హింస తర్వాత కాస్త తగ్గిన ప్రజల్లో ఈ చర్య మళ్ళీ ఆగ్రహాన్ని రగిలించింది. పోలీసులు నిరసన స్థలం వద్ద పెద్ద బృందాన్ని మోహరించగా, స్థానిక ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రదర్శనకారులు, అధికారులతో చర్చలు జరిపారు. సాధారణ పరిస్థితులు పునరుద్ధరించడానికి, ఆందోళనలు తాజాగా హింసకు దారితీయకుండా నిరోధించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. సుజాపూర్ కుమార్‌పూర్ గ్రామ పంచాయతీ ప్రాంతానికి చెందిన 36 ఏళ్ల అలావుద్దీన్ షేక్ మరణించిన తరువాత శుక్రవారం నుండి బెల్దంగాలో ఉద్రిక్తత నెలకొంది. అతని మృతదేహం జార్ఖండ్‌లో అద్దెకు తీసుకున్న ఇంటిలో లభ్యమైంది.

## బెంగాల్‌కు 'చొరబాటు' అతిపెద్ద సవాల్

### శరణార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

### మాల్దా ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ

**మాల్దా:** పశ్చిమ బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిప్పులు చెరిగారు. చొరబాట్లను ప్రధానాంశంగా చేసుకుని తీవ్రంగా మండిపడ్డారు. పెద్ద ఎత్తున జరుగుతున్న అక్రమ వలసల వల్ల రాష్ట్ర జనాభా స్వరూపం మారిపోయిందని, అల్లర్లు చెలరేగుతున్నాయని, అధికార పార్టీ 'ఆశ్రయం, సిండికేట్ పాలన' కారణంగా ఇవి విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆయన ఆరోపించారు.ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కొనసాగుతున్న రాజకీయ వివాదం మధ్య, పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో మతపరమైన హింసను ఎదుర్కొని భారతదేశానికి వలస వచ్చిన మతువాల వంటి శరణార్థులకు మోదీ భరోసా ఇస్తూ వారు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. ముస్లింలు అధికంగా ఉన్న మల్దా జిల్లాలో జరిగిన ఒక భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ, చొరబాట్లు బెంగాల్ ముందు 'ఒక చాలా పెద్ద సవాలు'గా ఉన్నాయని, అభివృద్ధి చెందిన, సంపన్న దేశాలు కూడా అక్రమ వలసదారులను గుర్తించి, తొలగించడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత, చొరబాటుదారులపై ఉక్కుపాదం మోపడానికి, బెంగాల్‌లో అక్రమ వలసలను ఆపడానికి పెద్ద



ఎత్తున చర్యలు తీసుకుంటుందని మోదీ పేర్కొన్నారు. 'ప్రపంచంలో డబ్బుకు కొరత లేని అభివృద్ధి చెందిన, సంపన్న దేశాలు ఉన్నాయి. అయినప్పటికీ అవి చొరబాటుదారులను తొలగిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ నుండి కూడా చొరబాటుదారులను తొలగించడం అంతే అవసమని ఆయన అన్నారు. చొరబాట్ల ప్రభావం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంటూ, రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో జనాభా సమతుల్యత మారిపోయిందని ప్రధానమంత్రి అన్నారు. 'అనేక చోట్ల మాట్లాడే భాష కూడా మారడం ప్రారంభమైందని ప్రజలు నాకు చెబుతున్నారు. భాష, మాండలికంలో తేడాలు వస్తున్నాయి. చొరబాటుదారుల జనాభా పెరగడం వల్ల మాల్దా, ముర్షిదాబాద్ సహా పశ్చిమ బెంగాల్‌లోని అనేక ప్రాంతాలలో అల్లర్లు జరగడం ప్రారంభమయ్యాయి' అని ఆయన అన్నారు. టిఎంసి 'సిండికేట్' వ్యవస్థ చొరబాటుదారులను రాష్ట్రంలో స్థిరపడేలా చేయడానికి పనిచేస్తోందని మోదీ ఆరోపించారు. చొరబాటుదారులకు, అధికార పార్టీకి మధ్య ఒక పొత్తు ఉందని పేర్కొన్నారు. 'మీరు ఈ పొత్తును విచ్ఛిన్నం చేయాలి. బిజెపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, చొరబాట్లు, చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మీకు హామీ ఇస్తున్నాను' అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి శరణార్థులకు, ముఖ్యంగా రాజకీయంగా కీలకమైన మతువా సమాజానికి కూడా భరోసా ఇచ్చారు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) కింద పౌరసత్వం కల్పిస్తామనే వాగ్దానంతో 2019 నుండి మతువాలు బిజెపికి ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్నారు.'మతపరమైన హింస కారణంగా భారతదేశంలో ఆశ్రయం పొందిన మతువాల వంటి శరణార్థులకు నేను హామీ ఇవ్వాలనుకుంటున్నాను: మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని ఆయన అన్నారు. తన దాడిని తీవ్రతరం చేస్తూ, టిఎంసి 'గూండాయిజం' 'పేదలను బెదిరించే, భయపెట్టే దాని రాజకీయాలు' త్వరలోనే ముగిసిపోతాయని మోదీ అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలతో చుట్టుముట్టబడిన బెంగాల్ ఇప్పుడు మార్పుకు సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. సుపరిపాలనకు ప్రతీకగా నిలిచే బిజెపి ప్రభుత్వాలతో బెంగాల్ అన్ని వైపులా చుట్టుముట్టబడి ఉందని, ఇప్పుడు బెంగాల్‌లో కూడా సుపరిపాలన రావాల్సిన సమయం ఆసన్నమైంది' అని ఆయన అన్నారు. బిహార్‌లో బిజెపి సాధించిన ఎన్నికల విజయాన్ని గుర్తుచేసుకుంటూ, అప్పుడే తాను 'ఇది బెంగాల్ వంతు' అని వ్యాఖ్యానించానని మోదీ చెప్పారు. కేవలం మూడు నెలల దూరంలో ఉన్న రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు తమ పార్టీకి భారీ మెజారిటీని అందిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

### వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

దేశంలోని మొట్టమొదటి వందేభారత్ స్లీపర్ రైలును శనివారం ప్రధాని మోదీ ప్రారంభించారు. హౌరా నుంచి గౌహతి వరకు ఆ రైలు వెళ్తుంది. బెంగాల్‌లోని మాల్దా రైల్వే స్టేషన్ నుంచి ప్రధాని ఆ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఇక గౌహతి నుంచి హౌరా వచ్చే వందేభారత్ స్లిపర్ రైలును ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. రైలులో చిన్నారులు, స్కూల్ స్టూడెంట్స్‌తో మోదీ ఇంటెరాక్ట్ అయ్యారు. ఎసి వందేభారత్ స్లీపర్ రైలుతో.. తక్కువ ధరకే విమాన ప్రయాణం లాంటి ప్రయాణాన్ని కల్పిస్తున్నట్లు పిఎంఒ ఓ ప్రకటనలో తెలిపింది. సుదీర్ఘ దూరాలను చాలా వేగంగా, సురక్షితంగా చేరుకునేలా చేస్తుందని, దీని ద్వారా పర్యాటకం పెరుగుతుందని ఆ ప్రకటనలో తెలిపారు. వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభించిన తర్వాత మోదీ ఓ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వందేభారత్ రైలు.. మేడిన్ ఇండియా అని, భారతీయులు తమ చెమటోడ్చి ఈ రైలును నిర్మించినట్లు చెప్పారు. పవిత్రమైన బెంగాల్ నేల నుంచి భారతీయ రైల్వేల ఆధునీకరణకు మరోఅడుగు పడిందని, దేశంలో నేడు వందేభారత్ స్లిపర్ రైళ్లను ప్రారంభిస్తున్నామన్నారు.

# జల్‌జీవన్ మిషన్‌కు ప్రాధాన్యం

కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న పార్లమెంటుకు సమర్పించనున్న 2026–27 సంవత్సర వార్షిక బడ్జెట్‌లో గ్రామీణ ప్రజలకు కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకుగాను అమలులో ఉన్న జల్‌జీవన్ మిషన్(జెఎల్‌ఎం) పథకానికి నిధులు తగ్గించబోతున్నట్లు వచ్చిన వార్తలు అశుభసూచకం. 2025–26 బడ్జెట్‌లో కేటాయింపు చేసిన రూ.67వేల కోట్లను కొత్త బడ్జెట్‌లో రూ.17వేల కోట్లకు తగ్గిస్తారన్నది ఆ వార్త.

నీరు ప్రాణరక్షణ సెలయేరు. పరిశుభ్రమైన నీరు లభ్యం చేయటం ప్రభుత్వ విధి. స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాలకుగాని ఆ ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించలేదు. అది పేదలకు కుళాయి నీరు అందిస్తుంది కాబట్టి సంస్కృతి స్థాయిని చాటుతుంది. మొత్తం మానవాళి జీవన నాణ్యత స్థాయి గుర్తు జాగురూకత పెంచుతుంది. గడచిన కాలంలో పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా అనేక పెద్ద గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు అమలులో ఉన్నాయి. అయితే ప్రజలందరికీ పరిశుభ్రమైన తాగునీరు కుళాయిల ద్వారా ప్రతి ఇంటికీ సరఫరా చేయటం ధ్యేయంగా కేంద్రప్రభుత్వం 2019 ఆగస్టు 15న 'జల్ జీవన్ మిషన్'ను కేంద్ర ప్రాయోజిత పథకంగా ప్రారంభించింది. 2024నాటికి 100శాతం కవరేజి సాధించాలని లక్ష్య ప్రకటన జరిగింది. 2025–26 బడ్జెట్‌లో దీన్ని 2028డిసెంబర్ వరకు పొడిగించారు. 2019లో ఈ మిషన్‌ను ప్రారంభించినపుడు దేశంలో 3.23కోట్ల గృహాలకు రక్షిత నీటి సరఫరా ఉండగా, 2026 ప్రారంభం నాటికి 15.77 కోట్ల(81.49శాతం) గ్రామీణ గృహాలకు పైపుల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతున్నట్లు చెప్పబడుతున్నది. 11రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 100 శాతం కుళాయి నీటి సరఫరా కిందకు వచ్చాయి. అవి – గోవా, హర్యానా, తెలంగాణ, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు; కేంద్ర పాలిత ప్రాంతాలు – అండమాన్–నికోబార్ దీవులు, దాద్రా అండ్ నాగర్ హవేలీ, డామన్–డయ్యూ, పుదుచ్చేరి. తెలంగాణ, గుజరాత్, పంజాబ్ మినహా మిగతావన్నీ చాలా తక్కువ జనాభా కలిగిన ప్రాంతాలు. కాబట్టి అత్యధిక రాష్ట్రాల్లో ఈ పని పురోగతిలో ఉన్నట్లు లేదా అసంపూర్తిగా నిలిచిపోయినట్లు భావించాలి. కాబట్టి ఈ పథకాన్ని వేగవంతంగా అమలు చేయాల్సిన ఆవశ్యకత మిగిలే ఉంది. 2028 వరకు పొడిగించబడిన ఈ పథకం కింద దీర్ఘకాలికంగా నీటి భద్రత కలిగించే కార్యక్రమాలు తలపెట్టారు.

> అన్ని రాష్ట్రాల్లోని గ్రామీణ గృహాలను ఈ పథకం కిందకు తేవటంతోపాటు సరఫరా అవుతున్న నీటి పరీక్షలు ఆ నీటి సరఫరా మూలం వద్దనే నిర్వహించటం తప్పనిసరి అవసరం. లేనట్లయితే ఇటీవల ఇండోర్ మహానగరం శివారుల్లో సంభవించినట్లు అతిసార వ్యాధితో డజన్‌కొద్దీ మరణాలు సంభవించక మానవు.

సార్వజనీన కవరేజ్ సాధించినపుడు సాలీనా 4లక్షల అతిసార వ్యాధి కేసులు నివారించబడతాయని, మహిళలు ఇప్పుడు నీరు తెచ్చుకోవటానికి వెచ్చిస్తున్న సమయంలో సాలీనా 5.5 కోట్ల గంటలు ఆదా అవుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా. రక్షిత తాగునీటివల్ల అనేక సంక్రమిక ఉదర కోశ వ్యాధులు నివారించబడతాయి. కాబట్టి అన్ని రాష్ట్రాల్లోని గ్రామీణ గృహాలను ఈ పథకం కిందకు తేవటంతోపాటు సరఫరా అవుతున్న నీటి పరీక్షలు ఆ నీటి సరఫరా మూలం వద్దనే నిర్వహించటం తప్పనిసరి అవసరం. లేనట్లయితే ఇటీవల ఇండోర్ మహానగరం శివారుల్లో సంభవించినట్లు అతిసార వ్యాధితో డజన్‌కొద్దీ మరణాలు సంభవించక మానవు. మధ్యప్రదేశ్‌లో సరఫరా అవుతున్న తాగునీటిలో 36.7శాతం సురక్షితం కాదని 2026 జనవరి 4న జల్ జీవన్ మిషన్ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. మరీ చిత్రమే కాదు, నిర్లక్ష్యానికి పరాకాష్ట ఏమంటే, ఆరోగ్య సంరక్షణ కలుగజేయాల్సిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో నీటి శాంపిల్స్‌లో 12 శాతం మాత్రమే రోగకారక సూక్ష్మ జీవుల నుంచి రక్షణ పరీక్షల్లో సఫలమైనాయి. రాష్ట్రంలోని ఆసుపత్రుల్లో 88 శాతం రోగులకు అరక్షిత తాగునీరు అందిస్తున్నాయి. ఇటువంటి దుస్థితివల్లనే ఎంపిలోనే కాదు, దేశమంతటా ప్రైవేటు తాగునీటి సరఫరా వర్ధిల్లుతున్నది. ఇండోర్ జిల్లాలో 100 శాతం పంపు కనెక్షన్లు ఇచ్చినట్లు ప్రకటించారు. కాని 33శాతం ఇళ్లకే తాగునీరు సరఫరా అవుతోంది. ఇటువంటి పరిస్థితులు ఇండోర్‌కే పరిమితం అనుకుంటే పొరపాటే. ఈ నిర్లక్ష్యం అన్ని చోట్ల ఉంటోంది. అందువల్ల జల్‌జీవన్ మిషన్‌కు నిధులు కోతపెట్టకుండా 100 శాతం కవరేజి పూర్తి చేయటం, వాటి సక్రమ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చేయూత కొనసాగించటం అవసరం. కలుషిత తాగునీరు సరఫరా చేస్తూ భారతదేశం వికసించిందని గొప్పలకు పోతే నవ్వులపాలు అవుతాము.




## 'దేశ విభజన'పై అవగాహన అవసరం

దేశ చరిత్ర, ముఖ్యంగా దేశ విభజనకు దారితీసిన పరిస్థితులు నేటితరం తప్పనిసరిగా అర్థం చేసుకోవాలి. దేశ విభజన జరగడం తప్పు. భవిష్యత్తులో అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోవాలి. దేశ విభజన కారణంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్ వలస వెళ్లినవారి బాధలను ఈ భూమి, మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఊరికే రాలేదన్న విషయాన్ని ఇప్పటి పిల్లలు అర్థం చేసుకోవాలి. దేశ విభజన ఎన్ని తరాలపై ప్రభావం చూపిందో 'ది మ్యాజిక్ ఆఫ్ ది లాస్ట్ ఇయర్‌రింగ్స్' పుస్తకాన్ని యువతరం చదివి తెలుసుకోవాలి.

- రాజ్యసభ ఎంపి. సుధామూర్తి




## సెర్చ్ చేసినందుకు అరెస్టు!



ఫ్రాన్స్‌లో 13 ఏళ్ల ఓ విద్యార్థి చాట్‌జిపిటి లో సెర్చ్ చేసినందుకు పోలీసులు అరెస్టు చేశారు. స్నేహితుడిని హత్య చేయడం ఎలా చాట్‌జిపిటిని ఆ బాలుడు ప్రశ్నించిన వైనం అంతర్జాతీయ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. ఈ ఘటనపై అధికార వర్గాలు, సాంకేతిక నిపుణులు, తల్లిదండ్రుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పోలీసు నివేదిక ప్రకారం, ఆ విద్యార్థి తన క్లాస్‌మేట్‌తో జరిగిన చిన్న విభేదం అనంతరం చాట్‌జిపిటిలో హత్యా పద్ధతులు, ప్రతీకారం తీర్చుకునే మార్గాలు వంటి విషయాలపై విచారణ చేశాడు. చాట్‌బాట్ ద్వారా వచ్చిన సమాధానాల్లో కొన్నింటిని అతను రికార్డు చేయడమేగాక, ఆన్‌లైన్‌లో షేర్ చేయడానికి కూడా ప్రయత్నించినట్లు చెబుతున్నారు. పాఠశాల అధికారులు ఈ విషయం గమనించి, సంబంధిత సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందజేశారు. అనంతరం బాలుడిని మానసిక పరిశీలన కోసం నిపుణుల పర్యవేక్షణలోకి తీసుకున్నారు. ఫ్రాన్స్‌లోని సైబర్ సెక్యూరిటీ, బాలల రక్షణ సంస్థలు ఈ ఘటనను కృత్రిమ మేధస్సు (ఎఐ) పర్యవేక్షణలో ఉన్న ప్రమాదాలకు స్పష్టమైన ఉదాహరణగా పేర్కొంటున్నాయి. ఇంటర్నెట్ వనరులు, ముఖ్యంగా జెనరేటివ్ ఎఐ వ్యవస్థలు, సురక్షిత పరిమితులు లేకుండా వాడినప్పుడు పిల్లల మానసిక స్థితిపై ప్రమాదకర ప్రభావం చూపుతాయని స్పష్టం చేస్తున్నాయి. కాగా, ఈ సంఘటనతో ఎఐ సేఫ్టీ, కంటెంట్ ఫిల్టరింగ్, పేరెంటల్ మానిటరింగ్‌పై అంతర్జాతీయంగా చర్చ మళ్లీ జోరందుకుంది. సైబర్ మనోవిజ్ఞాన నిపుణులు ప్రకారం, చిన్నారులు ఇంకా భావోద్వేగ పరిపక్వత సాధించని వయసులో ఉండటం వలన, ఎఐ ఇచ్చే సమాచారాన్ని సక్రమంగా అర్థం చేసుకోలేరని అంటున్నారు. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలి అని సూచిస్తున్నారు.

## భీకరమైన పేలుడు..



ఇప్పటి వరకూ నమోదైన అత్యంత శక్తివంతమైన పేలుళ్లలో క్రాకటోవా అగ్నిపర్వత పేలుడును పేర్కొంటారు. 1883 ఆగస్టు 27న ఇండోనేషియాలో జావా మరియు సుమత్రా ద్వీపాల మధ్య ఉన్న ఈ అగ్నిపర్వతం భయంకరమైన శబ్దంతో పేలిపోయింది. ఆ విస్ఫోటనం సుమారు 3000 మైళ్లు (4828 కిలోమీటర్లు) దూరంలోని ఆస్ట్రేలియా, రొడ్రిగ్స్ ద్వీపాల్లో కూడా వినిపించిందని చారిత్రక రికార్డులు చెబుతున్నాయి. 100 మైళ్ల దూరంలో ప్రయాణిస్తున్న సముద్రయాత్రికుల చెవి పొరలు పేలిపోయాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ శబ్దమే ఇంత భయానకంగా ఉంటే, అగ్నిపర్వతం నుంచి విడుదలైన గాలి ఒత్తిడి తరంగం మరింత శక్తితో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వాతావరణ పీడన మాపక పరికరాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ అదృశ్య తరంగం భూమిని ఐదు రోజుల్లో ఏకంగా ఏడుసార్లు చుట్టింది. ఆ క్రమంలోనే సునామీ ఏర్పడింది. విస్ఫోటనంతో సముద్రంలో అపార నీటి పొరలు చలించాయి. 130 అడుగుల ఎత్తయిన అలలుగా జావా, సుమత్రా తీరాలపై విరుచుకుపడ్డాయి. చాలా గ్రామాలు, పట్టణాలు పూర్తిగా ధ్వంసమై, సముద్రంలో కలిసిపోయాయి. ఈ సునామీ తరంగాల వల్లే 36,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని అంచనా.

— బిఎస్ఎస్ మైత్రేయి

# వెనిజులా; నియంతృత్వ అధికారకేంద్ర రాజకీయాల పునరాగమనం



డి.రాజా
ప్రధాన కార్యదర్శి
భారత కమ్యూనిస్టు పార్టీ

2026 సంవత్సరం ప్రపంచ భవిష్యత్తుకు ప్రమాదకరమైన హెచ్చరికతో ఆరంభమైంది. ఇది సామ్రాజ్యవాదం రక్తంతో తడిసిన కోరలను చాస్తుంది. వెనిజులాపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా భయంకరమైన దాడిని నిర్వహించింది. ప్రస్తుత వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను బలవంతంగా బంధించి, విచారణ కోసం అమెరికాకు పట్టుకెళ్లింది. ఇది ఒక ప్రభుత్వేతర శక్తిపై రహస్య ఆపరేషన్ కాదు లేదా అంతర్జాతీయ సంస్థలు ఆమోదించిన బహుపాక్షిక చర్య కాదు. ఇది ఒక సార్వభౌమ దేశ అధిపతి అపహరణ. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తీవ్ర విమర్శలు ఎదురైనప్పటికీ ఇలాంటి చర్యను వాషింగ్టన్ బహిరంగంగా సమర్థించగలగడమంటే ఒకప్పుడు దేశాల అంతర్జాతీయ ప్రవర్తనను నియంత్రించిన నిబంధనల క్షీణతను ఇది తెలియజేస్తుంది.

ఇది జరుగుతున్న సమయంలోనే రష్యన్ చమురును దిగుమతి చేసుకోవడం కొనసాగించినందుకు భారతదేశంపై కొత్త సుంకాలు విధిస్తామని బెదిరించడం, దానికి కొనసాగింపుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తనను సంతోషంగా ఉంచేందుకు ఆసక్తిగా ఉన్నారని ట్రంప్ బహిరంగంగానే పేర్కొనడం జరిగింది. బెదిరింపులను సాధనాలుగా సుంకాలను ఉపయోగించడం విస్తృత బెదిరింపు నమూనాను బలోపేతం చేస్తుంది. ఆర్థిక ఒత్తిడి, దౌత్యపరంగా బలవంతపు ఒత్తిడి చేయడం, సార్వభౌమత్వాన్ని బహిరంగంగా ఉల్లంఘించడం సాధారణీకరించబడుతున్నాయి. భారతదేశంతో సహా అభివృద్ధి చెందుతున్న శక్తుల నిశ్శబ్దం లేదా పలాయనవాదం మరింత ఆందోళనకరమైన విషయం. ఈ నిశ్శబ్దం బలం లేదా వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని సూచించదు. కానీ దేశాల మధ్య సమానత్వాన్ని నిలబెట్టడంలో, బహుళ ధ్రువ ప్రపంచం వాస్తవికతను ప్రతిబింబించడంలో ప్రస్తుత ప్రపంచ వ్యవస్థ తీవ్ర వైఫల్యాన్ని సూచిస్తుంది.

ఈ క్షణం తీవ్రతను గ్రహించడానికి, రెండవ ప్రపంచ యుద్ధానంతర అంతర్జాతీయ వ్యవస్థ ఉద్భవించిన చారిత్రక సందర్భాన్ని పునశ్చరణ చేయాలి. నాజీయిజం, హిట్లర్ ఓటమి కేవలం సైనిక విజయం కాదు. ఇది ఒక నాగరికత మలుపు. ముఖ్యంగా సోవియట్ ఎర్ర సైన్యం చేసిన అపారమైన త్యాగాలు మానవాళిని ఫాసిస్ట్ వినాశనం నుండి కాపాడాయి. అటువంటి విపత్తులు పునరావృతం కాకుండా నిరోధించే ప్రపంచ వ్యవస్థను నిర్మించడానికి ఒక మార్గాన్ని సృష్టించాయి. ఈ సంకల్పం నుండి ఐక్యరాజ్య సమితి వ్యవస్థ ఉద్భవించింది. దానిలో నిర్మాణాత్మక లోపాలు, అధికార అసమానతలు ఉన్నప్పటికీ, అది సార్వభౌమత్వ సమానత్వం, దురాక్రమణ చేయకపోవడం, ముఖ్యంగా వలస పాలన నుండి బయటకువస్తున్న ప్రజల స్వయం నిర్ణయాధికారం పట్ల గౌరవం అనే ప్రధాన సూత్రాలపై ఆధారపడింది.

అనేక దశాబ్దాలపాటు, ప్రపంచ నిరంకుశత్వం, ఏకపక్ష దురాక్రమణలు ప్రతిఘటన శక్తులచే నిరోధించబడ్డాయి. అమెరికా, దాని మిత్రదేశాల విశృంఖల విస్తరణకు సోవియట్ యూనియన్ అడ్డుకట్ట వేసింది. భారతదేశం, ఇండోనేషియా, ఈజిప్ట్, యుగోస్లోవియా వంటి నూతన స్వతంత్ర దేశాల నేతృత్వంలోని అలీనోద్యమం గతంలో వలసరాజ్యాల ప్రపంచానికి చెందిన రాజకీయ ప్రతినిధిగా నిలదొక్కుకుంది. సైద్ధాంతిక పోటీ, బహుళ పక్ష ఒడంబడికల కలయిక సామ్రాజ్యవాద అతిక్రమణకు పరిమితులు విధించింది. తీవ్ర ఉద్రిక్తత సమయాల్లో కూడా దౌత్యం, సమతుల్యత కొనసాగాయి. సంయమనం, చర్చలు ప్రపంచ విపత్తును ఎలా నివారించాయో చెప్పడానికి క్యూబన్ క్షిపణి సంక్షోభం ఒక ఉదాహరణగా మిగిలిపోయింది.

చరిత్ర మరిన్ని ఉదాహరణలను అందిస్తుంది. 1971 బంగ్లాదేశ్ విముక్తి యుద్ధంలో అమెరికా ఆంక్షల బెదిరింపులు, ఏడవ నౌకాదళం మోహరింపు ద్వారా భారతదేశాన్ని బెదిరించడానికి ప్రయత్నించినప్పుడు, భారత్‌కు సోవియట్ మద్దతు నిర్ణయాత్మకమైనదిగా నిరూపించబడింది. ఆ మద్దతు భారతదేశ సార్వభౌమత్వాన్ని కాపాడటమే కాకుండా, బంగ్లాదేశ్ ఆవిర్భావానికి కూడా దోహదపడింది. అతి తీవ్రమైన అణచివేతకు గురైన బెంగాలీ మాట్లాడే ప్రజల ప్రజాస్వామ్య ఆకాంక్షలకు నిర్దిష్ట వ్యక్తీకరణను కల్పించింది. అదేవిధంగా, అమెరికాకు ఎదురైన వియత్నాం ప్రతిఘటన గొప్ప సైనిక శక్తిని ఓడించడానికి దృఢనిశ్చయం కలిగిన ప్రజల సామర్థ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. కార్పెట్ బాంబు దాడి, రసాయన యుద్ధం, అపారమైన విధ్వంసం జరిగినప్పటికీ, వియత్నాం విజయం సాధించింది. ఈ సంఘటనలు యాదృచ్ఛిక చరిత్రలు కావు. అవి జాతీయ విముక్తి చట్టబద్ధతను, అధికార పరిమితులను గుర్తించిన ప్రపంచ సమతుల్యత ఫలితాలు.

ప్రస్తుత సంక్షోభం మూలాలు ఆ సమతుల్యతను అర్ధాంతరంగా ముగించటంలో ఉన్నాయి. సోవియట్ యూనియన్ రద్దు ఏకధృవ ప్రపంచ క్రమంగా చెప్పబడుతున్న విధానానికి నాంది పలికింది. ప్రపంచవ్యాప్తంగా నయా ఉదారవాద ఆర్థిక విధాన ఛాందసాన్ని విధించేందుకు ఆ సందర్భం వెనువెంటనే ఉపయోగించబడింది. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి ఒత్తిడితో అనేక దేశాలు ప్రభుత్వ రంగాలను కూల్చివేసి, కార్మిక రక్షణలను బలహీనపరిచి, తమ ఆర్థిక వ్యవస్థలను ఊహాజనిత మూలధనానికి తలుపులు తెరవవలసి వచ్చింది. వృద్ధి, శ్రేయస్సు అనేది వాగ్దానం. నిరంతర నిరుద్యోగం, పెరుగుతున్న అసమానత, దీర్ఘకాలిక రుణం, పర్యావరణ వినాశనం అనేది వాస్తవం.

ప్రపంచ జనాభాలో మెజారిటీ జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో నయా ఉదారవాదం పదేపదే విఫలమైంది. ఇది ఆర్థిక విధానంపై ప్రజాస్వామ్య నియంత్రణను క్షీణింపజేస్తూనే అపూర్వమైన స్థాయిలో సంపదను కేంద్రీకరించింది. అయినప్పటికీ, భారతదేశం సహా అనేక ప్రధాన ఆర్థిక వ్యవస్థలు ఈ అపఖ్యాతి పాలైన చట్రంపై ఆధారపడటాన్ని కొనసాగించాయి. నిరుద్యోగం, వ్యవసాయ రంగ కష్టాలు, ఆకలి, కుంచించుకుపోతున్న సామాజిక భద్రత వంటి స్థానిక పరిణామాలు కనిపిస్తాయి. ప్రపంచ పరిణామాలు కూడా అంతే తీవ్రంగా ఉంటాయి. ఆర్థిక ఆధారత రాజకీయ దుర్బలత్వాన్ని పెంచుతుంది. అభివృద్ధి అనేది విదేశీ మూలధన ప్రవాహాలు, విదేశీ మార్కెట్లతో ముడిపడి ఉన్నప్పుడు విదేశాంగ విధాన స్వయంప్రతిపత్తి రాజీపడుతుంది. బెదిరింపుల ఎదుట మౌనం అనేది మనుగడకు ఎత్తుగడగా మారుతుంది. ఇలా ఆధారపడటం, వెనిజులాలో అమెరికా చర్యలకు అనేక దేశాల మౌన ప్రతిస్పందనను వివరించటానికి సహాయపడుతుంది. దేశాధినేతను అక్రమంగా బందీగా తీసుకెళ్లటం, మొత్తం ప్రాంతాలను 'ప్రత్యేక ప్రభావ రంగాలు' గా పరిగణించే సిద్ధాంతాల పునరుద్ధరణ విస్తృత ఖండనకు దారితీయాలి. అందుకు భిన్నంగా సంకోచం తలెత్తింది. ఇది కేవలం నైతిక వైఫల్యం కాదు. ఇది నిర్మాణాత్మకమైనది. నయా ఉదారవాద ఆర్థిక శాస్త్రం ఆధిపత్యం చెలాయించే ప్రపంచ వ్యవస్థ అభద్రత, భయాన్ని ఉత్పత్తి చేస్తుంది. ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించినప్పుడు కూడా స్వతంత్ర వైఖరులను నిరుత్సాహపరుస్తుంది.

గత కొన్ని దశాబ్దాలుగా అమెరికా జోక్యాల చరిత్ర ప్రజాస్వామ్యాన్ని లేదా ప్రపంచ స్థిరత్వాన్ని కాపాడటం అనే దాని వాదనల డొల్లతనాన్ని మరింత నొక్కి చెబుతున్నది. కల్పిత సాకులతో ఇరాక్ నాశనం చేయబడింది. అఫ్ఘానిస్తాన్ రెండు దశాబ్దాలుగా ఆక్రమించబడి గందరగోళంలో వదిలివేయబడింది. సిరియా పరోక్ష యుద్ధాలు, ఆంక్షల మధ్య నలిగిపోయింది. ఇది పౌర జీవితాన్ని నాశనం చేసింది. ఈ జోక్యాలు చట్టవిరుద్ధమైనవి, వినాశకరమైనవి, నిరర్థకమైనవి. అవి శాంతిని లేదా ప్రజాస్వామ్యాన్ని తీసుకురాలేదు. అయితే, అధికారం చట్టాన్ని అతిక్రమిస్తున్న ఒక ఉదాహరణను బలోపేతం చేశాయి. వెనిజులాలో జరిగిన సంఘటన ప్రమాదకరమైన విస్తరణను సూచిస్తుంది. ఆధిపత్యరాజ్యం ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్నప్పుడు ఒక దేశాధినేతకు లభించే అధికారిక రక్షణను సైతం విడనాడతారని ఇది సూచిస్తుంది. సుంకాలు, ఆంక్షల ద్వారా ఆర్థికంగా బెదిరింపులతో కలిపి, సార్వభౌమ సమానత్వ సూత్రంపై ప్రత్యక్ష దాడిని ఇది సూచిస్తుంది. అదుపు చేయకుండా వదిలేస్తే, ఏ దేశం కూడా పరిమాణం లేదా ప్రతిపత్తితో సంబంధం లేకుండా తాను సురక్షితంగా ఉన్నట్లు పరిగణించలేని ఉదాహరణను ఇది నెలకొల్పింది.

ప్రతిస్పందన పైపై మెరుగుల మాదిరిగా ఉండకూడదు. దేశీయ, అంతర్జాతీయ చట్రాల సమగ్ర ప్రక్షాళన అవసరం. ప్రపంచ స్థాయిలో, సమకాలీన వాస్తవాలను ప్రతిబింబించేలా సంస్థలను పునర్నిర్మించాలి. 1945 నాటి భౌగోళిక రాజకీయాలలో స్తంభించిపోయిన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ఇకపై ఉనికిలో ఉన్నట్లుగా ప్రపంచానికి ప్రాతినిధ్యం వహించదు. అభివృద్ధి చెందుతున్న దేశాలు, భారతదేశం, ఆఫ్రికా, లాటిన్ అమెరికా నుండి అర్థవంతమైన ప్రాతినిధ్యం చేర్చడానికి శాశ్వత సభ్యత్వాన్ని విస్తరించాలి. అటువంటి సంస్కరణలు లేనంతవరకు, ఐక్యరాజ్య సమితి ఏకపక్ష దురాక్రమణ నేపథ్యంలో స్తంభించిపోతుంది లేదా వత్తాసుదారుగా ఉంటుంది. దక్షిణ–దక్షిణ సహకారాన్ని బలోపేతం చేయడం కూడా అంతే ముఖ్యం. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు ఆధిపత్య శక్తులపై ఆధారపడటాన్ని తగ్గించే సంఘీభావాన్ని ఏర్పరచుకోవాలి. వాణిజ్యం, సాంకేతికత, ఇంధన, ఆర్థిక రంగాలలో సహకారం బలవంతపు ఏర్పాట్లకు ప్రత్యామ్నాయాలను అందిస్తుంది. నియమాల ఆధారిత ప్రపంచ వ్యవస్థకు నిజమైన నిబద్ధతకు వాక్చాతుర్య ఆమోదం కాదు, అంతర్జాతీయ చట్టాన్ని రక్షించడానికి సమిష్టి చర్య అవసరం.

జాతీయ స్థాయిలో భారతదేశం వంటి దేశాలు ఆర్థిక, విదేశాంగ విధాన ఎంపికలను పునరాలోచించాలి. వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి అనేది ఆర్థిక దాస్యంతో కలిసి ఉండకూడదు. జీవనోపాధులు రక్షించడం, ప్రభుత్వ రంగాలను బలోపేతం చేయడం, సమగ్ర అభివృద్ధిని అనుసరించడం అంతర్ముఖంగా చూసే విధానాలు కావు. అవి స్వతంత్ర దౌత్యానికి ముందస్తు అవసరాలు. స్వదేశంలో నిరుద్యోగం, అసమానతలతో అవస్థపడుతున్న దేశం విదేశాలలో ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించజాలదు.

మనం చూస్తున్న సంక్షోభం అనివార్యం కాదు. అది దశాబ్దాలుగా ఎంచుకున్న విధానాల ఫలితం. రాజకీయ సంకల్పం, అంతర్జాతీయ సంఘీభావం, న్యాయం, సమానత్వం పట్ల పునరుద్ధరించబడిన నిబద్ధత ద్వారా దీనిని తిప్పికొట్టవచ్చు. ప్రత్యామ్నాయం కఠినమైనది. వేధింపులు, అపహరణలు, సుంకాల బెదిరింపులచే పాలించబడుతున్న ప్రపంచం.. అరాచకం వైపు జారిపోతున్న ప్రపంచం లాంటిది. అటువంటి ఆదేశాలు ఎక్కువకాలం నిలబడవని చరిత్ర మనకు బోధిస్తుంది. అవి వాటి స్వంత వైరుధ్యాల బరువుతో కూలిపోతాయి. అవి పోతూపోతూ తరచుగా అపారమైన మానవ బాధలను వదిలివెళతాయి.

మానవాళి ముందున్న అవకాశం చాలా కఠినమైనది. ప్రపంచం సార్వభౌమాధికార సూత్రాలు, స్వయం నిర్ణయాధికారం, సమష్టి భద్రతలను తిరిగి పొందాలి, లేనట్లయితే పాలకుడు మాత్రమే మంచిని, తప్పును నిర్ణయించే అరాచక వ్యవస్థకు అది లొంగిపోతుంది. అన్యాయం ఎదురైనప్పుడు మౌనం తటస్థత కాదు. అది సహకారానికి సంకేతం. ఒకప్పుడు వలసవాదానికి, ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడిన దేశాలకు, ఆ నిశ్శబ్దాన్ని ఛేదించుకోవటం ఐచ్ఛికం కాదు, చారిత్రక బాధ్యత.

# క్యూబా విఫలదేశమా? అమెరికా కుతంత్రమా?

క్యూబా ఒక విఫల వ్యవస్థ..కుప్పకూలి పోవడానికి సిద్ధంగా ఉంది అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. ఆయన చెప్పినంతమాత్రాన నిజమైపోతుందా? మరి వాస్తవాలు, క్యూబా సాధించిన విజయాల మాటేమిటి? అనేక దశాబ్దాలుగా క్యూబాను ఒక విఫలదేశంగా మార్చడానికి అమెరికా కుట్రలు చేస్తోంది. ఆ కుట్రలను తట్టుకుని ఎదురొడ్డి పోరాటం చేస్తున్న క్యూబా గురించి సామ్రాజ్యవాద పత్రికలు ఎందుకు ప్రచారం చేయడంలేదనేదే ఇప్పుడు ముఖ్యం. క్యూబాను దురాక్రమణ చేసేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను ప్రధానంగా తీసుకుని రచయిత అస్కార్ శాంఛెజ్ సెర్రా రాసిన ఈ క్రింది వ్యాసాన్ని క్యూబా కమ్యూనిస్టుపార్టీ అధికార పత్రిక గ్రాన్మా ప్రచురించింది.

''విఫలమైన ఒక వ్యవస్థ ప్రపంచానికి ప్రామాణికంగా ఉండే విద్యావ్యవస్థను కలిగి ఉండగలదా? ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రజారోగ్య వ్యవస్థను, క్యూబా ప్రజలకు, వారి శ్రేయస్సుకు హామీ ఇచ్చే ఆరోగ్య వ్యవస్థను ఒక విఫల వ్యవస్థ అందించగలదా? అటువంటి విఫల వ్యవస్థ కొవిడ్ –19 మహమ్మారిని తట్టుకుని నిలబడగలదా? దానిని ఎదుర్కొనేందుకు సకాలంలో ఒక రికార్డు సమయంలో ప్రజలకు వ్యాక్సిన్‌ను సమకూర్చగలదా? ఒక విఫలమైన వ్యవస్థ ఖచ్చితమైన, శాస్త్రీయమైన, అత్యున్నతమైన ప్రామాణికతలతో నవ ఆవిష్కరణల పనివిధానం ద్వారా అగ్రభాగాన నిలబడి ప్రపంచ ప్రజల ప్రాణాలు కాపాడటంలో ముందంజలో ఉండగలదా? అలాంటి విఫల వ్యవస్థ తన కళలలో అసాధారణమైన అపూర్వ ప్రతినిధిగా మనగలగుతుందా?

మనం క్యూబా సంగీతం గురించి మాట్లాడుతున్నాం, ''నేషనల్ బ్యాలే ఆఫ్ క్యూబా'' అనే ఒక అత్యుత్తమైన నృత్య సంస్థ గురించి మాట్లాడుతున్నాం, లేదంటే క్యూబా అంతర్జాతీయ మేధో ఆలోచనలను ప్రస్ఫుటింపజేసేందుకు సారథ్యం వహించిన కవుల గురించి, రచయితల గురించి మాట్లాడుతున్నాం, మరి ఒక విఫలమైన వ్యవస్థ ప్రపంచ ఒలింపిక్స్‌లో 15 కంటే ఎక్కువ టైటిల్స్‌తో ఒక క్రీడాశక్తి కేంద్రంగా ఉండగలదా?

ఏదైనా ఒక విఫలదేశంగా ఉండటం ఒక విషయమైతే, ఆ దేశం ఆర్థికంగా, సామాజికంగా విఫలమైపోవాలని కోరుకోవడం మరో విషయం. ప్రపంచ మానవాళి చరిత్రలో ఒక మహాశక్తిమంతమైన దేశం ఒక చిన్న దేశాన్ని విఫలవ్యవస్థగా మార్చడానికి సర్వశక్తులూ ఒడ్డింది, 1.10 లక్షల చదరపు విస్తీర్ణంగల భూభాగంలో దాదాపు ఒక కోటి (10 మిలియన్లు) నివాసాలు ఉన్న ఒక ద్వీపదేశాన్ని ఆర్థికంగా విఫలం చేయడానికి ఆ మహా శక్తిమంతమైన దేశం చేయగలిగిందంతా చేసింది. 9, 867,675 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల భూభాగంలో 34 కోట్లమంది జనాభాతో ఆ దేశం (అమెరికా) కూర్చుని ఆ చిన్న దేశాన్ని విఫలం చేసేందుకు ప్రయత్నించింది. పైగా ప్రపంచ వ్యాప్తంగా ఆ దేశ కరెన్సీ విస్తరించి ఉంది. మరి అలాంటి ఆర్థికశక్తి ఇంత వైఫల్యం పొందినందుకు సిగ్గుపడాలి.

ఆ చిన్న దేశాన్ని విఫలం చేయడానికి, అలాంటి ముద్ర వేయడంకోసం అదే దేశం 1961లో ప్లాయా గిరోన్ (క్యూబాలో అత్యంత సారవంతమైన మాగాణీనేల ప్రాంతం)పైన, ఆ తర్వాత ''ఆపరేషన్ ముంగూస్'' నిర్వహించింది. మొత్తం 32 లక్ష్యాలు నిర్దేశించుకుని ఈ యుద్ధం చేసింది. వీటిల్లో 13 ఆర్థికలక్ష్యాలు, ఆరు రాజకీయ లక్ష్యాలు, ఐదు సైనిక లక్ష్యాలు, నాలుగు గూఢచారి నిఘా లక్ష్యాలు, మరో నాలుగు మానసిక యుద్ధ లక్ష్యాలు ఉన్నాయి. ఇందులో ఒక రసాయన సంబంధమైన యుద్ధ లక్ష్యం కూడా ఉంది. చెరకు పంటను కోసే కార్మికుల కంటి చూపును దెబ్బతీసి, క్యూబా చెరకు పంట దిగుబడులను నాశనం చేసేందుకు రసాయనంతో చేసే యుద్ధం ఈ లక్ష్యాలలో ఒకటి. ప్రమాదకరమైన బాక్టీరియాలను కూడా ప్రయోగించేందుకు కూడా అది సిద్ధపడింది. 1978లో చెరకు పంటకు సోకి నాశనం చేసే కేన్ రస్ట్ అనే ఫంగల్ వ్యాధి బాక్టీరియాను కూడా ప్రయోగించింది. 1971–1980 మధ్యకాలంలో ఆఫ్రికా స్వైన్ ఫీవర్ బాక్టీరియాను ప్రయోగించింది. 1980వ దశకంలో పొగాకు పంటను నాశనం చేసేందుకు పెన్సిలియం ఎక్స్పాన్‌సమ్‌అనే నీలం బూజు వ్యాధిసోకే ఫంగస్ బాక్టీరియాను, మనుషులకు సోకే అత్యంత ప్రమాదకరమైన హెమరేజిక్ డెంగ్యూను ప్రయోగించింది.1981లో హెమరేజిక్ కండ్లకలకను ప్రవేశపెట్టింది. ఈనాడు అదే దేశం చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన, జాతి విధ్వంసకమైన ఆర్థిక,వాణిజ్య, ఆర్థిక దిగ్బంధన ఒత్తిడులను కొనసాగిస్తోంది. పరిపాలన వ్యవస్థ ద్వారా ప్రస్తుతం ఇది తీవ్రరూపం దాల్చింది. ఇందులో భాగంగా క్యూబా ఆర్థిక వ్యవస్థపై ఉన్మాద హింసను కొనసాగిస్తోంది. ఒక చుక్క ఇంధనం కూడా క్యూబా దేశానికి దక్కకుండా చేసే దిగ్బంధన చర్యలున్నాయి. దేశ ఆర్థిక, వాణిజ్యాలకు అపాయం కలిగించేవిధంగా ప్రభుత్వమే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోందనే ఏకపక్ష నకిలీ ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పుడు వీటన్నింటికీ అదనంగా ఈ అన్ని రంగాలపైనా అసత్యాలు, ద్వేషంతో మీడియా యుద్ధం చేస్తోంది. అది ఇప్పుడు మానసిక యుద్ధాన్ని కూడా తీవ్రతరం చేసింది. 2026 జనవరి 3వ తేదీన దేశ అధ్యక్షుణ్ణి, ఆయన భార్యను కిడ్నాప్ చేయడానికి దారితీసిన వెనిజులా దురాక్రమణ చర్య తర్వాత ఒక స్వతంత్ర చక్రవర్తిలాగా ఇక క్యూబా పతనం గురించి మాట్లాడుతున్నారు డోనాల్డ్ ట్రంప్. ''క్యూబాలో ఏం జరుగుతుందో? క్యూబా పతనం కానున్నది, దాని ఆర్థిక వ్యవస్థ శిథిలావస్థకు చేరుకోనున్నది, ఇక దానికి వెనిజులా చమురు అందుబాటులో ఉండదు, ఇక ఆ దేశం తనను తాను ఎలా నిలబెట్టుకోగలదో నాకు తెలియదు..'' అని ట్రంప్ అన్నారు. క్యూబా ఒక విఫల వ్యవస్థగా మిగిలి పోవాలనేది ట్రంప్ కల, అది ఆయన నిశ్చలమైన కోరిక, దీర్ఘకాలంగా అలాంటి ఆలోచనల్లోనే ఉండిపోయిన ట్రంప్ (అమెరికా) విసుగెత్తిపోయారు...ఎందుకంటే క్యూబా ప్రజలు ప్రతిఘటిస్తారు, తమను తాము పునరుజ్జీవింపజేసుకుంటారు, సూర్యుడు ఉదయించిన ప్రతిసారీ క్యూబా ప్రజలు కొత్త శక్తిని సంతరింపజేసుకుంటారు, తమను తాము పునరావిష్కరించుకుంటారు, నవీన ఆలోచనలతో, కొత్త అనుభవాలతో,దృఢమైన పనితీరు,నాణ్యతా ప్రమాణాలతో తమను తాము పుష్పింపజేసుకుంటారు.

కరీబియన్ సముద్రం వెస్టిండీస్‌లో భాగంగా ఉన్న యాంటిల్లిస్‌లో ఆకలి, గందరగోళం, నిరాశలను సృష్టించేందుకు 1960వ దశకం ఆర్థిక యుద్ధ సమయంలో అమెరికా విదేశాంగ మంత్రి లెస్టర్‌మల్లోరీ ఇచ్చిన ఆదేశాల తరహాలో క్యూబాలో కూడా వారు ఇప్పుడు ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికా ప్రయోగించిన నీచాతినీచమైన మాయోపాయాల కారణంగా క్యూబా ఇప్పుడు ఇంధనరంగ క్షీణతతో బాధలు పడుతోంది. ఇంధనం లేకపోవడం క్యూబాలో ఆహార ఉత్పత్తి దగ్గర నుండి పరిశ్రమల పనితీరు వరకూ సామాజిక వ్యవస్థలన్నింటినీ దెబ్బతీస్తోంది. దేశవ్యాప్తంగా అన్ని ఇళ్ళపైనా ఇంధన సరఫరా లోపం తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోంది. కరోనా మహమ్మారి (కొవిడ్–19) సమయంలో కూడా వారు క్యూబా ప్రజలకు ప్రాణాలను కాపాడే మౌలికమైన ఆక్సిజన్‌ను ఇచ్చేందుకు కూడా తిరస్కరించారు. ఐనప్పటికీ కూడా క్యూబా దేశం ఈనాటికి చెక్కు చెదరకుండా నిలబడి తిరిగి ప్రతిఘటన పోరాటం చేస్తోంది. నిజమే..సామ్రాజవాద పాలకులు ప్రతిరోజూ క్యూబా అభివృద్ధిని దోచుకుంటున్నందువల్ల దేశం ఎన్నో కష్టాలు పడుతోంది, దురాక్రమణ పూరిత శత్రుత్వం పాటిస్తూ అపరిమితమైన అధికారం ఉన్నప్పటికీ కూడా క్యూబాను ఒక విఫలదేశంగా అమెరికా మార్చలేకపోయింది.

క్యూబా ధైర్యం పరీక్షలకు గురవుతోంది. అదే దానికి ఇప్పుడు కలుగుతున్న రాజకీయ వేదన. క్యూబా ను ఒక విఫలదేశంగా నిరూపించడానికి ఈ దేశంలో రాజకీయ శూన్యత లేదు. పరిష్కారాలు సాధించడంకోసం అవిశ్రాంతంగా అన్వేషణ చేస్తున్న క్యూబా ప్రజలకు కమ్యూనిస్టుపార్టీ–క్యూబా ప్రభుత్వం కలిసి ఒక శక్తిమంతమైన రక్షణకోటగా నిలబడ్డాయన్న విషయం క్యూబా వ్యతిరేకులకు బాగా తెలుసు. ఇదే వారిని ఇంకా.. ఇంకా..మరింతగా భయపెడుతోంది.

''ఒక విఫలమైన దేశానికి విశ్వసనీయత సాధించే శక్తిసామర్థ్యాలు ఉండవని కెనడియన్ రాజకీయవేత్త కవేలీ నిర్వచించాడు. కానీ ఫాసిస్టు అమెరికా సామ్రాజ్యవాదానికి ఒక దుర్వార్త ఏమిటంటే, పడిలేచే కెరటంలాంటి క్యూబన్ ప్రజలు తమ ఐక్యతాబలం ద్వారా విశ్వసనీయత సాధించే శక్తి సామర్థ్యాలు పుణికిపుచ్చుకున్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం / తిర్యాణి :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆసిఫాబాద్ ఎంఎల్ఎ కోవ లక్ష్మి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులను పంపిణీ చే శారు. అలాగే ముగ్గురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు.అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ప్రజలను మోసం చేయడమే తప్ప ఇచ్చిన హామీలను అమలు చేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. నేటికి తులం బంగారం ఇచ్చిన ఊసే లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే అన్ని హామీలను అమలు చేసి నిరూపించుకోవాలని డి మాండ్ చేశారు. నిరుపేద కుటుంబాలకు అండగా ఉండాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమండ్ల జగదీశ్, నూతన ప్రజా ప్రతినిధులు, మాజీ డిసిసిబి డైరెక్టర్ చుంచు శ్రీనివాస్, మాజీ జడ్పిటిసిలు చంద్రశేఖర్, వెడ్మ కమల, మాజీ ఎంపిపి శ్రీదేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## సిఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ



**ప్రజాపక్షం / కెరమెరి :** గ్రామీణ మరియు మారుమూల ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సిఎం కప్ క్రీడలను నిర్వహిస్తోందని ఎంపిడిఓ సురేష్ కుమార్ తెలిపారు. శనివారం కెరమెరి మండల కేంద్రంలో స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో సిఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బస్ స్టాండ్ వరకు చేపట్టిన ఈ ర్యాలీలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.యువత క్రీడల వైపు ఆకర్షితులవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి దోహదపడుతుందని, సిఎం కప్ పోటీలలో భాగంగా 44 రకాల క్రీడలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే గొప్ప అవకాశం లభిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని రాణించాలని కోరారు.తహశీల్దార్ సంతోష్, ఎంఇఒ ఆడే ప్రకాష్, ఎపిఎం ముక్తేశ్వర్, ఎస్ఐ మధుకర్, ప్రధాన ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, పెందోర్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, నాయకులు రాథోడ్ సాగర్, ఇసి అక్క నాయక్, సూపరిండెంట్ ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీల్లో బిసిలకే చైర్మన్ పీఠం

### బిసి సంక్షేమ సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ జిల్లా బిసి సంక్షేమ సంఘం కీలక డిమాండ్‌ను తరపైకి తెచ్చింది.జిల్లాలో'జనరల్'కేటగిరీ కిందకు వచ్చిన మున్సిపాలిటీల్లో అన్ని రాజకీయ పార్టీలు తమ చైర్మన్ అభ్యర్థులుగా బిసి సామాజిక వర్గానికి చెందిన వారినే ప్రకటించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.జిల్లా వ్యాప్తంగా జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సామాజిక న్యాయం జరగాలంటే,రిజర్వేషన్లతో సం బంధం లేకుండా జనరల్ స్థానాల్లో కూడా బీసీ కుటుంబాలకు చెందిన అ భ్యర్థులను చైర్మన్లుగా బరిలోకి దించాలని ఆయన రాజకీయ పార్టీలను కో రారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపోటములను శాసించేది బిసిఓటర్లేన ని, అలాంటి తరుణంలో వారిని కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా అధికారంలో భాగస్వాములను చేయాల్సిన బాధ్యత పార్టీలపై ఉందన్నా రు. కేవలం రిజర్వ్‌డ్‌స్థానాలకే బిసిలను పరిమితం చేయకుండా,జనరల్ స్థా నాల్లో కూడా అవకాశం కల్పించి బిసిల పట్ల తమకున్న చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన పేర్కొన్నారు. బిసి సంక్షేమ సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజాపక్షం'

### నత్తి మల్లేష్ ముదిరాజ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** ప్రజల కోసం ప్రతిక్షణం పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రజాపక్షం పత్రిక పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షులు కళ్ళకల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్, నవీన ఫర్టిలైజర్స్ ప్రొప్రైటర్ సత్యనారాయణ లు అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలో బిజెపి రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్ తన క్యాంపు కార్యాలయంలో బిజెపి నాయకులు కుమ్మరి నాగరాజు, శివరాంలతో కలిసి ప్రజాపక్షం 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రజాపక్షం పత్రిక ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ యాదవ్, నేతికుంట సత్యనారాయణ, వీరబోయిన శివకృష్ణ ముదిరాజ్, పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల చేయూత

**ప్రజాపక్షం / కౌటాల :** కౌటాల మండలంలోని కనిక గ్రామానికి చెందిన దేవరకొండ లాస్మగౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అండగా నిలిచారు. లాస్మగౌడ్ మృతితో విషాదంలో ఉన్న ఆయన కుటుంబానికి శనివారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమంలో భాగంగా ఆర్థికంగా నైతికంగా చేయూతనిచ్చారు. గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి శోకసంతప్త కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి 75 కిలోల బియ్యం, ఒక కాటన్ ఆయిల్ ప్యాకెట్లను సహాయంగా అందజేశారు. ఈ విపత్కర సమయంలో పార్టీ కార్యకర్తలు స్పందించి సహాయం చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మానవీయ విలువలను పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రిజర్వేషన్లు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/నిజామాబాద్:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా జిల్లాలోని నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ రిజర్వేషన్లు ఖరారు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియాలతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ శనివారం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పారదర్శకంగానిర్వహించారు.60డివిజన్లకు బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని 38 వార్డు, ఆర్మూర్ మున్సిపాలిటీలో 36 వార్డులు, భీమ్‌గల్ మున్సిపాలిటీలో 12 వార్డు స్థానాల కోసం ఎస్సి, ఎస్‌టి(మహిళా), ఎస్‌సి, ఎస్‌టి (మహిళా), బిసి, బిసి (మహిళ), అన్‌రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ (మహిళా)కే లగిరిల రిజర్వేషన్లను వీడియో రికార్డింగ్ మధ్యన నిబంధనలను అనుసరిస్తూ ఖరారు చే శారు. 2011 జనాభా ప్రాతిపదికన బిసి డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరిస్తూ రాష్ట్ర ఎన్నికల కమీషన్ సూచనలకనుగుణంగా రిజర్వేషన్ కేటాయింపులు చేశామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఖరారైన రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదించటంజరుగుతుందని తెలిపారు. రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియలో నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్,బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపల్ కమీషనర్లు జాదవ్‌కృష్ణ, శ్రావణి, గంగాధర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బాలరాజు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సిఎం కప్ గ్రామీణ యువతకు.. సువర్ణావకాశం



**ప్రజాపక్షం / తిర్యాణి :** గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం కప్ 2026 క్రీడా జ్యోతిని ఆసిఫాబాద్ ఎంఎల్ఎ కోవ లక్ష్మి ప్రారంభించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం నుండి కొమురం భీమ్ చౌరస్తా వరకు క్రీడాకారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. పల్లెల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. 2036 నాటికి తెలంగాణ క్రీడాకారులు దేశానికే గర్వకారణంగా నిలిచేలా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో జనవరి 17 నుండి 22 వరకు, మండల స్థాయిలో 28 నుండి 31 వరకు పోటీలు జరుగుతాయని వివరించారు. అనంతరం జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 9 నుండి 12 వరకు, రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 20 నుండి 23 వరకు క్రీడలు నిర్వహిస్తారని వెల్లడించారు. గ్రామస్థాయిలో గెలిచిన విజేతలు మండల స్థాయికి, అక్కడి నుండి అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా స్థాయిలకు ఎంపికవుతారని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మల్లేష్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ వెంకటేష్, క్రీడా సంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామీణ యువత పాల్గొన్నారు.

## మున్సిపల్ వార్డుల వారీగా రిజర్వేషన్లు విడుదల

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ మున్సిపాలిటీకి సంబంధించి వార్డుల వారీగా రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారికంగా విడుదల చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ వివరాలను వెల్లడించారు. బిసి మహిళలకు 1,3, 4, 13 వార్డులు కేటాయించగా 15,16,17,22, 29 వార్డులను బిసి జనరల్ కు కేటాయించారు. ఎస్‌సి జనరల్ కు 2, 25, 28 వార్డులు రిజర్వ్ చేయగా 12, 19 వార్డులను ఎస్‌సి మహిళలకు కేటాయించారు. 30వ వార్డు ఎస్‌టి జనరల్ కు దక్కింది. జనరల్ విభాగంలో 5, 8, 10, 11, 24, 26 వార్డులు ఉండగా 6,7,9,14,18, 20, 21, 23, 27 వార్డులను జనరల్ మహిళలకు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.




## నిర్మల్ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్మల్ ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీలలో అయిదు రోజుల పాటు నిర్మల్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించి,రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందామని అన్నారు.నిర్మల్ జిల్లా చరిత్ర,సాంస్కృతిక వారసత్వాన్ని నిర్మల్ ఉత్సవాల వేదిక ద్వారా ఆవిష్కరించామని,ఈ సంవత్సరం కూడా రెట్టించిన ఉత్సాహంతో అధికాకెలంతా సమన్వయంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఎన్టీఆర్ స్టేడియం సుందరీకరణ పనులు,తదితర ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.మరుగుదొడ్లు,లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. పార్కింగ్ కొరకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని సూ చించారు.హెల్మెట్ ధరించి,నిర్మల్ ఉత్సవాలకు హాజరయ్యే ద్విచక్ర వాహనదారులకు పార్కింగ్ రుసుము పూర్తిగా రాయితీ ఉంటుందని అన్నారు. జిల్లాలోని పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు చ ర్యలు తీసుకోవాలన్నారు.నిర్మల్ ఉత్సవాలకు ప్రోటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానాలు అందించాలని అన్నారు. నిర్మల్ ఉత్సవాల విజయవంతానికి విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,ఆర్డీవో రత్నకళ్యాణి,డిఈఓ భోజ న్న, డివైెస్ఓ శ్రీకాంత్ రెడ్డి,డిఆర్డీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,ఇతర అధికారులు సిబ్బంది,పాల్గొన్నారు.

## అభివృద్ధి,సంక్షేమ పథకాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి

### బ్రాహ్మణ్‌పల్లి సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక
### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్:** అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరిని ఆకర్షిస్తున్నాయని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం జక్రాన్‌పల్లి మండలం బ్రాహ్మణ్‌పల్లి స ర్పంచ్ శివప్రసాద్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నగరంలోని గూపన్‌పల్లి బైపాస్ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భూపతిరెడ్డి సమక్షంలో శివప్రసాద్ పార్టీలో చేరారు. తాజాగా జరిగిన గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచ్గా గెలుపొందిన శివప్రసాద్‌తో పాటు వారి యూత్ సభ్యులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నమ్మకాన్ని కలిగించాయని కాంగ్రెస్‌లో చేరడానికి కారణమని వారు తెలిపారు. అనంతరం డిచ్‌పల్లి మండలం కమలాపూర్‌కు చెందిన కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ లబ్ధిదారుల కు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చె క్కులను అందజేశారు. కార్యక్రమం లో మాజీ ఐడీసీయంయస్ చైర్మన్ మునిపల్లి సా యరెడ్డి, మునిపల్లి సర్పంచ్ సాయిరెడ్డి, మునిప ల్లి సర్పంచ్ సాయిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షు లు పోలసాని శ్రీనివాస్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాంచందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు సాగర్, పవన్, నిఖిల్ పాల్గొన్నారు.




## మున్సిపల్ రిజర్వేషన్ల ఖరారుతో ఆశావహుల ఆశలు గల్లంతు

**ప్రజాపక్షం/రామాయంపేట:** న్సిపాలిటి రిజర్వేషన్ల ఖరారుతో ఇప్పటి వరకు ఆశలు పెట్టుకున్న ఆశావహులు నిరుత్సాహానికి గురయ్యారు. తమ వంతు సహాయ సహకారాలు అందించిన వారికి శనివారం ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు వారి ఆశలపై నీళ్లు చల్లాయని చెప్పవచ్చు. రామాయంపేట మున్సిపాలిటిలో 12వారుల్డు ఉండగా 1 ఎస్‌టి, 1ఎస్‌సి, 1ఎస్‌సి మహిళ, 2 బీసీ జనరల్, 1బీసీ మహిళ, 4అన్ రిజర్వ్‌డ్ మహిళ, 2అన్ రిజర్వ్‌డ్ జనరల్‌కు కేటాయించారు. 12 స్థానాల్లో ఆరుగురు మహిళలకు అవకాశం దక్కింది. 1వవార్డు జనరల్ మహిళ, 2వ వార్డు ఎస్‌సి జనరల్, 3వ వార్డు ఎస్‌టి జనరల్, 4వ వార్డు ఎస్‌సి మహిళ, 5వ వార్డు జనరల్ మహిళ, 6వ వార్డు అన్‌రిజర్వ్‌డ్ జనరల్, 7వ వార్డు అన్ రిజర్వ్‌డ్ జనరల్, 8వ వార్డు బీసీ జనరల్, 9వ వార్డు బీసీ జనరల్, 10వ వార్డు అన్ రిజర్వ్‌డ్ మహిళ, 11వ వార్డు అన్ రిజర్వ్‌డ్ మహిళ, 12వ వార్డు బీసీ మహిళకు కేటాయిస్తూ ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది.

## కుంట ఆక్రమణపై అధికారులు విచారణ

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండల్ చెట్లగౌరారం గ్రామ శివారులోని మాక్సిన్ కుంట ఆక్రమణకు గురైందని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కొంతమంది బడా బాబుల సహకారంతో రియల్టర్లు ప్రభుత్వ స్థలాలు, కుంటలను కబ్జా చేస్తున్నారన్న ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో ఇరిగేషన్ ఏఈ విజయ్, ఆర్ఐ దీక్షిత్ లు రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కుంటను సర్వే చేసి ఆక్రమణకూ పాల్పడిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములపై నిఘా ఉంచి వాటిని కాపాడుతామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, నాయకులు శ్రీహరి గౌడ్,గ్రామస్తులు పాల్గొన్నారు.




## బాసరకు యూనివర్సిటీ కేటాయింపు చారిత్రాత్మకం

### మండల అధ్యక్షుడు మమ్మాయి రమేష్



**ప్రజాపక్షం/బాసర :** నిర్మల్ బహిరంగ సభ వేదికగా బాసర ప్రాంతానికి సకల సౌకర్యాలతో కూడిన యూనివర్సిటీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బాసర మండల కాంగ్రెస్ పార్టీ ,స్థానిక ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.శనివారం బాసర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మమ్మాయి రమేష్ ఆధ్వర్యంలో కృతజ్ఞత సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బాసర నిరుద్యోగ యువత రమేష్‌ను కలిసి, రాబోయే యూనివర్సిటీలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.సమావేశంలో మమ్మా యి రమేష్ మాట్లాడుతూ..ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కీలక నేతల సమక్షంలో బాసరకు యూనివర్సిటీని ప్రకటించడం ఈ ప్రాంత విద్యా ముఖ్యచిత్రాన్ని మార్చే గొప్ప నిర్ణయమని కొనియాడారు.ఇదే క్రమంలో నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను బాసర ట్రిబుల్ ఐటీ(ఐఐఐటీ) ఎదురుగా ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో నిర్మించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అక్కడ స్కూల్ ఏర్పాటు చేస్తే 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు బాసరలోనే విద్యాభ్యాసం పూర్తి చేసే అవకాశం ఉంటుందని,దీనిపై ముధోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు సహకరించాలని కోరారు.నిరుద్యోగుల వినతిని ఇన్చార్జ్ నారాయణరావు పటేల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఓని సర్పంచ్ జగదీష్ పటేల్ మాట్లాడుతూ..పార్టీలకు అతీతంగా బాసర అభివృద్ధికి యూనివర్సిటీ కేటాయించడం శుభపరిణామమని,ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆశయాలకు అనుగుణంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మాజీ ఎంపీపీ సోలంకి బాబురావు మాట్లాడుతూ బాసర ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చిన సీఎంతో పాటు సహకరించిన నేతలందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దొడపూర్ సర్పంచ్ సతీష్,ఆత్మ డైరెక్టర్ బసెట్టి శ్యాంసుందర్,సంజు దేశాయ్,మాజీ ఉపసర్పంచ్ ఖలీల్,హైమద్,సదానంద్,జంగం రాజేందర్,గైని గంగాధర్,శీను పటేల్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి చెస్ విజేత శివకుమార్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఎడపల్లి:** తెలంగాణ రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన బోధన్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి ఎంబ శివ కుమార్‌ను శనివారం ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. గత నెలలో జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 11వ రాష్ట్ర స్థాయి సాంఘిక సంక్షేమ గురుకుల క్రీడలలో శివకుమార్ అండర్ 14 విభాగంలో పాల్గొని మొదటి స్థా నాన్ని కైవసం చేసుకున్నాడు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన శివ కుమార్ ఈ ఘనత సాధించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొంత గ్రామ విద్యార్థి రాష్ట్ర స్థాయిలో రాణించడంతో జాన్కంపేట్ సర్పంచి సుంచనకోట అనురాధ రాధాకిషన్ గౌడ్, ఉప సర్పంచి నీలం కృష్ణ, కార్యదర్శి సందీప్, వార్డు సభ్యులు కలిసి శివ కుమార్‌ను శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థికి రూ. 2500నగదు పారితోషికాన్ని అందచేసి అభినందించారు. శివ కుమార్ గత నెలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లోనూ గురుకులాల రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ వరుసగా విజయం సాధించడం గర్వకారణమని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అర్సపల్లి క్రాంతి కుమార్, వెల్మల మురళి, కోడెల లక్ష్మి , చిక్కెల జయంతి ధనరాజ్, ఆకారం సాయిలు పాల్గొని శివ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## 'విబి జీ రామ్ జీ' చట్టాన్ని రద్దు చేయాలి



### వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా కార్యదర్శి కనిగరపు అశోక్

**ప్రజాపక్షం / దండేపల్లి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (విబి జీ రామ్ జీ) చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనిగరపు అశోక్ డిమాండ్ చేశారు. కోయపోషగూడలో నిర్వహించిన సమావేశంలో అశోక్ మాట్లాడుతూ గ్రామీణ పేదలను ఉపాధికి దూరం చేసేలా కేంద్ర బిజెపి ప్ర భుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. గతం లో ఉన్న ఉపాధి హామీ చట్టం స్థానంలో తెచ్చిన ఈ కొత్త విధానం వల్ల రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేసి పాత ఉ పాధి హామీ విధానాన్ని పునరుద్ధరించాలని డి మాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని విత్తన బిల్లును సవరించాలని కోరారు.దళిత గిరిజన కుటుంబాలకు అ న్యాయం చేసేలా ఉన్న కొత్త చట్టం ప్రతులను నాయకులు దహనం చేశారు.వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గంధం రాజలింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
ఆదివారం
18-01-2026
www.prajapaksham.in


## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/రామగిరి : కార్మికుల ప్రజల పక్షాన నిరంతరంగా సమస్యలపై అన్యాయాలపై వార్త కథనాల ద్వారా రాసే ప్రజాపక్ష పత్రిక అని జనరల్ సెక్రెటరీ వాసి రావు మాట్లాడారు. సెంటినరి కాలనీలో కేవల్ కే మహేంద్ర భవన్ లో శనివారం ప్రజాపక్షం దినపత్రిక 2026వ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న మీడియా రంగంలో ముందు వరుసలో ఉంది అన్నారు. దిన దిన అభివృద్ధి చెందుతున్న ప్రజాపక్షం పత్రికని అని సింగరేణి కార్మిక సోదరీ ,సోదరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సింగరేణి పరిరక్షణ కోసం కార్మికులసాధన వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేసే యూనియన్ ఏఐటియుసి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల వలన కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని సింగరేణిలో కొత్త గనులు రాక కార్మిక ఉద్యోగాలు ప్రశ్నార్థకంగా మారిందని. కొత్త గనుల కోసం ఏఐటియుసి పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ3 బ్రాంచ్ సెక్రటరీ ఎమ్మార్సీ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బందారు. క్రాంతి, సెంట్రల్ సెక్రెటరీ జూపాక .రామచందర్, టిటి రావు, ఏఎల్పీ మైన్ పిట్ సెక్రెటరీ గంగాధర్, ఓసిపి2 పిట్ సెక్రెటరీ, ఎం. సురేష్ ,ఎన్సి.రాజు ,డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలి



ప్రజాపక్షం/మల్లాపూర్ : వాహన చోదకులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని మెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం మొగిలిపేట గ్రామంలో మల్లాపూర్ ఎస్ఐ కోనేరు రాజు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అరైవ్,అలైవ్ కార్యక్రమాన్ని యువకులతో కలిసి చేపట్టి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. కాగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ వాహనదారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని ప్రమాదాలు కాకుండా ఈ చిన్నపాటి నియమాలు ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడటానికి కీలక భద్రత చర్యలని, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రతి వ్యక్తి ప్రయాణిస్తూ తన గమ్యస్థానానికి చేరుకోవడమే ప్రధాన లక్ష్యమని ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఎస్ఐ కోనేరు రాజు, సర్పంచ్ గోల్కొండ కళా రమేష్, ఉప సర్పంచ్ దండేబోని రాజేందర్, టిపిసిసి నాయకులు జువ్వడి కృష్ణారావు, పాలకవర్గ సభ్యులు,గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని దర్యాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో 2026 సంవత్సరం 2007 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశాలు, 7వ నుండి 10వ తరగతుల ఖాళీ సీట్ల భర్తీ కోసం మోడల్ స్కూల్స్ అడ్మిషన్ టెస్ట్–2026 నోటిఫికేషన్ విడుదల అయినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సంతోష్ కుమార్ తెలిపారు.ఆన్‌లైన్ దరఖాస్తులు 28 జనవరి నుండి 28 ఫిబ్రవరి 2026 వరకు స్వీకరిస్తారు. ప్రవేశ పరీక్ష 19 ఏప్రిల్ 2026 (ఆదివారం) న నిర్వహించనున్నారు. 6వ తరగతి పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7వ నుండి 10వ తరగతుల పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు జరుగుతుందని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.సంతోష్ కుమార్ సూచించారు. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

## విద్యుత్ శాఖ అధికారుల ప్రజా బాట కార్యక్రమం




ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులు శనివారం ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.విద్యుత్ ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. విద్యుత్ కనెక్షన్ సమస్య ఉన్నచోట వాటిని పరిశీలించి పరిష్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ రాజేందర్ మాట్లాడుతూ ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూదాటి రవీందర్ రావు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు,విద్యుత్ శాఖ లైన్‌మెన్లు, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పులి సంచారంతో భయాందోళనలు

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: మండలంలో రోజుకొక గ్రామంలో పులి సంచరించినట్లుగా పాద ముద్రలు కన్పించడంతో గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం తిగుల్ గ్రామ సమీపంలో పులి పాద ముద్రలు కనుగొన్నారు శనివారం మండలంలోని దౌలాపూర్ వంట పోలాలలో పులి పాద ముద్రలు కన్పించడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పులి పాద ముద్రలు గమనించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా ఫారెస్ట్ రేంజ్ అధికారి మల్లేశం పులి సంచరించిన ప్రదేశంలో పులి పాద ముద్రలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత రెండు మూడు రోజులుగా మండలంలో పులి సంచరిస్తున్నట్లుగా ఆయా గ్రామాల ప్రజలు సమాచారం అందించినట్లు తెలిపారు. అయితే రాత్రి వేళలో ఎవరు వ్యవసాయ బావుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. ఎక్కడైనా పశువులపై దాడులు జరిగినట్లు తెలిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు.

# విద్యార్థి దశ నుంచే క్రీడలకు ప్రోత్సాహం

**సిరిసిల్లలో టార్చ్ ర్యాలీని ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్‌పి మహేష్ బి గితే**




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : విద్యార్థి దశ నుంచే క్రీడలకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సిఎం కప్ పోటీల ప్రారంభం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం సిఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్‌పిమహేష్ బి గితేతో కలిసి ప్రారంభించారు. అంబేద్కర్ చౌక్ నుంచి నేతన్న విగ్రహం వరకు విప్, ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్‌పి, అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒలింపిక్స్ లో దేశం నుంచి ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధించాలనే ఉద్దేశ్యంతో ప్రజా ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందని తెలిపారు. సీఎం కప్ పేరిట రాష్ట్రంలోని గ్రామ స్థాయి నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారుల ను వెలికి తీసి జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. వివిధ క్రీడ విభాగాల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామాల ను ంచి షెడ్యూల్ ప్రకారం పోటీలు నిర్వహిస్తుందని వివరించారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు, శిక్షణ అందిస్తు ందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇ స్తుందని, యువత, విద్యార్థులకు ఉత్తమ శిక్షణ, ఉపాధి కల్పించే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు.

**రాష్ట్రస్థాయిలో ఎక్కువ పతకాలు సాధించాలి**

జిల్లాలోని విద్యార్థులు, యువత సీఎం కప్ పోటీల్లో పాల్గొని ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. సీఎం కప్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్లు తక్కువ ఉపయోగించాలని, క్రీడలు, మైదానాల్లో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. సిఎం కప్ టార్చ్ ర్యాలీ సిరిసిల్లలో మొదలై జిల్లాలోని అన్ని మండలాల్లో సాయంత్రం వరకు పూర్తి అవుతుందని తెలిపారు. జిల్లా నుంచి విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించేలా జిల్లా క్రీడల, విద్యా శాఖ ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం జిల్లాలో మొత్తం 34 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి.. రాష్ట్రస్థాయికి పంపిస్తామని పేర్కొన్నారు. అన్ని క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించి జిల్లా నుంచి టీమ్‌లను వచ్చే నెలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే పట్టం కట్టాలి

**కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల**



ప్రజాపక్షం/కరీంనగర్:కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలంతా పట్టం కట్టాలని తద్వారా కరీంనగర్ పట్టణాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గా ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. కరీంనగర్ పట్టణాన్ని గత బిఆర్ఎస్ పాలకులు భ్రష్టు పట్టించారని అవినీతిలో గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించారని మండిపడ్డారు. కరీంనగర్ అభివృద్ధిలో తన తండ్రి జగపతిరావు రోల్ మోడల్ గా నిలిచారని పేర్కొన్నారు. కొత్తపెల్లిలోని వెలిచాల ప్రజా కార్యాలయంలో శనివారం సాయంత్రంబిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు వందలాదిమంది వెలిచాల రాజేందర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేకుర్తికు చెందిన టిఆర్ఎస్ నాయకుడు అస్తపురం మారుతి ఆధ్వర్యంలో 200 మంది నాయకులు కార్యకర్త కార్యకర్తలు రాజేంద్ర రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరారు. వారందరికీ రాజేందర్ రావు కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. దీంతోపాటు 12వ డివిజన్ కు చెందిన తెల్ల రమేష్ ఆధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేందర్రావు మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ పాలకుల వల్ల కరీంనగర్ అన్ని రంగాల్లో భ్రష్టు పట్టిందని అవినీతిలో కేరాఫ్ అడ్రస్ గా కరీంనగర్ ను నిలిపారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలంతా పట్టం కట్టాలని అభివృద్ధి అంటే ఎలా ఉండాలో చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ లో బిజెపి బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ కు పాల్పడుతున్నాయని ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో ఇరు పార్టీలు లోపాయికారిగా ఒప్పందం చేసుకున్నాయని మండిపడ్డారు. ప్రజలంతా బిఆర్ఎస్ బిజెపి పార్టీలకు గట్టి బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు కార్యకర్తలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని వార్డుల్లో కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాజేందర్ రావ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు ముఖ్యులు పాల్గొన్నారు.

## 21న ధర్మపురిలో 'భట్టి'పర్యటన



ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో ఈనెల 21న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పర్యటించనున్నట్లు సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు.ఈమేరకు ఆయన పర్యటనలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు జరపనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ధర్మపురి ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ప్రభుత్వం పలు అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. దీనిలో భాగంగా రూ.200 కోట్లతో యంగ్ ఇంటిగ్రేటెడ్ పాఠశాల సముదాయం నిర్మాణం,గోదావరి నది కలుషితం కాకుండా రూ.17 కోట్లతో సీవరేజి ప్లాంటు ఏర్పాటు కోసం శంకుస్థాపన ఉప ముఖ్యమంత్రి చేతులమీదుగా జరుపుకోనున్నట్లు అడ్లూరి చెప్పారు. అదేవిధంగా టీఎఫ్ఐడి ద్వారా రూ.15 కోట్లతో పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తి చేయగా, పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లమార్పు,నూతన స్తంభాల ఏర్పాట్లకు రూ 4 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.2 కోట్ల నిధులు కేటాయించి కులసంఘ భవనాల నిర్మాణాలు జరపనున్నట్లు మంత్రి తెలిపారు.ఇప్పటికే అనేక పనులు పూర్తి కాగా మిగిలిన పనులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేయనున్నారని ఆయన పర్యటన విజయవంతం చేసేందుకు నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.అనంతరం ఉప ముఖ్యమంత్రి పర్యటించే స్థలాలను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు మరింత చేరువగా 'ఆయుష్' సేవలు

**జిల్లా కలెక్టర్ హైమావతి**




ప్రజాపక్షం/ సిద్దిపేట : ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య సేవలు జిల్లాలోని ప్రజలకు చేరువయ్యేలా పనిచేయాలని ఆయుష్ డాక్టర్లకు జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. స్థానిక సమీకృత జిల్లా కార్యాలయం సముదాయంలో కాన్ఫరెన్స్‌హాల్లో జిల్లాలోని ఆయుష్ మెడికల్ వైద్యాధికారులతో కలెక్టర్ హైమావతి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలోని పిహెచ్‌సి, సిహెచ్‌సిలో ఆయుష్ వైద్య సేవలపై మెడికల్ ఆఫీసర్, ఫార్మాసిస్ట్ వెకెన్సి లీస్టు తయారు చేయాలన్నారు. జిల్లాలో నిర్మించిన యోగ షెడ్లలో యోగ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య సేవలు వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలు ప్రతి ఒక్కరికి తెలుపాలన్నారు. ఆయూష్ సేవలను విస్తరించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఆదేశించారు. వృద్దులకు,కాళ్లు చేతులు నొప్పులతో బాధపడేవారికి ప్రోత్సహించాలన్నారు. ఓపి కౌంట్ పెంచాలని, ఆసుపత్రుల్లో సమయవేళలు పాటించాలన్నారు. పిహెచ్‌సి. సిహెచ్‌సిలోని మెడికల్ ఆఫీసర్ సమన్వయంతో వైద్యం అందించాలన్నారు. ఆయుష్‌కేంద్రంలోని మెడికల్ పరికరాలు. మెడిసన్ కోసం ఉన్నత అధికారులకు లెటర్ పెట్టి తెప్పించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, హస్టల్ లో హాలోపతి డాక్టర్లతో కలసి వైద్య సేవలు అందించాలని తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని 50 పడకల ఆయుష్ ఆసుపత్రిని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధనరాజ్. జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ భానుతేజ. జిల్లా ఆయుష్ ఇంచార్జి ఉమా దేవి ,ఆయుష్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే... నా సంకల్పం..

**రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్**



ప్రజాపక్షం/గోదావరిఖని : ముప్పై ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఒకే పార్టీలో ఉంటూ సొంత ఊరు బాగుతోపాటు ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నానని, నేడు నాపై చేస్తున్న ఆరోపణలు, విమర్శలకు తాను ఇచ్చే జవాబు ఒకటేనని అది 'అభివృద్ధి' అని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ అన్నారు. శనివారం రామగుండం పట్టణంలో ఎంఎ అండ్ యుడి నిధులు రూ.20 కోట్లతో నగరపాలక పరిధిలోని 1 నుంచి 60 డివిజన్లలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 50 ఏళ్లుగా రామగుండం ప్రాంతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో, తెలంగాణ ఏర్పాడ్డాక పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పూర్తి నిర్లక్ష్యానికి గురైందన్నారు. హైదరాబాద్‌తో సమానంగా వరంగల్, కరీంనగర్ నగరాలు అభివృద్ధి చెందుతున్న రామగుండం మాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. పరిశ్రమలు మూతపడి, నిరుద్యోగ సమస్య పెరిగిందన్నారు. మౌలిక వసతులకు ప్రజలు దూరమయ్యారన్నారు. విద్య, వైద్య, రవాణా రంగాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్ల కాలంలో సుమారు రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రధానంగా తాగునీరు, సాగునీరు అందించడంతోపాటు దేవాలయాల అభివృద్ధి, రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. రామగుండం పట్టణంలో రూ.16 వేల కోట్ల అంచనాతో 800 మె.వా. థర్మల్ పవర్ ప్రాజెక్టు, సింగరేణి ఆధ్వర్యంలో లింగాపూర్ సమీపాన 500 మె.వా. హైడల్ పవర్ ప్రాజెక్టులు, కుందనపల్లి, పెద్దంపేట రైల్వేగేట్ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, ఎన్‌టి కాలనీ వద్ద 'వై' ఆకారంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి, బాలికల గురుకుల పాఠశాల నుంచి పెద్దంపేట ఆర్అండ్‌బి రోడ్డు వరకు నాలుగు వరుసల రోడ్డును మంజూరు చేయించినట్లు తెలిపారు. అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతిమణి మనాలి ఠాకూర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఠాకూర్ అయోధ్యసింగ్, మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, నాయకులు బందారపు బుగ్గరాములుగౌడ్, సిరిశెట్టి సతీష్‌గౌడ్, గౌస్‌బాబా, అనితాచౌదరి, నగరపాలక ఎస్‌ఈ గురువీరా,ఇఇరామన్,సెక్రటరీఉమా మహేశ్వర్‌లు తదితరులుపాల్గొన్నా రు.

## మున్సిపాల్టీల్లో ఖరారైన రిజర్వేషన్లు

**జమ్మికుంట ఎస్‌సిజనరల్ చొప్పదండి, హుజురాబాద్ ఎస్‌సి మహిళ**


ప్రజాపక్షం/కరీంనగర్:మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో బాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం మున్సిపాల్టీల చైర్ పర్సన్ లు, కార్పొరేషన్ మే యర్ ల రిజర్వేషన్ లను ఖరారు చేసింది. కరీంనగర్ జిల్లాలో కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు చొప్పదండి, జమ్మికుంట, హుజురాబాద్ మూడు మున్సిపాల్టీలు ఉన్నాయి. వీటికి సంబంధించిన మేయర్, చైర్ పర్సన్ల రిజర్వేషన్లను ఎస్‌సి ఖారారు చేయగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను బిసి జనరల్ కు, జమ్మికుంట ఎస్‌సి జనరల్‌కు, చొప్పదండి, హుజురాబాద్ మున్సిపాల్టీలను ఎస్‌సి మహిళకు కెటాయించారు. కరీంనగర్ కార్పొరేషన్ లో 66 డివిజన్ లలో ఒకటి ఎస్‌టి జనరల్, ఎస్‌సిలకు కేటాయించిన 7 డివిజన్ లలో 4 ఎస్‌సిజనరల్ కాగా 3 ఎస్‌సిమహిళలకు కేటాయించారు. బిసిలకు 25 డివిజన్ లను కేటాయించగా అందులో బిసి జనరల్ 13 కాగా బి సి మహిళలకు12 కేటాయించారు. జనరల్ మహిళలకు 18, జ నరల్ (అ న్ రిజర్వ్ డ్) 15 డివిజన్ లను కేటాయించారు. ఈ డివిజన్ ల పరిధిలో 3,40,580 మంది మొత్తం ఓటర్లు ఉండగా అందులో పురుషులు 16 ,9670 మంది కాగా మహిళలు 170858, ఇతరులు 43 మంది ఉ న్నారు. చొప్పదండి మున్సిపల్ లో 14 వార్డులుండగా అందులో ఒకటి ఎస్‌టి జనరల్ కు కేటాయించగా, ఎస్‌సిలకు కేటాయించిన 3 వార్డులలో 2 ఎస్‌సి జనరల్, ఒకటి ఎస్‌సి మహిళకు కేటాయించారు. బిసిలకు 3 వా ర్డులు కే టాయించగా అందులో బిసి జనరల్ కు 2, బిసి మహిళకు ఒకటి కేటాయి ంచారు. జనరల్ మహిళలకు 5, జనరల్ (అన్ రిజర్వ్ డ్) 2 వా ర్డులను కే టాయించారు. వీటి పరిధిలో 13,916 మంది ఓటర్లున్నారు. ఇందులో పు రుషులు 7173, మహిళలు 6743 మంది ఉన్నారు. హుజురాబాద్ లో 30 వార్డులుండగా అందులో ఒకటి ఎస్‌టి జనరల్ కు కేటాయి ంచగా, ఎస్‌సిలకు కేటాయించిన 6 వార్డులలో 3 ఎస్‌సి జనరల్ కాగా 3 ఎస్‌సిమహిళలకు కేటాయించారు. బిసిలకు 8 వార్డులు కేటాయించగా అందులో బిసి జనరల్ 4 కాగా బిసి మహిళలకు 4 కేటాయించారు. 8వార్డులను జనరల్ మహిళలకు, 7 వార్డులను జనరల్ కు (అన్ రిజర్వ్ డ్) కే టాయించారు. వీటి పరిధిలో 29,531 మంది ఓటర్లుండగా పురుషులు 14,357, మహిళలు 15,172, ఇతరులు నలుగురు ఉన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో 30 వార్డులకు గాను ఒకటి ఎస్‌టిజనరల్ కు కేటాయించగా, ఎస్‌సిలకు కేటాయించిన 6 వార్డులలో 3 ఎస్‌సి జనరల్ కు, 3 ఎస్‌సిమహిళలకు కేటాయించారు. బిసిలకు 8 వార్డులు కేటాయించగా అందులో 4 బిసి జనరల్ కాగా బిసి మహిళలకు 4 కేటాయించారు. 8 వార్డులు జనర ల్ మహిళలకు, 7 వార్డులను జనరల్ కు (అన్ రిజర్వ్ డ్) కేటాయించారు. వీటి పరిధిలో మొత్తం 34455 ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 168 15 మంది కాగా మహిళలు 17639 మంది ఇతరులు ఒకరు ఉన్నారు.

## లాటరీ ద్వారా మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు



**జిల్లా కలెక్టర్ డాక్టర్ పమేలా సత్పతి**

ప్రజాపక్షం/కరీంనగర్ :లాటరీ పద్దతి ద్వారా జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, కరీంనగర్ కార్పొరేషన్ కు మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మున్సిపల్ వార్డులలో మహిళ రిజర్వేషన్ ఖరారు చేసే ప్రక్రియను శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మున్సిపల్ వార్డులలో మహిళలకు రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ప్రతి మున్సిపాలిటీకి సంబంధించి వార్డుల వారీగా రిజర్వేషన్ స్థితిగతులను తెలుపుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చొప్పదండి హుజురాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీలలో, కరీంనగర్ కార్పొరేషన్ లో వార్డుల వారిగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను తెలుపుతూ లాటరీ పద్ధతి ద్వారా ఎస్టీ, ఎస్సీ, బీసీ, జనరల్ వారీగా మహిళలకు కేటాయించే వార్డులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రపోల్ దేశాయ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



**పెద్దపల్లిలో...** లాటరీ పద్ధతి ద్వారా జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరా రు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మున్సిపల్ వార్డు /డివిజన్ రిజర్వేషన్ ఖరారు చేసే ప్రక్రియను శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ వార్డు, డివిజన్‌లను రిజర్వేషన్ వారీగా కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేయడం జరిగిందని అ న్నారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 124 వార్డులలో 50 శాతం మహిళలకు కేటాయిస్తున్నట్లు, వీ టిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డ్రా పద్ధతిలో ఖరారు చేశామని అన్నారు.పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల వార్డు సంఖ్య లో మార్పులు లేకపోవడంతో గత ఎన్నికల మాదిరిగానే ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు సీట్లను రిజర్వు చేశామని , రామగుండం పరిధిలో వార్డుల సంఖ్య 50 నుంచి 60 కు పెరగడంతో ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు 2011 జనాభా లెక్కల ప్రకారం , ఎస్‌సి, ఎస్‌టి, బిసి సీట్లను బిసిడెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా కేటాయింపులు చేపట్టామని అన్నారు. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల పరిధిలో రోటేషన్ పద్ధతిలో రిజర్వేషన్ వార్డుల కేటాయింపు ఉంటుందని, రామగుండం పరిధిలో వార్డుల సంఖ్య పెరిగినందున రిజర్వేషన్ సీట్లు పునరావృతం అయ్యే అవకాశం ఉండవచ్చని అన్నారు.ఎస్సీలకు రామగుండంలో 13, పెద్దపల్లిలో 4, మ ంథని లో 2, సుల్తానాబాద్ లో 2 , ఎస్‌టి లకు రామగుండం లో 1, పెద్దపల్లిలో 1, మంథని లో 1, సుల్తానాబాద్ లో1,బిసిలకు రామగుండం లో16, పెద్దపల్లిలో 13,మంథని లో 3, సుల్తానాబాద్‌లో 4 స్థానాలు రిజర్వ్ అయ్యాయని అన్నారు. అనంతరం రాజకీయ పా ర్టీల ప్రతినిధుల సమక్షంలో మున్సిపాలిటీలలో వార్డుల వారిగా కేటాయించి న రిజర్వేషన్ వివరాలను తెలుపుతూ లక్కీ డ్రా ద్వారా మహిళలకు వార్డుల కే టాయింపు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అ రుణ శ్రీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ , మున్సిపల్ కమిషనర్లు,వెంకటేష్, రమే ష్, మనోహర్ సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

# తొలి ఓవర్లోనే 2 వికెట్లు కోల్పోయిన ఢిల్లీ



మహిళల ప్రీమియర్ నాలుగో సీజన్ రెండో డబుల్ హెడర్‌లో ఆర్‌సిబి.. ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతున్నాయి. టాస్ ఓడిన ఢిల్లీకి తొలి ఓవర్లోనే లారెన్ బెల్(25) షాకిచ్చింది. తొలి ఓవర్లోనే డేంజరస్ ఓపెనర్ లిజెనే లీ(4)ని ఔట్ చేసిన తను.. ఆ తర్వాతి బంతికే లారా వొల్వార్డ్ట్(0)ను క్లీన్‌బౌల్డ్ చేసింది. రెండో ఓవర్లో సయాలీ సత్ఘరే(24) తన పేస్ మ్యాజిక్‌తో వరుస బంతుల్లో జెమీమా రోడ్రిగ్స్(4), మరినే కాప్(0)లను బౌల్డ చేసి ఢిల్లీని కష్టాల్లోకి నెట్టింది. దాంతో.. 10కే నాలుగు వికెట్లు పడ్డాయి. ప్రస్తుతం షఫాలీ వర్మ (1)కి తోడుగా నిక్కీ ప్రసాద్ (0) క్రీజులో ఉంది. నవీ ముంబైలో ఇదే ఆఖరు మ్యాచ్ కావడంతో ఫలితంపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. టాస్ గెలిచిన ఆర్‌సిబి కెప్టెన్ స్మృతి మంధాన బౌలింగ్ ఎంచుకుంది. ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో జెమీమా సారథ్యంలోని ఢిల్లీ గెలవాల్సింది. కీలకమైన ఈ పోరుకు ఆల్‌రౌండర్ అందుబాటులో లేదు. దాంతో ఆమె స్థానంలో తుది జట్టులోకి వచ్చిన ఆస్ట్రేలియా పేసర్ లుసీ హామిల్టన్ డబ్ల్యూపిఎల్‌లో అరంగేట్రం చేస్తోంది.

**ఢిల్లీ తుది జట్టు :** షఫాలీ వర్మ, లిజెల్లీ లీ(వికెట్ కీపర్), లారా వొల్వార్డ్ట్ జెమీమా రోడ్రిగ్స్(కెప్టెన్), మరిజానే కాప్, లుసీ హామిల్టన్, స్నేహ్ రానా, నికీ ప్రసాద్, మిన్ను మణి, నందిని శర్మ, శ్రీ చరణి.

**ఆర్సీబీ తుది జట్టు :** గ్రేస్ హ్యారిస్, స్మృతి మంధాన(కెప్టెన్), జార్జియా వోల్, రీచా ఘోష్(వికెట్ కీపర్), గౌతమి నాయక్, నడినే డీక్లెర్క్, రాధా యాదవ్, ప్రేమా రావత్, శ్రేయాంక పాటిల్, సయాలీ సత్గరే, లారెన్ బెల్.

## అర్ధ శతకాలతో మెరిసిన వైభవ్,అభిగ్యాన్

*బంగ్లాదేశ్ ముందు స్వల్ప లక్ష్యం..!*

అండర్19 ప్రపంచకప్ రెండో మ్యాచ్‌లో భారత జట్టు స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. వర్షం అంతరాయం నడుమ సాగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ బౌలర్లపై విరుచుకుపడుతూ వైభవ్ సూర్యవంశీ(72) శుభారంభిచ్చాడు. కానీ, మిడిలార్డర్ తడబాటు కారణంగా 53కే మూడు కీలక వికెట్లు కోల్పోయింది టీమిండియా. అయితే.. అభిగ్యాన్ కుందు(80) సమయోచిత ఇన్నింగ్స్‌తో భారత స్కోర్ 200 దాటించాడు. కుందు అర్ధ శతకంతో కోలుకున్న ఆయుష్ మాత్రే సేన49 ఓవర్లలో 238 పరుగులకే ఆలౌటయ్యింది. జింబాబ్వే వేదికగా జరుగుతున్న పురుషుల అండర్19 ప్రపంచకప్‌లో అదిరే బోణీ కొట్టిన భారత జట్టు రెండో మ్యాచ్‌లో స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. టాస్ ఓడిన టీమిండియాక శుభారంభం దక్కలేదు. ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే ఓపెనర్ ఆయుష్ మాత్రే(6)ను ఔట్ చేసి షాకిచ్చాడు ఫాహద్(5 38). ఆ తర్వాతి బంతికే వేదాంత్ త్రివేది(0)ని డకౌట్ చేయడంతో ఇన్నింగ్స్ నిర్మించే బాధ్యత తీసుకున్నాడు వైభవ్ సూర్యవంశీ(72). కానీ,.. తమిమ్ ఓవర్లో విహాన్ మల్హోత్రా వెనుదిరగడంతో 53కే మూడు వికెట్లు పడ్డాయి. ఆ దశలో వైభవ్ తన స్టయిల్ విధ్వంసంతో స్కోర్ బోర్డును పరిగెత్తించాడు.సెంచరీ దాటించిన వైభవ్ 115వద్ద ఔటయ్యాక.. కనిష్క్ చౌహాన్ (28), టెయిలెండర్ల సాయంతో వికెట్ కీపర్ అభిగ్యాన్ కుందు(80) కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. చివరి దాకా నిలబడిన అతడు హాఫ్ సెంచరీతో స్కోర్ 200 దాటించాడు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించగా.. 48వ ఓవర్లో దీపేశ్ దేవేంద్రన్(11) 4, 6 బాదాడు. అదే ఊపులో పెద్ద షాట్ ఆడబోయిన అతడు బౌండరీ వద్ద దొరికిపోవడంతో 238 వద్ద భారత ఇన్నింగ్స్ ముగిసింది.



## రూ.3 లక్షల ఖరీదైన వాటర్ ప్యూరిఫయర్‌తో గిల్

**ఇండోర్:** న్యూజిలాండ్, ఇండియా మధ్య ఆది వారం ఇండోర్‌లో మూడవ వన్డే జరగనున్నది. అయితే ఆ మ్యాచ్‌లో ఆడేందుకు ఇండోర్ వెళ్లిన కెప్టెన్ శుభమన్ గిల్( Shubman Gill) తన వెంట ఓ వాటర్ ప్యూరిఫయర్ తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. సుమారు మూడు లక్షలు ఖరీదు చేసే నీటి శుద్ధి మెషీన్‌ను గిల్ తన వెంబట తీసుకెళ్లినట్లు ఓ మీడియా కథనం ద్వారా తెలుస్తోంది. ఆ వాటర్ ప్యూరిఫయర్ ప్రత్యేకమైందని, ఆర్వో నీటినైనా లేక బాటిల్ వాటర్‌నైనా ఆ డివైస్ రీప్యూరిఫై చేస్తుందని చెబుతున్నారు. పర్సనల్ హోటల్ రూమ్‌లో ఆ ప్యూరిఫయర్‌ను గిల్ ఇన్‌స్టాల్ చేసినట్లు సమాచారం. అయితే ఈ విషయం కామెంట్ చేసేందుకు టీం మేనేజర్ నిరాకరించారు. ఇటీవల ఇండోర్‌లో నీటి కాలుష్యం వల్ల ఓ కాలనీలో అనేక మంది మరణించిన విషయం తెలిసిందే. నెంబర్ వన్ క్లీన్ సిటీగా అనేక సార్లు అవార్డు గెలుచుకున్న ఇండోర్‌లో నీటి కాలుష్యం సమస్య తీవ్రమైంది. బహుశా ఆ సంక్షోభం వల్లే గిల్ వ్యక్తిగతం నీటి ప్యూరిఫయర్‌ను తీసుకొచ్చి ఉంటాడని భావిస్తున్నారు.






# భారత్ ఎగుమతులకు గట్టి దెబ్బ..




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌లతో భారత్ ఎగుమతి ఆధారిత వృద్ధి వ్యూహం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆర్డర్ రద్దులు, ఉత్పత్తి తగ్గుదల, ఉద్యోగ నష్టాలు పెరుగుతున్నాయి. తమిళనాడులో ప్రభావం అత్యధికం; రోజుకు సుమారు రూ. 600 మిలియన్ (6.7 మిలియన్ అమెరికన్ డాలర్లు) ఆదాయ నష్టం జరుగుతోందని సీఎం ఎంకె స్టాలిన్ ప్రధాని మోదీకి హెచ్చరించారు. ఆగస్టు నుంచి తిరుప్పూర్ (నిట్‌వేర్ హబ్)లో రూ. 150 బిలియన్ విలువైన ఎగుమతి ఆర్డర్లు రద్దు కాగా, ఉత్పత్తి 30 శాతం వరకు తగ్గింది. ట్రంప్ ప్రకటించిన 50 శాతం వరకు టారిఫ్‌లు భారత ఉత్పత్తులపై విధించబడటంతో, టెక్స్‌టైల్స్, లెదర్, రత్నాభరణాలు, ఫుట్‌వేర్, ప్రాసెస్డ్ ఫుడ్స్ వంటి శ్రమాధారిత రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారత్‌కు అమెరికా అత్యధిక ఎగుమతి లక్ష్యం సుమారు 20 శాతం. టారిఫ్‌లు భారత ఉత్పత్తుల పోటీ సామర్థ్యాన్ని తగ్గించడమే కాక, 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలకు ఆటంకంగా మారాయి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు నిలిచిపోవడంతో ఎగుమతిదారులు వేచి చూడాలా, ఉత్పత్తి తరలించాలా, అమెరికా మార్కెట్ వదలాలా అనే అనిశ్చితిలో ఉన్నారు. తమిళనాడు దేశ టెక్స్‌టైల్, లెదర్–ఫుట్‌వేర్ ఎగుమతుల్లో కీలక వాటా కలిగి, లక్షలాది ఉద్యోగాలు అందిస్తోంది. ఎస్‌ఎంఈలు కుప్పకూలే అంచున ఉన్నాయి. అమెరికా కొనుగోలుదారులు ఆర్డర్లు రద్దు చేయడం లేదా భారీ ధర కోతలు కోరుతున్నారని ఎగుమతిదారులు చెబుతున్నారు... 50 శాతం టారిఫ్ పోటీని పూర్తిగా తుడిచేస్తోంది. ఇతర రాష్ట్రాలూ ప్రభావితమే: ఆంధ్రప్రదేశ్‌లో రొయ్యల ఎగుమతులు తగ్గాయి. గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో డైమండ్, జ్యువెలరీ, లెదర్ క్లస్టర్లు ఇబ్బందుల్లో ఉన్నాయి. పరిశ్రమ అంచనాల ప్రకారం అమెరికాకు ఎగుమతులు డబుల్ డిజిట్ శాతం తగ్గాయి. కేంద్రం తాత్కాలిక ఉపశమన చర్యలు తీసుకున్నా, అవి మూల సమస్యకు పరిష్కారం కాదని వ్యాపార వర్గాలు అంటున్నాయి. దీర్ఘకాలిక టారిఫ్‌లు విదేశీ పెట్టుబడులపై కూడా ప్రతికూల ప్రభావం చూపవచ్చని ఆర్థిక నిపుణుల హెచ్చరిక. మొబైల్ ఫోన్ ఎగుమతులు ఇప్పటికి మినహాయింపులో ఉన్నా, ఇతర ఎలక్ట్రానిక్స్‌పై ఒత్తిడి పెరుగుతోంది. కాగా. కేంద్రానికి స్టాలిన్ లేఖ రాజకీయాలకు అతీతమైన రాష్ట్రస్థాయి ఆందోళనను ప్రతిబింబిస్తుందని విశ్లేషకుల అభిప్రాయం. వాషింగ్టన్‌తో బ్రేక్‌త్రూ సాధించగలగడమే లక్షలాది ఉద్యోగాల భవితవ్యాన్ని, తయారీ శక్తిగా ఎదగాలన్న భారత్ ఆశయాల విశ్వసనీయతను నిర్ణయించనుంది.

## ఈ వారం స్టాక్ మార్కెట్లు



**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ 83,570.35 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 83,576.24 పాయింట్లు. నష్టం 5.89 పాయింట్లు).

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ 25,694.35 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 25,683.30 పాయింట్లు. నష్టం 11.05 పాయింట్లు).

## బులియన్ మార్కెట్

వరుసగా మూడో రోజు కూడా బంగారం ధరలు తగ్గాయి. గత ఏడాది అసాధారణంగా పెరిగిన ధరలు ఈ ఏడాది కూడా కొనసాగుతుందన్న అంచనాలు వెలువడ్డాయి. అయితే, సామన్యులు బంగాలం కొనుగోలు పట్ల ఆసక్తి ప్రదర్శించకపోవడం, పండుగ సీజన్ దాదాపుగా పూర్తికావడంతో, బంగారం ధరలు తగ్గక తప్పడం లేదు. గురువారం మొదలైన ధరల తగ్గుదల శనివారం కూడా కొనసాగింది. శనివారం 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.100 తగ్గి రూ.14,33,900 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ. 100 తగ్గి రూ. 13,14,400గా ఉండగా, 18 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు ధర రూ.100 తగ్గి రూ.10,75,400 వద్ద ట్రేడ్ అవుతున్నది. హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం రూ.1,43,390, 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం రూ.1,31,440, 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం రూ.1,07,540గా ఉంది.

## చైనాతో ఒప్పందం.. తయారీ రంగానికి ఊతం

చైనా ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులకు బిజినెస్ వీసా నిబంధనలను సడలించడం ద్వారా భారత్ తయారీ రంగంలో నిలిచిపోయిన ప్రాజెక్టులకు ఊతమిచ్చింది. డిజిటల్ స్పాన్సర్‌షిప్, సరళమైన దరఖాస్తు ప్రక్రియ, బహుళ అనుమతుల తొలగింపు వంటి సంస్కరణలు 2020 లడాఖ్ సంఘటన తర్వాత తొలిసారి చైనా నిపుణుల ప్రవేశాన్ని గణనీయంగా సులభం చేశాయి. స్వయం సమృద్ధి చర్చలు, కొనసాగుతున్నప్పటికీ, భారత తయారీ రంగం ఇంకా చైనా సరఫరా గొలుసులపై ఆధారపడి ఉంది. ఎలక్ట్రానిక్స్, సోలార్, భారీ యంత్రాల్లో చైనా పరికరాలు కీలకం. వాటి స్థాపన, నిర్వహణకు చైనా ఇంజినీర్లు అవసరం. వీసా ఆంక్షల వల్ల ఎలక్ట్రానిక్స్ రంగానికి సుమారు 15 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్టు అంచనా. ఈ వీసా సడలింపు స్వదేశీకరణ తక్షణంలో ఖరీదైనదని ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించినట్లేనని పరిశీలకులు అంటున్నారు. ముఖ్యంగా ఇన్‌స్టాలేషన్, కమిషనింగ్, మెయింటెనెన్స్, శిక్షణ వంటి పనులకు మాత్రమే సడలింపులు ఇవ్వడాన్ని వ్యూహాత్మక చర్యగా పేర్కొంటున్నారు. ఇదే సమయంలో, ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడంతో అమెరికా వైపు నుంచి టారిఫ్‌లు, కఠిన వాణిజ్య నిబంధనల ముప్పు పెరిగింది. దీంతో భారత్ ఆర్థిక భాగస్వామ్యాలను విభిన్నీకరించాల్సిన అవసరం ఎదుర్కొంటోంది. ఈ సందర్భంలో చైనా అవరోధం సైతం, పరిష్కారం కూడాగా మారుతోంది. ఇలావుంటే, 'రేర్ ఎర్త్ ప్రాసెసింగ్' మరో కీలక అంశం. ఈ ఏడాది ఆగస్టు మాసంలో మోదీ–షీ భేటీ తో సరిహద్దు వివాదాలు పరిష్కారం కాలేకపోయినా, సంబంధాలు ఘర్షణ నుంచి విభజిత సహకారం వైపు మళ్లాయి. వీసా సంస్కరణలు విధాన మార్పు కాదు.. నిలిచిన ప్రాజెక్టులను ముందుకు నడిపించే పరిపాలనా సాధనంగా ప్రభుత్వం చూపిస్తోంది. మొత్తంగా, ఇది చైనాతో మైత్రి కాదు; కఠిన గ్లోబల్ వాణిజ్య వాతావరణంలో నిలబడేందుకు తీసుకున్న లెక్కలువేసిన సర్దుబాటు.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

## మహత్తర ఘట్టంగా నిలవబోతున్న ఖమ్మం బహిరంగసభ

తరలి వెళ్తున్న నల్లగొండ ఎర్రదండు : నెల్లికంటి



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఖమ్మం జిల్లాలో నేడు జరుగుతున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు అఖిల భారత బహిరంగ సభకు విప్లవ ఖిలా నల్లగొండ జిల్లా నుండి ఊరుకో బండి.. ఇంటికో కామ్రేడ్ తరలివెళుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు.దేశంలో సిపిఐ ఎన్నో కుట్రలు, ఎన్నెన్నో నిర్బంధాలు. ఉరికొయ్యలను రేదించి చెరసాలల్లో పురుడుపోసుకొని భారత గడ్డపై నిండు నూరేళ్ళుగా ప్రస్థానం సాగిస్తున్న అజరామర త్యాగాలగని గుర్తు చేశారు.1996 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్ స్థాపించబడిన భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల ముగింపు వేడుకలను లక్షలాది మందితో కమ్యూనిస్టుల పురిటిగడ్డ ఖమ్మం పట్టణంలో ఈ నెల 18వ తేదీన జరపడానికి భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయించింది. భారత దేశ చరిత్రలో మహత్తర ఘట్టంగా నిలవబోతున్న ఈభారీ బహి రంగసభకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతున్నారు.ఈ బహిరంగసభకు భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా,తెలం గాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సౌహార్ధ సందే శం ఇవ్వబోతునట్లు తెలిపారు. నల్లగొండ జిల్లా నుండి 5వేల మంది సిపిఐ నాయకులు,కార్యకర్తలు ఎర్ర చొక్కాలు ధరించి ప్రదర్శనలో పాల్గొంటున్నారని తెలిపారు.అదేవిదంగా వంద మంది విద్యార్థి,యువకులు ఖమ్మంలో కావత్‌లో పాల్గొంటున్నట్లు వివరించారు.

## భారత గడ్డపై సిపిఐది వందేండ్ల ప్రస్థానం

ఖమ్మంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలి : బెజవాడ పిలుపు



**ప్రజాపక్షం/చిలుకూరు :** నేడు ఖమ్మంలో జరిగే సిపిఐ 100 సంవత్సరాల అఖిల భారత స్థాయి ముగింపు ఉత్సవాలలో పార్టీ నాయకులు, పార్టీ సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం చిలుకూరు సిపిఐ భవన్‌లో జరిగిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత గడ్డపై సిపిఐ వందేండ్ల ప్రస్థానంలో భూమి కోసం, భుక్తి కోసం, సిపిఐ ఎన్నో ఉద్యమాలు చేపట్టి ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేసిందని గుర్తు చేశారు. జిల్లా, మండల, గ్రామాల నలుమూలల నుండి కార్యకర్తలు వేలాదిగా ఖమ్మం తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి సాహెబ్ అలీ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, షేక్ జానిపాషా, కందుకూరి నరేష్ పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా నలుమూలల నుండి తరలిరావాలి : భూక్య రమేష్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఇంద్రనగర్ వద్ద గల సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి భూక్య రమేష్ మాట్లాడారు. నేడు ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరగబోయే భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) శత వసంతాల వార్షికోత్సవ బహిరంగ సభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ భారీ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు నిర్మల్ జిల్లా నలుమూలల నుండి కార్మికులు,కర్షకులు,పార్టీ సానుభూతిపరులు,ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని భూక్య రమేష్ ఈ సందర్భంగా కోరారు.

# సిపిఐలో చేరిన 300 మంది

**● కార్పొరేషన్ ఎన్నికలలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి ● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** నేడు ఖమ్మం పట్టణంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధి సీతారామపట్నంలో నామా నవీన్, పండు, మోహన్, ప్రసాద్‌ల నాయకత్వంలో 300 మంది ఎంఎల్ఏ కూనంనేని, జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథంల సమక్షంలో శుక్రవారం రాత్రి సిపిఐలో చేరారు. వీరికి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఏ కూనంనేని మాట్లాడుతూ భారత దేశంలో ఏ పార్టీకి లేని చరిత్ర సిపిఐకి ఉన్నదన్నారు. భారత గడ్డపై వంద సంవత్సరాలు పూర్తి చేసుకొన్న పార్టీ సిపిఐదన్నారు. మరో వందేండ్లయినా ప్రజా మద్దతుతో మనగలుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండే పార్టీలనే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకొంటామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారు ప్రజా సంఘాలలో బాధ్యతలు తీసుకొని పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

**సిపిఐ సత్తా చాటాలి**

కార్పొరేషన్ ఎన్నికలలో సిపిఐ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించి కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగరేసి సిపిఐ సత్తా చాటాలని జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. ఖమ్మం పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా నాయకులు బండి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, పార్టీ, ప్రజా సంఘాల నాయకులు వి. జకరయ్య, లాల్‌పాషా, ఆదినారాయణ, కె.ఆదాం, అల్లి వెంకటేశ్వర్లు, పగిడిపల్లి సంజీవరావు, కె.రామారావు, తంతెనపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ సత్యం సమక్షంలో సిపిఐలో చేరిన సిపిఐ(ఎం) మాజీ కార్యదర్శి నరసింహ

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** సిపిఎం మండల మాజీ కార్యదర్శి, మాజీ ఎంపిటిసి గాలి నరసింహ పార్టీవీడి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సమక్షంలో నల్లగొండ మగ్దూమ్ భవన్‌లో సిపిఐలోకి చేరారు.పేద ప్రజల పక్షాన నిలబడి అలుపెరుగని పోరాటాలను శతాబ్ది కాలంగా చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇటీవల జరిగిన శాసన మండలి సభలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడం జరిగిందని గుర్తు చేశారు. సిపిఐ చేస్తున్న ప్రజా పోరాటాలను గుర్తించి,ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి నాయకులు,కార్యకర్తలు సిపిఐలో చేస్తున్నారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నకిరేకల్ నియోజకవర్గ బాధ్యులు లొడంగి శ్రవణ్ కుమార్,మండల కార్యదర్శి పెండ్యాల శంకర్,నాయకులు వెంపటి శ్రీనివాస్,ఎస్‌కె నజీర్,దేవేందర్ తదితరులు ఉన్నారు.



## శ్రమజీవుల పోరులో పుట్టిన పులిబిడ్డ భారత సిపిఐ

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు
ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** శ్రమజీవుల చెమటలోంచి పేదవాడి పిడికిలి లోంచి పుట్టింది భారతకమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్‌లు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో జరిగిన సివిల్ సప్లై ఎంప్లాయిస్, గోవిందాపురం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రజెండా పని అయిపోయిందని, ఎర్రజెండాలకు భవిష్యత్ లేదని కారు కూతలు కూసేవారికి ఇటీవల జరిగిన శ్రీలంక దేశంలో ఎన్నికల్లో వామపక్ష పార్టీలు బలపర్చిన అభ్యర్థులు ఘన విజయం సాధించారని, భారతదేశంలో గత వంద సంవత్సరాలుగా ప్రజా సంక్షేమమే ద్యేయంగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐది అని, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యైన పండించిన పంటకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కావాలని పోరాటం చేశామని అన్నారు. నేడు ఖమ్మం నగరంలో నిర్వహించనున్న చారిత్రక బహిరంగసభకు సూర్యాపేట జిల్లా ఏఐటియుసి ఆధ్వర్యంలో వేలాదిమంది కార్యకర్తలు పాల్గొంటారని, పార్టీతో పాటు ఎఐటియుసి కార్యకర్తలు ఇంటింటికి గడప గడపకు సిపిఐ సిద్ధంతాలను ప్రచారం చేస్తూ కవులు, కళాకారులు, రచయితలు, సమీకరించి అత్యధిక సంఖ్యలో కార్యకర్తలు ఖమ్మం నగరానికి తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు ఇందిరాల వెంకటేశ్వర్లు, పాపారావు, జెట్టి ప్రసాద్, ముదుసు పాపారావు, పాలడుగు రాజు, హమాలీ వర్కర్స్ సీనియర్ నాయకులు బెల్లంకొండ రామ్మూర్తి, జక్కుల మల్లయ్య, బాలాజీ, బాణావతి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఊరు, వాడ, పల్లె, పట్టణం సిపిఐ శతాబ్ది సభకు తరలిరావాలి

మహబూబ్‌నగర్ సిపిఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ పిలుపు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఖమ్మంలో నేడు జరుగుతున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను విజయవంతం చేయాలని సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్ పిలుపునిచ్చారు. రేపు 18న ఖమ్మం నగరంలో ముగింపు వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని ఈ బహిరంగా సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, 40 దేశాల నుండి కమ్యూనిస్టు అగ్ర నాయకులు ప్రతినిధులుగా హాజరు అవుతున్నారని. ఈ బహిరంగ సభకు ఊరు, వాడ, పల్లె, పట్టణం నుంచి కార్మికులు, కర్షకులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఎఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ మెట్టు మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సమాయ కార్యదర్శ శేఖర్, శ్రీను, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.






## లాటరీ ద్వారా మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** లాటరీ పద్ధతి ద్వారా జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డా. పి.శ్రీజ తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మున్సిపల్ వార్డుల్లో మహిళ రిజర్వేషన్ ఖరారు చేసే ప్రక్రియను శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మున్సిపల్ వార్డుల్లో మహిళలకు రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రతి మున్సిపాలిటీకి సంబంధించి వార్డుల వారీగా రిజర్వేషన్ స్థితిగతులను తెలుపుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సత్తుపల్లి, మధిర, ఏదులాపురం, వైరా, కల్లూరు మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను తెలుపుతూ లాటరీ పద్ధతి ద్వారా ఎస్సి, ఎస్టి, బిసి, జనరల్ వారీగా మహిళలకు కేటాయించే వార్డులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ.పద్మశ్రీ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, ఎలక్షన్ సెక్షన్ డిటి అన్సారీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల ద్వారా రైతులకు చేయూత

హార్వెస్టర్‌ను పంపిణీ చేసిన డిసిసిబి సిఇఒ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సహకార సంఘాల ద్వారా రైతులకు చేయూతనందిస్తున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె.వెంకట ఆదిత్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం సహకార సంఘం వద్ద దీర్ఘకాలిక రుణం క్రింద రైతు యాసా పుల్లయ్యకు హార్వెస్టర్‌ను డిసిసిబి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్.వెంకట ఆదిత్య చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి ఉపయోగపడే యంత్రాల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిఎం వసంతరావు, ఏజిఎం ప్రవీణ్, డిసిసిబి బ్యాంక్ మేనేజర్ పి.ఇందు, సొసైటీ మాజీ అధ్యక్షులు రావూరి సైదబాబు, మాజీ ఉపాధ్యక్షులు రావెళ్ల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జి.ప్రవీణ్‌కుమార్, సంఘం కార్యదర్శి ఐతగాని తిరుపతిరావు, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దండులా కదులుదాం

బస్సులు, ఆటోలు, ట్రాక్టర్లు ఏర్పాటు

సిపిఐ మండల కార్యదర్శి దూసరి పిలుపు

**ప్రజాపక్షం/చింతకాని :** ఆదివారం ఖమ్మంలో జరగనున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు భారీ ప్రదర్శన, బహిరంగ సభ చరిత్రలో సృష్టించనుందని చింతకాని మండలం నుంచి పార్టీ శ్రేణులు అభిమానులు భారీగా తరలిరావాలని సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు పిలుపునిచ్చారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టమని, మళ్లీ అలాంటి రోజు తిరిగి రాబోదన్నారు. జీవితాంతం గుర్తుండే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మధ్యాహ్నం జరిగే ప్రదర్శనకు కార్యకర్తలు సకాలంలో చేరుకోవాలన్నారు. చింతకాని మండలంల నుంచి ఇంటికొకరు చొప్పున తరలిరాలన్నారు. వందేళ్ల చరిత్ర గల కమ్యునిస్టు పార్టీ ఉద్యమానికి మరింత స్ఫూర్తినిచ్చేలా మండలం నుంచి కదంతొక్కాలని కోరారు.

## గోదావరి ప్రవాహాన్ని మళ్లించి ఇసుక దోపిడీ

డీ సిల్టింగ్ పేరుతో బహిరంగ అక్రమాలు



**ప్రజాపక్షం/చర్ల :** మండల పరిధిలోని కుదునూరు గ్రామ సమీపంలోని గోదావరి నదిలో డీసిల్టింగ్ పేరుతో జరుగుతున్న ఇసుక రవాణా చట్ట ఉల్లంఘనకు పాల్పడుతోంది. టిజి ఎండిసి ఆధ్వర్యంలో గిరిజన మహిళా సొసైటీ పేరిట చేస్తున్న బినామీ ఇసుక రేజింగ్ కాంట్రాక్టర్లు భారీ యంత్రాలతో గోదావరి నది సహజ ప్రవాహాన్ని మళ్లిస్తూ అక్రమ తవ్వకాలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఎల్లువెత్తుతున్నాయి. కుదునూరు ప్రాంతంలో గోదావరియ నదిలో డి సిల్టింగ్ పేరుతో ఇసుక రవాణా సాగుతోంది. అయితే తెలంగాణ రాష్ట్ర సాండ్ మైనింగ్ రూల్స్ 2015 ప్రకారం నది సహజ ప్రవాహానికి ఎటువంటి భంగం వాటిల్ల రాదనే నిబంధనలు ఉన్నాయి. అయినప్పటికీ నది ప్రవాహాన్ని మళ్లించి ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సబ్ స్టైనబుల్ సాండ్ మైనింగ్ మేనేజ్మెంట్ నిబంధనల 2016 ప్రకారం స్పష్టంగా నదీ ప్రవాహం ఉన్న స్థితిలోనే తవ్వకాలు జరపాలని ఉన్నది. కానీ గోదావరి నీటి మళ్లించి, ఎండబెట్టిన ప్రాంతాల్లో భారీ యంత్రాలతో ఇసుకను తోడేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, పర్యావరణశాఖ ఇచ్చే అనుమతుల్లో కూడా నది దిశను మార్చడం, ప్రవాహాన్ని అడ్డుకోవడం వంటివి చేయరాదని ఉంది. ఇలాంటి చర్యలు ఎన్విరానమెంటల్ ప్రొటక్షన్ యాక్ట్ 1986 ప్రకారం పర్యావరణ అనుమతుల ఉల్లంఘనగానే పరిగణించబడుతోంది. గోదావరి నది నీటి ప్రవాహాన్ని మళ్లించడం తప్పని అన్ని నిబంధనలు చెబుతున్నప్పటికీ రేజింగ్ కాంట్రాక్టర్లు,వాటి ఆగడాలకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక ర్యాంపుల ప్రారంభానికి ముందు డిస్టిక్ లెవల్ సాండ్ కమిటి కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిబంధనలను తుంగలో తొక్కిన అక్రమార్కులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి

సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:** ఖమ్మం నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని తొమ్మిదవ డివిజన్ రోటరీనగర్‌లో రూ.35 లక్షలతో నిర్మించనున్న సిసి డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని కొత్తగా చూసిన వారు చాలా మార్పులు వచ్చినట్లు గమనిస్తున్నారన్నారు. పారిశుధ్యం మెరుగైందని కార్పొరేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు కార్పొరేటర్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. అభివృద్ధి పనులు నాలుగు కాలాలు ఉపయోగపడేవిధంగా నాణ్యతతో నిర్మించాలన్నారు. నగరంలో ప్రారంభించిన రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు స్థానిక కార్పొరేటర్లు బాధ్యత తీసుకోవాలని, నష్టపోతున్న పేదలకు ప్రత్యామ్నాయంగా ఇండ్లు, స్థలాలు ఇస్తామని మంత్రి తెలిపారు. టిడిఆర్ విధానం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో కూడా అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. రోడ్డు విస్తరణ వల్ల వ్యాపారాలు పెరుగుతాయని మన ఆస్తులకు విలువ వస్తుందన్నారు. ఫుట్‌పాత్ పనులు పూర్తి చేసి లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలను ఒప్పించి విస్తరణ పనులు చేపట్టాలన్నారు. నగరంలో చేపట్టిన రోప్‌వే, వెలుగుమట్ల అర్బన్ పార్కు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. లకారం నిర్వహణలో లోపాలు ఉన్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని వీటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లపై ఆశలు గల్లంతు

నిరుత్సాహంతో రాజకీయ నేతలు

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాల్ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీల నేతలు నాయకులు పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. శనివారం ప్రకటించిన వైరా మున్సిపాలిటీ చైర్మన్, వార్డుల రిజర్వేషన్లు ప్రకటించిన అనంతరం ఒక్కసారిగా ఎవరైతే పోటీ చేయాలనుకున్నారో ఆ పార్టీల అభ్యర్థులు పూర్తిగా నిరాశ చెందారు. అనుకూలంగా వార్డుల రిజర్వేషన్లు వస్తాయని ఎదురుచూసిన వారికి నిరాశ తప్పలేదు. ఉదయం నుండి 11 గంటల వరకు రిజర్వేషన్లు ప్రకటించేంత వరకు ఉన్నవారు ఒక్కసారిగా రిజర్వేషన్ల వివరాలు చూసి 20 వార్డుల్లో ఎవరికి అనుకూలంగా రిజర్వేషన్ రాకపోవడంతో ఆయా రాజకీయ పార్టీ నాయకులు పూర్తిగా నిరాశ చెందారు. బిసి రిజర్వేషన్‌పై ఆశలు పెట్టుకున్న వారికి నిరాశ ఎదురైంది. వైరా మున్సిపాలిటీని జనరల్ మహిళ చైర్మన్ అభ్యర్థిగా రిజర్వేషన్ ఖరారు కావడం, 20 వార్డుల్లో రిజర్వేషన్లు ఎవరికి అనుకూలంగా రాకపోవడంతో రాజకీయ నాయకులు ఢీలాపడ్డారు.

# దారులన్నీ ఖ(గు)మ్మం వైపుకే

నేడు సిపిఐ శతవసంత ఉత్సవ ముగింపు సభ

జిల్లా నుండి 70వేల మంది

కవాతుకు సిద్ధమైన జనసేవాదళ్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ శతవసంత సంబురాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దారులన్నీ ఉద్యమం గుమ్మం ఖమ్మం వైపుకు చూస్తున్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే సిపిఐ శతవసంత ఉత్సవ ముగింపు సభ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి 15వేల వాహనాల్లో సుమారు 70వేల నుండి 1లక్ష మంది వరకు పయణమవుతున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండలం నుండి మొదలుకుని జిల్లా నలుమూలల నుండి వాహనాలు బయలుదేరనున్నాయి. ఇప్పటికే రూప్ మ్యాప్ సిద్ధమైంది. ఈ ఉత్సవానికి అన్ని వర్గాల, వయస్సుల ప్రజలు పెద్ద ఎత్తున తరులుతున్నారు. చిన్నాపెద్ద తేడా లేకుండా పేదలు, కష్టజీవుల జెండా ఎర్రజెండా పండుగకు సంబురంలో పాల్పంపులు చేసుకునేందుకు రెట్టింపు ఉత్సాహంతో కదలనున్నారు.

**కవాతుకు సిద్ధమైన జనసేవా దళ్ :** జనసేవాదళ్ రెడ్‌షర్ట్ వాలంటీర్లు, రెడ్ శారీ వాలంటీర్లు ఖమ్మం గుమ్మంలో కవాతు చేసేందుకు సిద్ధమయ్యారు. సుమారు పదివేల మందితో ఖమ్మం నగరంలో జరిగే కవాతు దేశ చరిత్రలో నిలిచిపోనుంది.సుమారు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ జరగనుంది. సుమారు 40 దేశాల నుండి ప్రతినిధులు తరలివస్తున్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.



## సిపిఐ శత ఉత్సవ సభకు దండులా కదలనున్న ప్రజానీకం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నేడు ఖమ్మంలో జరగనున్న సిపిఐ 100 ఏండ్ల శతవంసత ముగింపు బహిరంగ సభకు సత్తుపల్లి నియోజకవర్గం నుండి ప్రజానీకం దండులా కదలనున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ తెలిపారు. సత్తుపల్లి పట్టణం, మండలంతో పాటు వేంసూరు, పెనుబల్లి, తల్లాడ, కల్లూరు మండలాల నుండి సుమారు 4 నుండి 5 వేల మంది ఈ బహిరంగ సభకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. సిపిఐ 100 ఏళ్ళ సుదీర్ఘ ప్రస్థానంలో, అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించి ఎందరో అమరవీరుల రక్త తర్పణంతో అనేక చట్టాలు, హక్కులు సాధించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. అలనాటి అమరవీరుల స్ఫూర్తితో ఈ బహిరంగ సభ ఖమ్మంలో లక్షల మందితో జరుగుతుందని ఈ సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిలు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నట్టు దండు తెలిపారు. అంతే కాకుండా 40 దేశాల ప్రతినిధులు హాజరై సౌహార్ద ఉపన్యాసం చేస్తారన్నారు. నేడు దేశంలో జరుగుతున్న మోడీ ప్రభుత్వం ఆవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రానున్న కాలంలో ప్రజా పోరాటాలను సిద్ధం చేసేందుకు ఈ బహిరంగ సభ దోహదం చేస్తుందన్నారు. దేశం నలుమూలల నుంచి కమ్యూనిస్టు యోధులు అనేకమంది హాజరవుతున్నారని ఈ బహిరంగ సభకు ప్రజల పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తడికమళ్ళ యోబు, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, పట్టణ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, పట్టణ కమిటీ సభ్యులు కోలేటి వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు తాటి వీరభద్రం, వెంకన్న, రాము, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బెలూన్లు ఎగురవేసిన సిపిఐ శ్రేణులు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంతాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో జరిగే ప్రజా ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం సిపిఐ శాఖ ఆధ్వర్యంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ శ్రేణులు బెలూన్లు ఎగురవేశారు. ఈ సందర్భంగా జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదివారం ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ ప్రజా ప్రదర్శనతో పాటు బహిరంగ సభ ఎస్ఆర్‌అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సిపిఐ సానుభూతిపరులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. వందేళ్ల చరిత్రలో సిపిఐ అనేక పోరాటాలు సాగించిందన్నారు. నాటి స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు పలు పోరాటాలకు నాయకత్వం వహించి ప్రజల పక్షాన నిలిచిందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో రాబోయే రోజుల్లో బహుముఖ పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, వన్‌టౌన్ ఏరియా కార్యదర్శి వరదా నర్సింహారావు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు రావుల హన్మంతరావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మాడుగుల నాగేశ్వరరావు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం కార్పొరేషన్ రిజర్వేషన్ ఖరారు : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికల్లో భాగంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్, ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం తెలిపారు. ఈ మేరకు ఐడిఓసి కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షలో డ్రా పద్ధతిలో రిజర్వేషన్‌ను కేటాయించామన్నారు. **కొత్తగూడెం కార్పోరేషన్ రిజర్వేషన్ :** 60 వార్డులకు గానూ ఎస్‌టి11, ఎస్‌సి12, బిసి7, సాధారణ మహిళలకు30, అన్ రిజర్వ్డ కేటగిరీ 14 కేటాయించారు. అదేవిధంగా ఇల్లెందు మున్సిపాలిటీకి సంబంధించి 24 వార్డులకు గానూ ఎస్‌టి 2, ఎస్‌సి 4,బిసి 6, సాధారణ మహిళలు 6, రిజర్వ్ కానివి 6 కేటాయింపు కాగా, అశ్వారావుపేట మున్సిపాలిటీకి సంబంధించి 22 వార్డులకు గానూ ఎస్టి 3, ఎస్‌సి 4,బిసి4, సాధారణ మహిళలు6, రిజర్వ్ కానివి 5 డ్రా పద్ధతిలో కేటాయింపు జరిగిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం బిసి డెడికేషన్ కమీషన్ నివేదికను అనుసరించి రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియ జరిగినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, మున్సిపల్ కమీషనర్లు,, అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఏదులాపురం మున్సిపాలిటీ రిజర్వేషన్లు ఖరారు

చైర్మన్‌గా ఎస్‌సి మహిళకు కేటాయింపు

ఎస్‌సికి7, ఎస్‌టికి3, బిసికి6, జనరల్‌కు 16

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎప్పుడెప్పుడా...అని ఎదురుచూస్తున్న ఏదులాపురంమున్సిపాలిటీ రిజర్వేషన్లు శనివారం ఖరారయ్యాయి. 32వార్డులకు గాను 7ఎస్‌సీ, 3 ఎస్‌టీ, 6 బిసి, 16జనరల్ స్థానాలతో పాటు ఎస్‌సీ మహిళను చైర్మన్‌గా కేటాయించారు. 1వ వార్డు ఎస్‌సీ, 2వ వార్డు జనరల్(మహిళ), 3వ వార్డు బిసి (మహిళ), 4వ వార్డు జనరల్(మహిళ), 5వ వార్డు జనరల్, 6వ వార్డు జనరల్(మహిళ), 7వ వార్డు జనరల్, 8వ వార్డు బిసి(మహిళ), 9వ వార్డు ఎస్‌సీ, 10వ వార్డు ఎస్‌సీ, 12వ వార్డు బిసి, 13వ వార్డు బిసి, 14 జనరల్, 15వ వార్డు జనరల్(మహిళ), 16 ఎస్‌సి, 17 ఎస్‌సీ(మహిళ), 18వ వార్డు జనరల్(మహిళ), 19వ వార్డు బిసి(మహిళ), 20 బిసి, 21వ వార్డు ఎస్‌సీ(మహిళ), 22వ వార్డు జనరల్, 23వ వార్డు ఎస్‌సీ(మహిళ), 24వ వార్డు ఎస్‌టీ, 25వ వార్డు జనరల్, 26వ వార్డు ఎస్‌టీ(మహిళ), 27వ వార్డు ఎస్‌టి, 28వ వార్డు జనరల్, 29వ వార్డు జనరల్(మహిళ), 30వ వార్డు జనరల్(మహిళ), 31వ వార్డు జనరల్(మహిళ), 32వ వార్డు జనరల్గా అధికారులు కేటాయించారు. కాగా ఇప్పుడు చైర్మన్‌గా జనరల్ మహిళను కేటాయించడంపై తొలి పీఠాన్ని ఎవరు అధిరోహిస్తారనే ఉత్కంఠ అప్పుడే ప్రారంభమయ్యింది. అలాగే వచ్చిన రిజర్వేషన్ల ప్రకారం పోటీకి రాజకీయ పార్టీ సిద్ధమవుతున్నాయి. పోటీ చేయదలుచుకున్న వారు రిజర్వేషన్లతో కొంత అసంతృప్తికి లోనయ్యారు.



## సర్పంచ్‌లను సన్మానం

**ప్రజాపక్షం/కారేపల్లి:** సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్థానిక సర్పంచ్ మెదరి వీరప్రతాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి వివిధ గ్రామాల సర్పంచులు శనివారం హాజరయ్యారు. ఈకార్యక్రమానికి గిరిజన నాయకుడు అజ్మీరా వీరన్న హాజరయ్యారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులను అజ్మీర వీరన్న శాలువతో సన్మానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని తెలిపారు. ప్రభుత్వానికి సంబంధించిన పథకాలను పేదలకు చేరే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి సర్పంచ్ మేదరిన వీరప్రతాప్, భాగ్యనగత్ తండ సర్పంచ్ బాణోత్ హిరీలాల్, చిన్నమడెంపల్లి సర్పంచ్ బానోత్ పద్మా రూప్లనాయక్, పాత కమలాపురం సర్పంచ్ తేజావత్ బాబురావు, మాజీ ఉప సర్పంచ్ గౌస్, చంద్ర నాయక్, గంగరబోయిన మురళీ, క్రికెట్ కెప్టెన్లు తెలకలపల్లి శ్రీను, గుగులోత్ రాంబాబు, నాగి, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్కంఠకు 'తెర'




పురపోరు డివిజన్లు, వార్డుల రిజర్వేషన్లు ఖరారు

ఆశావహుల్లో అసంతృప్తి

కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ స్థానం ఎస్‌టి జనరల్

ఇల్లెందు మున్సిపల్ చైర్ పర్సన్ స్థానం బిసి మహిళ

అశ్వారావుపేట జనరల్ మహిళ

పురపోరుకు సై అంటున్న రాజకీయ పక్షాలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ఎట్టకేలకు పురపోరు రిజర్వేషన్ల ఉత్కంఠతకు తెర పడింది. ఇందుకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. కొత్తగూడెం కార్పోరేషన్‌కు తొలిసారి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ రిజర్వేషన్ల వ్యవహారం కేటాయింపులు కొందరికి సంతృప్తిని, మరి కొందరికి అసంతృప్తిని మిగిల్చాయి. డివిజన్లు ఏర్పాటైనప్పటికీ తమకు అనుకూలంగా రిజర్వేషన్ వస్తుందని భావించిన వారి ఆశ నిరాశైంది. ఇదిలా ఉండగా తొలి మేయర్ అభ్యర్థిగా ఎస్‌టి జనరల్ కానుంది. ఇల్లెందు మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా బిసి మహిళ, తొలిసారిగా ఎన్నికలు జరగనున్న అశ్వారావుపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా జనరల్ మహిళకు కేటాయింపు అయింది. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. దీనికి సంబంధించి కలెక్టర్ జితేష్ వి పాటిల్ కలెక్టరేట్‌లో శనివారం డ్రా నిర్వహించారు. ఈ డివిజన్లలో రిజర్వేషన్‌ను అనుసరించి ఆయా రాజకీయ పార్టీలు బలబాలలను అంచనా వేసుకుంటున్నాయి. గత గ్రామపంచాయితీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు దక్కించుకోలేక పోయిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే పెద్ద ఎత్తున పావులు కదుపుతోంది. డివిజన్ల వారీగా తమకు అనుకూలమైన అభ్యర్థులకు రిజర్వేషన్ దక్కేలా లోపాయికారి పావులు కదిపినట్లు పుకార్లు వినవస్తున్నాయి. ఇదిలా ఉండగా గత గ్రామపంచాయితీ ఎన్నికల్లో మేజర్ గ్రామ పంచాయితీలను సైతం కైవసం చేసుకున్న సిపిఐ ఈ ఎన్నికలకు సమాయత్తం అవుతోంది. కాగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు కుదిరే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక బిఆర్ఎస్, సిపిఎం పార్టీలు సైతం తమ ఆదిపత్యం కోసం ఆయాడివిజన్లలో వారి అభ్యర్థులను పోటీకి దింపేందుకు సిద్ధమవుతోంది.

**కొత్తగూడెం మేయర్ స్థానం ఎస్‌టి జనరల్ :** తొలిసారిగా కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికలకు సంబంధించి మేయర్ స్థానం ఎస్‌టి జనరల్‌కు రిజర్వేషన్ కావడంతో ఆశా వాహుల ఊహలు తారుమారు అయ్యాయి. తమకు మేయర్ స్థానం దక్కుతుందని అగ్రనేతల ప్రసన్నత కోసం పాకులాడిన ద్వితీయ శ్రేణి నేతలు ఇప్పుడు తలలు పట్టుకున్నారు. ఇప్పటికే కొందరు భారీ ఎత్తున ఖర్చు చేసి వాతావరణాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించారు. కానీ మేయర్ స్థానం రిజర్వేషన్ కూడా తారుమారు కావడంతో వారి ఆశలు నిరాశలుగా మారాయి.

**ఇల్లెందు, అశ్వారావుపేట :** జిల్లాలో ఒకప్పుడు నాలుగు మున్సిపాలిటీలు ఉండేవి. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు కార్పోరేషన్‌గా మారింది. నూతనంగహా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీతో పాటు ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. మణుగూరు మున్సిపాలిటీ అయిన నాటి నుండి సుమారు 20 ఏళ్లుగా ఎన్నికలే లేవు. కోర్టు చిక్కులతో ఈ మున్సిపాలిటీ కథ ఎన్నికలు లేకుండానే సాగుతోంది. ఇక మిగిలింది కేవలం ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీ మాత్రమే ఉన్నాయి. ఇల్లెందులో 24 వార్డుల రిజర్వేషన్లు ఖరారు కాగా, ఈ మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా బిసి మహిళకు కేటాయించారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో 22 వార్డులు ఉండగా, చైర్ పర్సన్ స్థానం జనరల్ మహిళకు కేటాయించారు.

**పురపోరుకు సై :** ఎట్టకేలకు కార్పోరేషన్ డివిజన్లు, మున్సిపల్ వార్డుల రిజర్వేషన్‌లు ఖరారు కావడంతో ఆయా రాజకీయ పార్టీలు పురపోరుకు సై అంటున్నాయి. ఇప్పటికే ఎన్నికల వాతావరణం కానవస్తోంది. గత కొంతకాలంగా ఆయా డివిజన్లు, వార్డుల్లో తమ పెత్తనమే కొనసాగాలంటూ చక్రం తిప్పుతున్న నాయకులు ఉన్నారు. గత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఎదురైన భంగపాటును సరిదిద్దుకునేందుకు పావులు కదుపుతున్నారు. సరైన అభ్యర్థులను ఎంపిక చేసి విజయాలను కైవం చేసుకునేందుకు ఇప్పటి నుండే కసరత్తు మొదలు పెట్టడంతో ఆయా డివిజన్లు, వార్డుల్లో పురపోరు సందడి మొదలైంది.

**కొత్తగూడెం కార్పోరేషన్ రిజర్వేషన్ :** 60 వార్డులకు గానూ ఎస్‌టి11, ఎస్‌సి12, బిసి7, సాధారణ మహిళలకు30, అన్ రిజర్వ్డ కేటగిరీ 14 కేటాయించారు.

ఇల్లెందులో మున్సిపాలిటీ : 24 వార్డులకు గానూ ఎస్‌టి 2, ఎస్‌సి 4,బిసి 6, సాధారణ మహిళలు 6, రిజర్వ్ కానివి 6 (చైర్‌పర్సన్ బిసి మహిళ)

అశ్వారావుపేట మున్సిపాలిటీ రిజర్వేషన్ : 22 వార్డులకు గానూ ఎస్టి 3, ఎస్‌సి 4,బిసి4, సాధారణ మహిళలు6, రిజర్వ్ కానివి 5 (జనరల్ మహిళ)

## మద్యపానానికి, మత్తుకు బానిసలు కావొద్దు: ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజలు మద్యపానానికి, ధూమపానానికి, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజు నగర్ లో శనివారం సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ నేతృత్వంలో డాక్టర్ అరికిల్ల మనోహర్ శైలజ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డి అడిక్షన్ (మాదకద్రవ్యములో మద్యపాన వ్యసన విముక్తి) కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు మద్యపానానికి, మత్తుకు బానిసలు కావద్దని మత్తు జీవితాలను చిన్న భిన్నం చేస్తుందని తెలిపారు. అలాంటివారు ఈడి అడిక్షన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని తమ వ్యసనాలను అదుపులో పెట్టుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రాజబాపు, డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కొమురయ్య, స్థానిక నాయకులు అప్పం కిషన్, రామ్ నేను రవీందర్ తోట రంజిత్, సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ సంస్థ మేనేజర్ సుంకరి సునీల్, డాక్టర్ టి.వినోద్, డాక్టర్ అక్షయ్, కోఆర్డినేటర్స్ డి.రాజయ్య, రమేష్, సైకాలజిస్ట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్లానిటోరియం పునరుద్ధరణ పనులను త్వరగా పూర్తి: మేయర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ప్లానిటోరియం పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ఆవరణలో గల ప్లానిటోరియం అభివృద్ధి పనులను కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పనుల పురోగతి స్థితి గతులను మేయర్ కమిషనర్‌లకు అధికారులు వివరిస్తూ మొత్తం పనులు చివరి దశకు చేరుకున్నాయని, ఇంటీరియల్ పనులు పూర్తి అయ్యాయని సివిల్ పనులు కూడా పూర్తి కావొచ్చాయని, తెలుపగా మేయర్ మాట్లాడుతూ మిగతా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవి కుమార్, డిఈలు రాజ్ కుమార్, రాగి శ్రీకాంత్, ఏఈలు సంతోష్, కుమార్, నరేష్, పాల్గొన్నారు.

## ప్రతీవ్యక్తి సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోవడమే 'అరైవ్—అలైవ్'




**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** తెలంగాణ రాష్ట్ర గౌరవనీయ డీజీపీ సూచనల మేరకు తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠాత్మకమైన అరైవ్ అలైవ్ జర్నీ గమ్యస్థానం వద్ద సేఫ్ అండ్ సెక్యూర్ అరైవల్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ రోజు జిల్లా ఎస్పి శ్రీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ మార్గదర్శకత్వంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పస్రా తాజుద్దీన్ కంపెనీలు కర్మాగారాల సమీపంలో డ్రైవర్లు కార్మికులకు రోడ్డు భద్రతపై విస్తృత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేటి సమాజంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనలను విస్మరించడమేనని పోలీసు అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు చిన్న లప్పులు కూడా ప్రాణాంతకం కావచ్చని వారు అదదరికీ గుర్తు చేశారు రోడ్డుపై ప్రయాణించే ప్రతి వ్యక్తి సురక్షితంగా తమ గమ్యస్థానాన్ని చేరుకోవడమే అరైవ్ అలైవ్ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అని వారు స్పష్టం చేశారు ప్రతి వ్యక్తి జీవితం చాలా విలువైనదని వారు నొక్కి చెప్పారు డ్రైవర్లు పారిశ్రామిక కార్మికులు ట్రాఫిక్ నాయమాలు వాహన ఫిట్‌నెస్ నిబంధనలు వేగ పరిమితులు డ్రైవర్ విశ్రాంతి నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఇతరులకు ఆదర్శంగా ఉండాలని కోరారు ట్రాఫిక్ నియమాలను అమలు చేయడం పోలీసుల బాధ్యత కూడాఅని అధికారులు సూచించారు మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టాలని వారు ప్రత్యేకంగా సంకల్పించారు జిల్లా పోలీసులు ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించడానికి నిరంతరం కృషి చేస్తారని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సమ్మక్క సారక్క ఆటో యూనియన్ డ్రైవర్లు స్థానిక నివాసితులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ చట్టాలను వెంటనే రద్దు చేయాలి: వీరయ్య



**ప్రజాపక్షం/తొర్రూరు :** మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్, వి.బిజిరామ్‌జి విద్యుత్ సవరణ చట్టం కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుగు గునిగంటి రాజన్న, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సమ్మెట రాజమౌళి డిమాండ్ చేశారు. శనివారం లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికవర్గ హక్కులను కాలరాస్తూ, ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తూ, విద్యుత్ సవరణ చట్టం పేరుతో రైతులను, ప్రజలను మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వంపై సమరశీల పోరాటాల్లో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభమైన జీపు జాత సాయంత్రం తొర్రూరుకు చేరుకుంది. శనివారం తొర్రూరు పట్టణానికి చేరుకున్న జీపు జాత ర్యాలీ తొర్రూరు పట్టణ కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ రైతు సంఘం తొర్రూరు మండల కన్వీనర్లు ఎండి.యాకూబ్, జమ్ముల శ్రీనివాస్, కొత్త వెంకటరెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అలువాల వీరయ్య, గునిగంటి రాజన్న, సమ్మెట రాజమౌళి లు సంయుక్తంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు నల్లపు సుధాకర్, సీఐటీయూ నాయకులు బొల్లం అశోక్, కొమ్మనబోయిన యాకయ్య, మార్క సాంబయ్య, రైతు సంఘం నాయకులు జన్నపురెడ్డి సోమిరెడ్డి, గుద్దేటి సాయిమల్లు, జితేందర్‌రెడ్డి, ధరావత్ యాకన్న, తిమ్మిడి రవి, ఎండి.అమీర్, కొండ రాము, జి.సాయిలు, షమీనా, అమీనా, రాధా, యాకమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు

ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యం

పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి




**ప్రజాపక్షం/పరకాల:** పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాలటౌన్, పరకాల, నడికూడ మండలాలకు చెందిన 123 మంది లబ్ధిదారులకు రూ. 1,23,14,268 విలువ గల కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం కళ్యాణ లక్ష్మి ద్వారా 2576 మందికి రూ. 25,78,98,816 కోట్ల విలువ గల చెక్కులను పంపిణీ చేశామని అన్నారు. పార్టీలకు అతీతంగా సం క్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడబిడ్డల పెళ్ళికి వరంగా మారిందన్నారు. పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని అన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సీఎం పేద వర్గాల ప్రజలకు వరం లాంటిదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి మంజూరునగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భూపాలపల్లి, గణపురం మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 77 మంది లబ్ధిదారులకు రూ.22,59,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే జీఎస్సార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, పేదలు, నిరుపేదల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని, భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రతీ వాహన దారుడూ జాగ్రత్తలు పాటించాలి: డిసిపి

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** ప్రతి వాహనదారుడు జీవితం చాలా విలువైనదిగా భావిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సెంట్రల్ జోన్ డీసీపీ తెలిపారు.రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్ నెస్" కాజీపేట పోలీసుల ఆధ్వర్యంలో కాజీపేట లోని నర్సింగ్ కళాశాల లో రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా కల్పించే విధంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల కారణంగా పెద్ద సంఖ్యలో యువతను కోల్పోతున్నామని, ఇందుకు కారణం యువత నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం కారణమని. రహదారి భద్రత విషయంలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఉత్తమమైన వ్యాసం వ్రాసిన విద్యార్థులకు డీసీపీ బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, కాజీపేట ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్ వెంకన్నతో పాటు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు దగ్గరగా న్యాయ సేవలు

త్వరలో వర్ధన్నపేటలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు

పాత మున్సిపాలిటీ భవనాన్ని పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ, ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని పాత మున్సిపాలిటీ భవనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆర్. నాగరాజు పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసిన మున్సిఫ్ కోర్టును తాత్కాలికంగా ఈ భవనంలో ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా, సకాలంలో అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న చిన్న న్యాయ సమస్యల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే న్యాయం పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.న్యాయ వ్యవస్థ ప్రజలకు మరింత దగ్గర కావడం ప్రజాస్వామ్యానికి బలమని, మున్సిఫ్ కోర్టు ఏర్పాటు వర్ధన్నపేట ప్రాంత అభివృద్ధిలో మరో కీలక ముందడుగుగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ ప్రక్రియకు సహకరించిన జిల్లా న్యాయ విభాగ అధికారులు, సంబంధిత ప్రభుత్వ అధికారులకు ఎమ్మెల్యే నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, టౌన్ పార్టీ అధ్యక్షుడు మైస సురేష్, కాంగ్రెస్ నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుధీర్, పోలీస్ ఎసిబి నర్సయ్య, ఎస్సై సాయిబాబా తో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూపాలపల్లి మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ఖరారు

కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు సంబంధించిన రిజర్వే షన్ల ప్రక్రియను పారదర్శికంగా రిజర్వేషన్ల నో ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడీఓసి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 వార్డులకు గాను ఎస్టీ 2, ఎస్సి 6, బిసి 7, అన్ రిజర్వ్ 15 స్థానాలు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ఎస్టీ వార్డుల్లో 1 మహిళకు, ఎస్సి వార్డుల్లో 3 మహిళలకు, బిసి కేటాయించిన 7 స్థానాల్లో 3 మహిళలకు, అన్ రిజర్వ్ 15 స్థానాల్లో 8 మహిళలకు రిజర్వేషన్లు కేటాయించినట్లు వివరించారు. రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీడియో గ్రఫీ మధ్య లాటరీ పద్ధతిలో నిర్వహించామని, ఈ ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా సాగిందని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. భూపాలపల్లి మున్సిపాలిటీ 30 వా ర్డుల వారిగా రిజర్వేషన్లు : 1వ వార్డు జనరల్ మహిళ,2వ వార్డు బీసీ జనరల్, 3వ వార్డు జనరల్, 4వ వార్డు బీసీ జనరల్,5వ వార్డుఎస్సీ జనరల్, 6వ వార్డుబీసీ మహిళ, 7వ వార్డుజనరల్ మహిళ,8వ వార్డుఎస్సీ మహిళ 9వ వార్డు జనరల్, 10వ వార్డు జనరల్ మహిళ,11వ వార్డు జనరల్, 12వ వార్డు జనరల్, 13వ వార్డు జనరల్, 14వ వార్డు జనరల్ మహిళ, 15వ వార్డు ఎస్సీ జనరల్, 16వ వార్డు జనరల్ మహిళ, 17వ వార్డు జనరల్ మహిళ, 18వ వార్డు బీసీ జనరల్, 19వ వార్డు జనరల్, 20వ వార్డు ఎస్టీ జనరల్, 21వ వార్డు ఎస్టి మహిళ, 22వ వార్డు బీసీ మహిళ, 23వ వార్డు జనరల్ మహిళ 24వ వార్డు బీసీ మహిళ, 25వ వార్డు జనరల్ మహిళ, 26వ వార్డు ఎస్సీ మహిళ, 27వ వార్డు ఎస్సీ మహిళ, 28వ వార్డు ఎస్సీ జనరల్, 29వ వార్డు జనరల్, 30వ వార్డు బీసీ జనరల్ గా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన రైల్వే సంఘ్ నేతలు

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాజీపేట రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంఘ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘ్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ నెల 20వ తేదీన రైల్వే విశ్రాంత సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వార్షికోత్సవ వేడుకలు, నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యేను వారు ఆహ్వానించారు. దీనికి సంబంధించిన అధికారిక ఆహ్వాన పత్రికను కూడా అందజేశారు.సంఘ్ నాయకుల విన్నపానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. రైల్వే విశ్రాంత ఉద్యోగుల సమస్యలు, సంక్షేమం పట్ల ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్,రైల్వే సంఘ్ ముఖ్య నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## పరకాల మున్సిపల్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ల డ్రా తీసిన కలెక్టర్ స్నేహ శబరీష్

**ప్రజాపక్షం/హనుమకొండ :** పరకాల మున్సిపల్ కు సంబంధించిన 22 వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు లో పరకాల మున్సిపల్ పరిధిలోని 22 వార్డు స్థానాలకు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ పద్ధతిన రిజర్వేషన్లకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ డ్రా తీశారు. డ్రా తీసిన వార్డుల రిజర్వేషన జాబితాను కలెక్టర్ ప్రకటించారు. 1వ వార్డు అన్ రిజర్వ్, 2వ వార్డు జనరల్ మహిళ, 3వ వార్డు బీసీ మహిళ, 4వ వార్డు ఎస్సీ మహిళ, 5వ వార్డు బీసీ మహిళ, 6వ వార్డు జనరల్ మహిళ, 7వ వార్డు అన్ రిజర్వుడ్, వార్డు అన్ రిజర్వుడ్, 9వ వార్డు అన్ రిజర్వుడ్, 10వ వార్డు జనరల్ మహిళ, 11 వ వార్డు ఎస్సీ జనరల్, 12వ వార్డు జనరల్ మహిళ, 13వ వార్డు జనరల్ మహిళ, 14వ జనరల్ మహిళ, 15వ వార్డు బీసీ జనరల్, 16వ వార్డు బీసీ జనరల్, 17వ వార్డు ఎస్సీ మహిళా, 18వ వార్డు జనరల్ మహిళ, 19వ వార్డు ఎస్సీ జనరల్, 20వ వార్డు ఎస్టీ జనరల్, 21వ వార్డు ఎస్సీ జనరల్, 22వ వార్డు బీసీ మహిళ కు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి.ఈ సందర్భంగా పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య గత రిజర్వేషన్లు, ప్రస్తుత రిజర్వేషన్ల కేటాయింపు గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నెమురుగొమ్ముల రవి, పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ.వి. శ్రీనివాసరావు, ఆర్పి జయంత్ లాల్, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మ ణ్, రజనీకాంత్, ప్రవీణ్ కుమార్, సయ్యద్ ఫైజుల్లా, రాజు, వెంకట్, నేహాల్, శ్రీనివాస్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.



## అధికారులు బాధ్యతతో పని చేయాలి

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/తొర్రూరు :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పని చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆదేశించారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తొర్రూరు మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులతో విస్తృతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తొర్రూరు పట్టణ అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, విద్యుత్ సరఫరాలో లోపాలు, తరుచుగా జరుగుతున్న విద్యుత్ అంతరాయాలు వంటి అంశాలపై ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అధికారులతో చర్చించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, మురుగునీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన పనులు, ప్రగతి వివరాలను ఎమ్మెల్యేకు వివరించగా పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించరాదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి చేరేలా చూడాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ బిసి జనరల్, స్టేషన్‌ఘనపూర్ ఎస్‌సి జనరల్

# మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు



భారీగా వార్డుల చేర్పులు మార్పులు

తక్కువ ఓట్లున్న వార్డుల్లో ఇతరుల రిజర్వేషన్

**ప్రజాపక్షం /జనగామ:** మున్సిపాల్టీ ఎన్నికలకు కసరత్తు మొదలైంది. రిజర్వేషన్లు ప్రకటించారు. జనగామ మున్సిపల్ ఛైర్మన్ బిసి జనరల్ కాగా, స్టేషన్‌ఘనపూర్ ఎస్సీ జనరల్‌కు కేటాయించబడింది. ఇక వార్డు రిజర్వేషన్లు సైతం పూర్తయ్యాయి. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ శనివారం కలెక్టరేట్‌లో ఎన్నింటిని ఎన్నికల నిబంధనల ప్రకారం మరికొన్నింటిన డ్రా పద్ధతిలో ప్రకటించారు. జనగామలో 30 వార్డులు ఉండగా స్టేషన్‌ఘనపూర్‌లో 18 వార్డులు ఉన్నాయి. రిజర్వేషన్లు ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. జనగామ జిల్లాలో రెండు మున్సిపాల్టీలు ఉండగా వాటని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు పోటీ పడుతున్నాయి. జనగామ మున్సిపల్టీ పరిధిలో 30 వార్డులు ఉండగా ఎస్టీకి ఒక వార్డు కేటాయించారు. అది కూడా ఒకటి వార్డు. ఇఇక ఎస్సీ ఐదు వార్డులు కేటాయించగా 2,5,8,10,17 వార్డులు. అందులో జనరల్‌కు 2,5,17 వార్డులు కేటాయించగా మహిళలకు 8,10 వార్డులు కేటాయించారు. ఇక బిసిలకు తొమ్మిది వార్డులు కేటాయించగా వాటిలో 3,4,6,7,18,20,25.26,29 వార్డులో ఉన్నాయి. వాటిలో జనరల్‌కు 6,18,25,26,29 వార్డులు కేటాయించగా మహిళలకు 3,4,7,20 వార్డులు కేటాయించారు. ఇక మహిళ కేటగిరలో తొమ్మిది వార్డులు కాగా అవి 9,11,12,16,19,21,22,24,28 వార్డులు. వీటిలో మహిళలు మాత్రమే పోటీ చేయాలి. అన్ రిజర్వ్‌డ్ వార్డులు ఆరు కాగా వాటిలో 13,14,15,23,27,30 వార్డులు ఉన్నాయి. ఇలా జనగామలో ఎస్టీలకు 1, ఎస్సీలకు 05, బిసిలకు 09, జనరల్ మహిళలకు 09, జనరల్ కేటగిరిలో 06 వార్డులు కేటాయించారు. స్టేషన్‌ఘనపూర్‌లో 18 వార్డులు ఉండగా వాటికి జనగామలోని కలెక్టరేట్‌లోని రిజర్వేషన్లు కేటాయించారు. ఛైర్మన్ ఎస్సీ జనరల్ కాగా వార్డు రిజర్వేషన్లు ఎస్సీలకు 01, ఎస్సీలకు 05, బిసిలకు 03, జనరల్ మహిళకు 06, జనరల్‌కు 03 వార్డులు కేటాయించారు. ఎస్టీకి ఒక వార్డు కేటాయించగా ఎస్టీ ఓటర్ల ఆదారంగా 16వ వార్డు కేటాయించారు. ఎస్సీలకు ఐదు వార్డులు కాగా 1,23,10,13 వార్డులు కేటాయించారు. వాటిలో మహిళలకు 3,10 వార్డులు కాగా జనరల్‌కు 1,2,13 వార్డులు కేటాయించారు. బిసిలకు 3 వార్డులు కాగా 4,7,18 వార్డులు కేటాయించారు. వాటిలో మహిళకు 7వ వార్డులు, జనరల్‌కు 4,18వ వార్డు కేటాయించారు. మహిళలకు ఆరు వార్డులు కేటాయించగా వాటిలో 5,11,12,14,15,17 వార్డులు ఉన్నాయి. జనరల్‌లో మూడు వార్డులు కేటాయించగా వాటిలో 6,8,9వార్డులు ఉన్నాయి. ఇలా జనగామ స్టేషన్‌ఘనపూర్ ఛైర్మన్, వార్డుల రిజర్వేషన్లు పూర్తయ్యాయి. **రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల మేరకు వార్డుల రిజర్వేషన్లు : కలెక్టర్**

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల మేరకే జనగామ, స్టేషన్‌ఘనపూర్ మున్సిపాల్టీల వార్డుల రిజర్వేషన్లు ఖరార్ చేయడం జరిగిందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అన్ని రాజకీయ పార్టీ సమక్షంలో వార్డుల రిజర్వేషన్లు ఖరార్ చేశారు. జనగామ మున్సిపాల్టిలోని 30 వార్డులు, స్టేషన్‌ఘనపూర్‌లోని 18 వార్డులకు రిజర్వేషన్లు ఖరార్ చేశామన్నారు. బిసిల డెడికేషన్ కమిషన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, లది 2011 జనాభ లెక్కల ప్రకారం, మహిళా రిజర్వేషన్లు జీవో 9 ప్రకారం, వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతిలో కేటాయించడం జరిగిందన్నారు. ఈ రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, ఆర్‌డిఓ గోపిరాం, వెంకన్నతో పాటు మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
ఆదివారం
18-01-2026
www.prajapaksham.in

“సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ వేదిక వెనుక 70 అడుగుల ఎల్ఇడి స్క్రీన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రసంగాల ప్రారంభానికి ముందు వందేళ్ళ సిపిఐ చరిత్రలో స్వాతంత్రోద్యమం మొదలు, వర్తమానం వరకు ముఖ్య ఘట్టాలను ప్రదర్శించనున్నారు. ఇక వేదికపై 70 మంది ఆసీనులయ్యేందుకు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులతో పాటు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులను ఆహ్వానిస్తారు. వేదికపై కుడి వైపు సాంస్కృతిక ప్రదర్శనల కోసం ప్రత్యేక స్టేజ్‌ని వేశారు. దానికి తెలంగాణ సాంస్కృతిక కళావేదిక అని నామకరణం చేశారు.”

### దివ్యాంగుల సంక్షేమానికి

# ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయం

**వివాహ ప్రోత్సాహక నగదు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంపు**

**అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దివ్యాంగుల జీవన భద్రత, సామాజిక గౌరవం, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల మధ్య జరిగే వివాహాలకు అందజేస్తున్న వివాహ ప్రోత్సాహక నగదును రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచుతూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం మహిళలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ శాఖ ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆర్థిక సహాయం భార్య పేరున నేరుగా జమ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ నిర్ణయంతో వికలాంగ దంపతులకు వివాహానంతరం ఎదురయ్యే ఆర్థిక ఒత్తిళ్లు తగ్గడంతో పాటు, నివాసం, వైద్య ఖర్చులు, జీవనోపాధి ఏర్పాట్లకు గణనీయమైన సహాయం అందనుంది. ప్రత్యేక అవసరాలు ఉన్న వికలాంగ దంపతులు గౌరవప్రదమైన జీవితం గడపడానికి ఈ నగదు ప్రోత్సాహకం కీలకంగా మారనుంది.

#### వికలాంగుల జీవితాల్లో భద్రత

దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల జీవితాల్లో భద్రత, స్థిరత్వం తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వాల కాలంలో కేవలం పరిమిత సహాయం మాత్రమే అందిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగుల సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి నిర్ణయాలు తీసుకుందన్నారు. దివ్యాంగుల మధ్య వివాహాలను ప్రోత్సహించడం ద్వారా సామాజిక అంగీకారం పెరుగుతుందని, వివక్ష తగ్గుతుందని, అలాగే కుటుంబ వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి వివరించారు. ఈ పథకం ద్వారా దివ్యాంగుల ఆత్మవిశ్వాసం పెరిగి, సమాజంలో వారు సమాన హక్కులతో జీవించేందుకు మార్గం సుగమమవుతుందని అన్నారు.

## ఆర్‌టిసి ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చెయ్యాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రవాణాశాఖ మంత్రి ఆధ్వర్యంలోని రవాణాశాఖ డిసెంబర్ వరకు వచ్చిన ఆర్థిక వివరాలు బహిర్గతం చేస్తూ ప్రకటనలు జారీ చేస్తూ ఉంటే, ప్రభుత్వ రంగ సంస్థ ఆర్‌టిసి ఆదాయ, వ్యయాలు, లాభనష్టాలు, ఋణాలు, ఆస్తుల తాకట్టు, ప్రభుత్వ చెల్లింపులు లాంటి అంశాలను బహిర్గతం చెయ్యకుండా గత 4 సంవత్సరాలుగా అణు బాంబు లాగా సీక్రెట్ పాలసీ పాటించడం గర్హనీయమన్నారు.

## శుభ సంకేతం

(మొదటి పేజీ తరువాయి)

సభ్యుడు బొలీవియా చర్చల్లో భాగం కాలేకపోయినా, భవిష్యత్తులో ఒప్పందంలో చేరవచ్చని సమాచారం. గత ఏడాది డిసెంబరులో బ్రెజిల్‌కు మెర్కోసూర్ అధ్యక్షత ఉన్నప్పుడే ఒప్పందం సంతకం కాలేదన్న నిరాశే లులా గైర్హాజరుకు కారణమై ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయినప్పటికీ, ఒప్పందాన్ని లులా చారిత్రకంగా అభివర్ణించారు. వాన్ డెర్ లేయెన్, ఈ ఒప్పందం సాధ్యమవ్వడంలో లులా నాయకత్వాన్ని ప్రశంసించారు. ఈ ఒప్పందం దక్షిణ అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు యూరప్ మార్కెట్‌లో మెరుగైన ప్రవేశాన్ని కల్పించనుంది. బ్రెజిల్ పెట్టుబడి సంస్థ ‘ఏపెక్స్’ అంచనాల ప్రకారం, కాఫీ, చికెన్, నారింజ రసం వంటి ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా వచ్చే సంవత్సరాల్లో సుమారు 7 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే, మెర్కోసూర్ కేవలం ముడిసరకుల ఎగుమతిదారుగా మాత్రమే ఉండదని, అధిక విలువ కలిగిన పారిశ్రామిక ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని లులా స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతర్జాతీయ వాణిజ్యానికి సవాళ్లు విసురుతున్న తరుణంలో ఈ ఒప్పందం బహుళ ప్రయోజనాలకు, వాణిజ్య సాన్నిహిత్యానికి చిహ్నమని యూరోపియన్ నేతలు పేర్కొన్నారు.




# కదలివస్తోంది అరుణదండు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాలలో వందేళ్ళ సిపిఐ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 2024 డిసెంబర్ 30న నల్లగొండలో భారీ ప్రదర్శనతో తెలంగాణ రాష్ట్రంలో శతాబ్ది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎన్.జి.కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగిన సభకు డి.రాజాతో పాటు దివంగత సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి హాజరై ఉద్విగ్నపూరిత ప్రసంగం చేశారు. కాగా, ఈ ఉత్సవాల జాతీయ స్థాయి ఉత్సవాల ముగింపు సభ నిర్వహించే అరుదైన అవకాశం ఖమ్మంకు దక్కింది. ఈ వేదిక నుంచి స్వాతంత్ర్యోద్యమ ఘన వారసత్వం కలిగిన కమ్యూనిస్టు పార్టీ ఎలాంటి కార్యాచరణను, సందేశన్ని ఇస్తుందనే ఆసక్తి జాతీయ స్థాయిలో రాజకీయ వర్గాలు, ప్రజల్లో నెలకొంది.



#### మూడు స్రవంతులుగా సాగనున్న ఎర్ర సైన్యం కవాతు

బహిరంగ సభకు ముందు ఖమ్మం నగరమంతా కలియతిరిగేలా ఎర్ర సైన్యం మూడు ప్రాంతాల నుంచి ప్రదర్శనగా రానున్నాయి. పెవిలియన్ స్టేడియం, నయా బజార్ కాలనీ రోడ్, వైరా క్రాస్ రోడ్ ‘శ్రీ శ్రీ విగ్రహం’ నుంచి ఈ ప్రదర్శనలు సరిగ్గా మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయి. వీటిలో పెవిలియన్ గ్రౌండ్స్ ప్రదర్శనలో వేలాది మంది జనసేవాదళ్ వాలంటీర్స్ రెడ్ మార్చ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వారి వెనుక వంద మందితో డప్పు వాయిద్యాల బృందం, ఆ తరువాత గిరిజన నృత్యకారుల బృందం, ఆ తరువాత మహిళలు, లాయర్‌లు, డాక్టర్‌లు, ఇంజనీర్‌లు బృందాలుగా ప్రదర్శనగా సాగుతారు. సభా స్థలి వెలుపల ఈ మూడు ప్రదర్శనలు కలిసే చోట డి.రాజా, కూనంనేని సాంబశివరావులు పూలు జల్లి స్వాగతం పలుకుతారు.

#### వేదికపై 70 అడుగుల స్క్రీన్

సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభ వేదిక వెనుక 70 అడుగుల ఎల్ఇడి స్క్రీన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రసంగాల ప్రారంభానికి ముందు వందేళ్ళ సిపిఐ చరిత్రలో స్వాతంత్రోద్యమం మొదలు, వర్తమానం వరకు ముఖ్య ఘట్టాలను ప్రదర్శించనున్నారు. ఇక వేదికపై 70 మంది ఆసీనులయ్యేందుకు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులతో పాటు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులను ఆహ్వానిస్తారు. వేదికపై కుడి వైపు సాంస్కృతిక ప్రదర్శనల కోసం ప్రత్యేక స్టేజ్‌ని వేశారు. దానికి తెలంగాణ సాంస్కృతిక కళావేదిక అని నామకరణం చేశారు. సభా ప్రాంగణంలో అందరికీ సభ, కళారూపాల ప్రదర్శన కనిపించేందుకు వీలుగా 16 ఎల్ఇడి స్క్రీన్లను కూడా పెట్టారు. అలాగే గ్రౌండ్స్ బైట కూడా ఎల్ఇడిలను ఏర్పాటు చేశారు.




#### శనివారం నుంచి ఖమ్మం బాట పట్టిన పార్టీ శ్రేణులు

కాగా శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు హాజరయ్యేందుకు శనివారం నుంచే వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులు, జాతీయ సమితి సభ్యులు, కార్యకర్తలు చేరుకుంటున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా రాత్రి ఢిల్లీ నుంచి విజయవాడకు చేరుకున్నారు. అక్కడ నుంచి ఆదివారం ఉదయం ఖమ్మంకు చేరుకోనున్నారు.

#### సోషల్ మీడియాలో ప్రత్యక్ష ప్రసారం

ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను సోషల్ మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. యూట్యూబ్‌లో సిపిఐ తెలంగాణ ఛానల్‌లో, అలాగే ఫేజ్ బుక్‌లో సిపిఐ తెలంగాణ పేజ్‌లో లైవ్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

## హైదరాబాద్‌కు డిపిఆర్ కొరియా ప్రతినిధులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖమ్మంలో ఆదివారం జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో పాల్గొనేందుకు వచ్చిన ఢిల్లీలోని డిపిఆర్ కొరియా (ఉత్తర కొరియా) రాయబార కార్యాలయ ప్రతినిధులు జాంగ్ జోంగ్ హ్వాన్ (కౌన్సిలర్), కిమ్ మ్యోంగ్ చోల్ (ఫస్ట్ సెక్రటరీ) లకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం ఉత్తర కొరియా ప్రతినిధులు జాంగ్ జోంగ్ హ్వాన్, కిమ్ మ్యోంగ్ చోల్‌లకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా పుష్పగుచ్ఛాలందించి స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి కొరియా ప్రతినిధులు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు వచ్చారు. అక్కడ వారికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, రాష్ట్ర నాయకులు ప్రేమ్ పావని, నళిని, వెంకటేష్ నాయకులు శ్రీకాంత్, గ్యార నరేష్ , కళ్యాణ్‌లు పుష్పగుచ్ఛాలందించి సాదరంగా స్వాగతం పలికారు.



సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా విజయవాడకు విచ్చేసిన సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు స్వాగతం పలికిన ఆంధ్రప్రదేశ్ సిపిఐ కార్యదర్శి జి.ఈశ్వరయ్య తదితర పార్టీ నేతలు



## సంక్రాంతి విన్నర్‌గా ‘నారి నారి నడుమ మురారి’

శర్వానంద్

సంక్రాంతికి విడుదలైన సినిమాల్లో నారి నారి నడుమ మురారి విన్నర్‌గా నిలబడటం సంతోషంగా ఉందని హీరో శర్వానంద్ అన్నారు. ఈ సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ.. ఇది నాకు చాలా ఎమోషనల్ మూమెంట్. హిట్ కొడతానని చెప్పాను. చెప్పి కొట్టాను. ఇది గర్వంతోనో పొగరుతో మాట్లాడటం లేదు. చాలా హంబుల్‌గా చెప్తున్నాను. హిట్టు కొడతానని అంత నమ్మకంగా చెప్పడానికి కారణం ఈ కథ. రామ్, నందు, భాను వాళ్లు రాసిచ్చిన కథ మొదటి రోజు నుంచే నాకు ఎంతో నమ్మకాన్ని కలిగించింది. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ చేసినా బ్లాక్ బస్టర్ అవుతుందని అనిల్‌కి ముందే చెప్పాను. సంక్రాంతి అనేది రెవెన్యూ పరంగా నలభై, యాభై పెరుగుతుంది. నేను కూడా సంక్రాంతికి రావాలనుకున్నాను అన్నాను. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ శతమానం భవతి గతంలో సంక్రాంతి విజయం సాధించింది. ఇప్పుడు ఈ సినిమా సంక్రాంతి విజయాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉంది టీమ్ అందరికీ కంగ్రాజులేషన్స్. నైజం, వైజాగ్‌లో రిలీజ్ చేసిన మేము కూడా వంద శాతం థియేటర్స్ ఇవ్వలేక పోయాం. కాకపోతే సెకండ వీక్ నుంచి ఫుల్లుగా ఈ సినిమాకి స్క్రీన్స్ పెరుగుతున్నాయి. ఈ సినిమా చాలా పెద్ద హిట్ కాబోతోంది. డైరెక్టర్ సాయి రెండు హిట్లు కొట్టాడు. హ్యాట్రిక్ కొట్టాలని కోరుకుంటున్నాను. శర్వా నెక్స్ట్ మూవీ బైక్ టీజర్ అదిరిపోయింది. ఆ సినిమా కోసం వెయిటింగ్ అన్నారు. డైరెక్టర్ శ్రీను వైట్ల మాట్లాడుతూ ఈ సినిమా డైరెక్టర్ అద్భుతంగా తీశారు. వాళ్ళది హిట్ కాంబినేషన్ అన్ని మళ్ళీ ప్రూవ్ చేశారు. ఈ సినిమా సక్సెస్ కావడం చాలా హ్యాపీగా ఉందని అన్నారు. హీరోయిన్ సంయుక్త మాట్లాడుతూ థియేటర్లో రెస్పాన్స్ చూసిన తర్వాత మా నమ్మకం నిజమైంది అనిపించింది. ఆడియన్స్ సినిమాని హిలేరియస్‌గా ఎంజాయ్ చేస్తున్నారు. అందరూ కూడా యునానిమస్ విన్నర్ అని చెప్తుంటే చాలా హ్యాపీగా ఉంది అన్నారు. డైరెక్టర్ రామ్ అబ్బరాజు, నిర్మాత అనిల్ సుంకర పాల్గొన్నారు.

## వచ్చే యేడాది స్పిరిట్



రెబల్ స్టార్ ప్రభాస్, హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్‌లను అందించిన సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘స్పిరిట్’లో తన కెరీర్‌లోనే మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. మేకర్స్ న్యూ ఇయర్‌కి పవర్ ఫుల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ప్రభాస్‌ను రా, ఫిల్టర్ చేయని అవతార్‌లో ప్రజెంట్ చేసిన ఈ పోస్టర్ వైరల్‌గా మారింది. నిర్మాతలు స్పిరిట్ రిలీజ్ డేట్ ఖరారు చేశారు. వచ్చే ఏడాది సమ్మర్ రేస్‌ను కిక్ స్టార్ట్ చేస్తూ స్పిరిట్ మార్చి 5, 2027న గ రిలీజ్ కానుంది. సందీప్ వంగా మార్క్ ఇన్‌టెన్స్, యాక్షన్, ఎమోషన్స్, రా పవర్‌తో ఈ యాక్షనర్ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని అందించబోతోంది. త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా నటిస్తుండగా ప్రకాష్ రాజ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. భద్రకాళి పిక్చర్స్, టిసిరీస్ ఫిలిమ్స్ సంయుక్తంగా భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ దశలో వుంది. స్పిరిట్ తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడతో పాటు చైనీస్, జపనీస్, కొరియన్ మొత్తం 8 భాషల్లో యూనివర్సల్‌గా రిలీజ్ కానుంది

## 30న ‘ఓం శాంతి శాంతి శాంతిః’





తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సినిమా ఓం శాంతి శాంతి శాంతిః. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి ఈనెల 30న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో తరుణ్ భాస్కర్ సరసన నభా నటేష్ నటిస్తోంది. బ్రహ్మాజీ మరో కీలకమైన పాత్ర పోషించారు. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్‌లో ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కించామని తరుణ్ భాస్కర్ తెలిపారు. వివేక్ దీనికి దర్శకత్వం వహించారు. ఈ మధ్య కాలంలో వచ్చిన ఫ్యామిలీ ఎంటర్ టైనర్ సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని చెప్పారు.

## లీక్

## రికార్డులు బద్దలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. బుచ్చి బాబు సనా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్ సింగిల్ చికిరి చికిరితో మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభించారు. ఈ పాట ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది. ఐదు భాషలలో 200 మిలియన్లకు పైగా వ్యూస్ దాటింది. ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ పాట అదిరిపోయే బీట్, ఎనర్జీ, ఫెస్టివల్ వైబ్, రామ్ చరణ్ వైరల్ డ్యాన్స్‌తో మెస్మరైజ్ చేసింది.‘చికిరి చికిరి’ ఇప్పటికే భారీ రిపీట్ వాల్యూను సాధిస్తూ 2 మిలియన్‌కు పైగా లైక్స్‌ను, మ్యూజిక్ ప్లాట్ ఫాంలలో 60 మిలియన్‌కు పైగా ఆడియో స్ట్రీమ్స్‌ను ఏలుతోంది. మ్యూజిక్ లవర్స్, సినిమా అభిమానులు ఈ పాటను మళ్లీ మళ్లీ వింటూ ప్రతి ప్లేలిస్ట్‌లో తప్పనిసరిగా ఉండే పాటగా మార్చేశారు. ఈ పాట వైరల్ తుఫాను సోషల్ మీడియాను ముంచెత్తింది. 300కే కంటే ఎక్కువ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, 870కే యూట్యూబ్ షార్ట్స్‌లో నెటిజన్లు ఐకానిక్ హుక్ స్టెప్‌ను రిక్రియేట్ చేస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ గర్వంగా సమర్పించిన ఈ చిత్రంలో జాన్వి కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మార్చి 27న పెద్ది థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.




## ‘రామ్ భజరంగ్’ గ్లిమ్స్

సన్ రైజ్ ఎంటర్‌టైన్‌మెంట్, రవి ఆర్ట్స్ బయ్యర్లపై నిర్మాతలు స్వాతిసుధీర్, డాక్టర్ రవి బాల నిర్మిస్తున్న సినిమా ‘రామ్ భజరంగ్’. రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న ‘రామ్ భజరంగ్’ సినిమాకు సి.హెచ్.సుధీర్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. ‘గదర్ 2’ హీరోయిన్ సిమ్రత్ కౌర్, ‘బిచ్చగాడు’ ఫేమ్ సట్న టీటస్, ఛాయా దేవి, మనసా రాధాకృష్ణన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో రాజా రవీంద్ర, రవి శంకర్, కమల్, షఫీ, శివరామరాజు వెంకట్, ధనరాజ్, రచ్చ రవి, రాకేశ్, ఐశ్వర్య ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు అజయ్ విన్సెంట్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. 1980 బ్యాక్ డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ అద్భుతంగా ఉంటాయని, 2026లో ఐదు భాషల్లో (తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ) ఈ సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు, ఈ చిత్ర గ్లిమ్స్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది, ఈ ఈవెంట్ లో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



## అవా ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ హీరో మంచు విష్ణు




అవా ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ సీజన్ 1ను మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు ప్రకటించారు. ఈ మేరకు అవా ఎంటర్‌టైన్‌మెంట్స్ రియాలిటీ ఫార్మాట్‌గా రూపొందించబడిన ఈ పోటీ ఆశావహులైన మేకర్లు గరిష్టంగా 10 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్‌లను సమర్పించాలని ఆయన అన్నారు. ఈ పోటీలో గెలుపొందిన దర్శకుడుకి పది కోట్ల ఫీచర్ ఫిల్మ్‌ను తీసే సదావకాశాన్ని నటుడు, నిర్మాత మంచు విష్ణు కల్పించనున్నారు. నూతన ప్రతిభకు నిరంతరం మద్దతు ఇవ్వడంలో ముందుండే విష్ణు మంచు ఈ కార్యక్రమంతో మరో ముందడుగు వేశారు. అర్హులైన దర్శకులను మెయిన్ స్ట్రీమ్ సినిమాల్లోకి తీసుకు రావడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ ప్రోగ్రాంతో అవా ఎంటర్‌టైన్‌మెంట్స్ కొత్త టాలెంట్‌ను, ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు, భారతీయ సినిమా భవిష్యత్తును రూపొందించడానికి ఇది దోహదపడుతుందని విష్ణు చెప్పారు.

## ‘కొక్కొరోకో’ షూటింగ్ పూర్తి



ప్రముఖ దర్శకుడు రమేష్ వర్మ నిర్మాతగా మారి రూపొందిస్తున్న తొలి చిత్రం కొక్కొరోకో షూటింగ్ విజయవంతంగా పూర్తయ్యింది. నీలాద్రి ప్రొడక్షన్ సమర్పణలో, ఆర్‌వి ఫిల్మ్ హౌస్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా శ్రీనివాస్ వసంతాల దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. సంప్రదాయ కోడిపందాల నేపథ్యం చుట్టూ తిరిగే కథతో, ఐదు విభిన్న పాత్రలతో రూపొందిన అంథాలజీ చిత్రంగా కొక్కొరోకో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి కథ–స్క్రీన్ ప్లేను రమేష్ వర్మ అందించారు. త్వరలోనే విడుదలకు ఈ చిత్రం సిద్ధమవుతోంది. మనస్విని ‘బాలబొమ్మల’ అనే ప్రతిభావంతమైన కళాకారిణి ఈ చిత్రంతో సినీ అరంగేట్రం చేశారు. కొక్కొరోకోలో ఆమె గెస్ట్ రోల్‌లో కనిపించనుంది. మనస్విని థియేటర్‌లో శిక్షణ పొందిన నటి. ఆమె సంప్రదాయ పేర్ని నాట్యం, కర్ణాటక సంగీతంలోనూ ప్రావీణ్యం కలిగి ఉంది.

## ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’ సక్సెస్ మీట్



భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాను అన్ని వర్గాల ప్రేక్షకులు ఆదరించడం సంతోషంగా ఉందని హీరో రవితేజ అన్నారు. హైదరాబాద్‌లో ఈ సినిమా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగకు విడుదల అయిన అన్ని సినిమాలు బాగా పడుతున్నాయని అన్నారు. అందులో మా సినిమాను కూడా ప్రేక్షకులు ఆదరిస్తున్నారని చెప్పారు. ఇంతవరకు తాను ఇలాంటి క్యారెక్టర్ చేయలేదని అన్నారు. ఈ సినిమాకు కాంటెస్ట్ కూడా పెట్టామని తెలిపారు. విజేతలకు రవితేజ బహుమతులు అందజేశారు. సునిల్ చేసిన పాత్ర చాలా కొత్తగా ఉందన్నారు. ఇద్దరూ హీరోయిన్లు చేసిన పాత్రకు మంచి పేరు వచ్చిందన్నారు. భీమ్స్ అందించిన సంగీతం అద్భుతంగా ఉందన్నారు. పాటలకు మంచి రెస్పాన్స్ వస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సునిల్, దర్శకుడు కిషోర్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com